
ఆంధ్ర సచిత్ర వారపత్రిక

33 పైసలు



కొత్త పెళ్ళికూతురు తన అనుభవాన్ని చెబుతోంది.
యవ్వనంలో ముఖంపై వచ్చే మొటిమలెలా పోతాయో చెబుతోంది.

"యవ్వనంలో మొటిమలు రావడం సహజం
వాటిని శుభ్రంచేసి అదుపులో పెట్టడానికే ఎప్పుడూ క్లియరసిల్ వాడటం."



" నాకు 13 ఏళ్లొచ్చేసరికి మొటిమలు రావడం మొదలెట్టాయి...

అయితే నేనంతగా పట్టించుకోలేదు. ఇంకొంచెం ఎదిగిన తర్వాత ఒక రోజున ఒక అబ్బాయి చూడటానికి వచ్చాడు నన్ను.


మరి అతను చూసీ చూడటంతోనే నచ్చలేదన్నాడు

నేనైతే కలలో గూడా అనుకోలేదు మొటిమలు యింత పనిచేస్తాయని, యిలా దారిలో అడ్డుకుంటాయని. నా స్నేహితురాలు జయతో చెప్పానిది .

ఇక అప్పుడు జయ నాకు క్లియరసిల్‌తో ఒకదారి చూపించింది

నేను క్లియరసిల్ రోజుకు రెండుసార్లు రాసుకోవడం మొదలెట్టా. క్రమం తప్పకుండా వాడుతూ వచ్చాను. మరి తర్వాత ఒక రోజున ఏమైందంటే, నా స్నేహితురాలి యింట్లో అదే అబ్బాయి కలిసాడు. యిక అలాగే కన్ను ఆర్పకుండా చూస్తూ వుండిపోయాడు!"

క్లియరసిల్ వేనిషింగ్ మెడికేషన్ మరియు క్లియరసిల్ స్కిన్ కలర్డ్ మెడికేషన్—యీ రెండూ తమ విశిష్టమైన త్రివిధ చర్యతో పనిచేస్తాయి



1. మొటిమలను తెరుస్తాయి
2 మొటిమలను శుభ్రం చేస్తాయి
3. మొటినులను ఆరబెడతాయి

క్లియరసిల్‌కి ఇప్పుడొక జోడు!

ఒకటైతే మీ రెరిగిన క్లియరసిల్ స్కిన్ కలర్డ్ మెడికేషన్ మొటిమల్ని కనిపించకుండా చేస్తూ, తన ప్రభావాన్ని చూపిస్తుంది. మరొకటైతే, కొత్త క్లియల్‌సిల్ వేనిషింగ్ మెడికేషన్ చర్మంలో కలిసిపోతుంది, రాసుకున్నట్టే కనిపించకుండాను, మరి తన ప్రభావాన్ని చూపిస్తుంది. అలంకరణతో సౌందర్యం, మందుకి మందూను.

క్లియరసిల్ ప్రతి రోజూ రెండుసార్లు రాసుకోండి

మొదట మీ ముఖాన్ని కడుక్కోండి ముఖం అంతటిపైనా క్లియరసిల్ రాసుకోండి, మొటిమలున్నచోట మరి కొంచెం ఎక్కువగా. మొటిమలు పోయిన తర్వాత గూడా క్లియరసిల్ రాసుకుంటూనే ఉండండి. ఎందుకంటే క్లియరసిల్, చర్మంలో ఎక్కువగా గల నూనెని లాగేస్తుంది, తద్వారా మొటిమల్ని రాకుండా అదుపులో పెడుతుంది




కొత్త వెనిషింగ్ మెడికేషన్

స్కిన్ కలర్డ్ మెడికేషన్

క్లియరసిల్ – ప్రపంచంలోని నం. 1 మొటిమల క్రీమ్

OBM-8625-R TEL



daCunha/GCM/76/TL/82

ముఖచిత్రం

ఇంతవరకూ పత్రికలకు ఉత్తరాలు వ్రాయని నాచేత 27–5–83 నాటి సంచిక ముఖచిత్రం ఈ ఉత్తరాన్ని వ్రాయించింది. నా అభిమాన నటి, దక్షిణ భారత సినీపరిశ్రమలోనే 'డ్రీమ్ గర్ల్', దీప ముఖచిత్రాన్ని నాకు తెలిసినంతవరకూ ఏ తెలుగు పత్రికగూడా ఇంత అద్భుతంగా ప్రచురించలేదు. ఎందుచేతంటే ఆవిడ ముఖచిత్రాలు, అన్ని పత్రికలవీ నా దగ్గర వున్నాయి కనుక. దీప ముఖచిత్రాన్నే తరచూ ప్రచురించరాదా ?

టి. సత్యనారాయణరావు (ఏలూరు)

న్యూఢిల్లీ లేఖ

నటి సిల్క్ స్మిత ముఖచిత్రంతో వెలువడిన ఆంధ్ర సచిత్ర వారపత్రికలో 'న్యూఢిల్లీ లేఖ'లో డా. జయదుబాషిగారి "అధికోత్పత్తికి ప్రోత్సాహం అవసరమా ?!" అనే అంశంపై విజ్ఞానదాయకమైన విషయాలు తెలియజేశారు.

కలిమిశ్రీ, దుర్గాసత్యం (గుంటూరు)

తప్పు తప్పే !

3–6–83 పత్రికలో 24–4–83 న కీన్స్ హైస్కూలులో 75 మంది వేద పండితులను ముఖ్యమంత్రి సత్కరించి, తమ ప్రసంగం చివర "స్వస్తి ప్రజాభ్యః"కు బదులు "ప్రజాభ్యాం" అన్నారనియు, "ప్రజాభ్యాం" తప్పుకాకపోయినా, వివక్షితార్థాన్ని తెలుపదు గనుక 'స్వస్తి ప్రజాభ్యః' అని సవరించుకొని పలుకాలని కోరుచున్నాను అని తిరుమల రామచంద్రగారు తమ హైదరాబాదు నోటుబుక్‌లో— ముఖ్యమంత్రిగారి తప్పును ఖచ్చితంగా తప్పని చెప్పలేకపోయినందుకు విచారిస్తున్నాము- ప్రవేశం లేని భాషలో తలదూర్చి తప్పులు పలుకడం ముఖ్యమంత్రి పదవిలో ఉన్నవారికి మరీ గర్హనీయం- కనుక ఖచ్చితంగా తప్పని ఎత్తి పలికితే రామచంద్రగారి నిర్భీకతకు సంతోషించేవారము. నాబోటివారు "పార్వతీ పరమేశ్వరాభ్యాం నమః" అనుటకు బదులు "రేభ్యః నమః" అంటే సహస్రారా పండితులు—చీల్చి చెండాడరూ !

చింతకింది కిషన్ (గుడివాడ)



చింతచిగురు

27–5–83 నాటి "ఆంధ్ర సచిత్ర వారపత్రిక"లో శ్రీ తిరుసుల రామచంద్రగారు హైదరాబాద్ నోట్‌బుక్‌లో "చింతపండు"ను అరబ్బులు తమరేహింద్ – భారతదేశపు ద్రాక్ష అన్నారు అని వ్రాసిరి. తమర్ – ఏ – హింద్ అంటే హిందూదేశపు ఖర్జూరము అని అర్థం మన చింతపండు బోటును తమ ఖర్జూరముగా భావించి అరబ్బులు అట్లా అన్నారు. అరబ్బులు ద్రాక్ష పెంచరు. ద్రాక్ష పారశీకుల ఫలం అరబ్బుల ఫలం ఖర్జూరం.

సర్దేశాయి తిరుమలరావు (అనంతపురం)

నిజమైన డాక్టరు

ముద్దంశెట్టి హనుమంతరావుగారి కలం నుండి వెలువడిన కథ "నిజమైన డాక్టరు..." యీనాడు డాక్టర్లు ఎంత దయార్ద్ర హృదయాలతో తమ వృత్తిని నిర్వహించి, రామయ్య, రాములమ్మల లాటి శ్రామికులను ఆదుకొని వారి ఆదరాభిమానాలను పొందుతున్నారో వ్రేళ్ళపై లెక్కపెడితే నూటికి ఎందరు మనకు కనిపిస్తారు ? ఒక్క యిద్దరో లేక ముగ్గురో! వేణు డాక్టరు వృత్తిని చేపట్టి, గతంలో ఏనాడు చేయని ఒక ఔదార్యం ఆ రోజుననే చేయడం కథలోని రహస్యంఏమై వుంటుందో ? పేదవారిని ఆదుకొనే హృదయంగల డా॥ గతంలో మరికొన్ని సంఘటనలను చూపించి వున్నట్లయితే తాను డాక్టరుకు బదులుగా దైవంగానే అగుపించేవాడు. అలా కానందుననే "నిజమైన డాక్టరు"గా మనకు ప్రత్యక్షంగా అగుపించి ఆనందింప చేశాడు.

షేక్ మస్తాను, గాలిబీబి, బేగం. (రేపల్లె)

కొత్త గొంతులు

27–5–83 దీప ముఖచిత్రం ఎంతో ఆకర్షణీయంగా ఉంది.

"కొత్త గొంతులు" ఆసక్తిదాయంగా ఉంది.

ఎస్. బి. శ్రీనివాసరావు (శ్రీకాకుళం)

సీరియల్స్

'ఇది మేఘసందేశము' మమ్మల్ని ఆదిలోనే సుందరసుర లోకాలలో తేలియాడింపజేసింది. ముమ్ముందు మరింత రంజింపజేయగలదని అనుకుంటున్నాం.

కవిరెడ్డి కృష్ణప్రసాద్‌రెడ్డి,
గంటా ఉమాశంకర్‌రెడ్డి (బరంపురం)

* * *

27–5–1983 నాటి 'ఆంధ్ర సచిత్ర వార పత్రిక' ముఖచిత్రము ఎంతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. వక్కలంక పద్మావతిగారి 'ఇది మేఘ సందేశమూ' అన్న కొత్త సీరియల్ చాల ఆకర్షణీయముగా ఉన్నది.

గంగము శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి (బొమ్మనపల్లె)

* * *

27–5–83 నాటి నటి 'దీప' ముఖచిత్రం చాలా అందంగా వుంది. 'ఇది మేఘ సందేశమూ...' సీరియల్ చాలా బావుంది.

కలిమిశ్రీ, దుర్గాసత్యం (గుంటూరు)

* * *

ఇది మేఘసందేశమూ... సీరియల్ ప్రారంభములోనే ఆకట్టుకుంది.

ఎస్. రాజేశ్వరినాయుడు (విశాఖ)

కథలు

27–5–83 నాటి ఆంధ్ర సచిత్ర వార పత్రికను చదివాను. కథలుకూడా నన్ను ఎంతో ఆలోచింపజేసి ఆనందింపజేసాయి. కథలన్నింటిలోకి 'ముగింపుమారని కథ' నాకు చాలా నచ్చింది.

కె. దుర్గాబాయి (గుంటూరు)

* *

27–5 83 నాటి పత్రికలో "ఎడారిలో ఎర్రకలువ" కథ చాల బావుంది." విదేశీ మోజులోపడి చివరకు మన సాంప్రదాయాలే మంచివని పశ్చాత్తాపపడడం సామాన్యం.

ఎం. రమేష్ (తిరుపతి)

దొంగనోట్లు

"దొంగనోట్లు"కథ ముగింపు అసందర్భంగా వుంది. పై కథలో సుబ్బారావు దురదృష్టవశాత్తూ దొంగనోట్ల వలలో చిక్కుకొని మోసపోయాడు. ఈ కథ వల్ల సుబ్బారావుకి జరిగిన అన్యాయానికి న్యాయం జరుగలేదు సరికదా, మోసం చేసే వ్యక్తి బయట పడలేదు.

టి. సుధాకర్‌శర్మ (శ్రీకాకుళం) ★

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938–1972]


శుక్రవారం · 1–7–'83
రుధిరోద్గారి నామ సం. జ్యేష్ఠ బ. షష్ఠి
సంపుటము 75 సంచిక 44

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల రు 1 50
ఆరు మాసాల చందా రు 42 90
పోస్టులో ఏడాది చందా రు. 85 80
ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధీనగరం. విజయవాడ-520 003.

విషయానుక్రమణిక

లోకంపోకడ — డోమెన్



శ్రీమతి గాంధీకీ-థాచర్‌కీ పోలికలున్నాయా?

బ్రిటన్‌కు మార్గరెట్ థాచర్ ఎలాగో భారత దేశానికి శ్రీమతి ఇందిరాగాంధీ అలాగ అని ఇక్కడ ప్రజలు చెప్పుకుంటున్నారు వాస్తవానికి ఇది విరుద్ధం శ్రీమతి థాచర్, శ్రీమతి గాంధీ ఒక మూసలోని వారుకాదు పటిష్టమైన రాజకీయ నిర్ణయాలు, ఏది తప్పు ఏది ఒప్పు అన్న దానిమీద దృఢమైన అభిప్రాయాలు కలిగిన శ్రీమతి థాచర్ ఆదర్శవాది ఆదర్శాలంటె ఏమిటో శ్రీమతి గాంధీకి తెలీదు అలాంటివాటిని రాజకీయంలో నైతిక విలువలుగా ఆమె ఎప్పుడూ పట్టించుకోలేదు థాచర్‌వి ప్రజలకి మేలు చేసే రాజకీయాలు తను చూసిన సమస్యల్ని పరిస్థితుల్ని చూసింది చూసినట్లుగా అందరికీ తెలిసేలా చేస్తుందామె నాటికి తాను సూచించే పరిష్కా-




శ్రీమతి గాంధీ

రాలు ఇవి అని చెపుతుంది వీటికి అంగీకరించినట్లయితేనే నాకు ఓటు వెయ్యండి లేదా మీ ఇష్టం నేను మాత్రం మీ ఓట్లకోసం నా సిద్ధాంతాలను మార్చుకోను అని ప్రజలకి చెపుతుంది ఖచ్చితంగా శ్రీమతి గాంధీ పద్ధతికి ఇది విరుద్ధమైనది శ్రీమతి గాంధి దగ్గర ఇస్తానని చెప్పడానికి ఏమిలేదు నాకు ఓటు వేస్తే ప్రతిఫలంగా మీకు ఏం కావాలో అవి జరుగుతాయి అంటారామె— ఎన్నికల ప్రచారానికి వెళ్ళినప్పుడు పలుకుబడి, ప్రచారంఉన్న వ్యక్తులందరిలాగే శ్రీమతి గాంధీ అవకాశవాది ఆమె రాజకీయాలుకూడా అవకాశవాద రాజకీయాలే

థాచర్ గెలిస్తే అదేమీ అద్భుతంకాదు నిజానికి బ్రిటన్‌లో 35 లక్షలమంది నిరుద్యోగులున్నారు మార్గరెట్ థాచర్ అధికారంలోకి వచ్చినప్పటి సంఖ్యకన్నా ఇది రెట్టింపు అంతే కాకుండా బ్రిటన్‌లో పారిశ్రామిక ఉత్పత్తి పడిపోయింది ఉక్కు ఫాక్టరీలు, హెవీ ఇంజినీరింగ్‌తో సహా అనేకముఖ్యమైన పరిశ్రమలు మూతబడ్డాయి అయినా అక్కడి ఆర్థిక పరిస్థితి ఉత్తర సముద్రంలో దొరికే చమురువల్ల బాగానే ఉంది ద్రవ్యోల్బణం అదుపు తప్పలేదు కానీ చాలా కంపెనీలు మూసివేయబడుతున్నాయి లండన్‌తో సహా అనేక మున్సిపాలిటీల ఆదాయ వ్యయాలు బొటాబొటీగా ఉంటున్నాయి అయినప్పటికీ బ్రిటిష్‌వారు మళ్ళీ మార్గరెట్ థాచర్‌కే ఓటు వేసి మైకేల్ ఫుట్‌ను తిరస్కరిస్తారని నా అభిప్రాయం మైకేల్ ఫుట్ అసమర్థుడే కాదు అభివృద్ధి నిరోధకుడు కూడా థాచర్ నిజమైన రాడికల్ బ్రిటిష్ ప్రజలకు ఎటువైపు ఓటు వేస్తే తమకు మేలు జరుగుతుందో బాగాతెలుసు

బ్రిటన్‌కు సామ్రాజ్యం పోయినా పాత వాసనలు మాత్రం వదలలేదు లండన్ ఇంకా ఇప్పటికీ ఒక సామ్రాజ్యానికి రాజధానిలానే కనిపిస్తున్నది కాని ఐరోపా సముద్ర తీరంలో చిన్న సైజు ద్వీపం పరిమాణానికి తగ్గిపోయిన ఒక చిన్న దేశానికి రాజధానిలా ఉండదు రెండు సంవత్సరాల క్రితం నేను లండన్‌లో ఉన్నప్పుడు, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో సైనికులు ఇంకా డ్యూటీలు మారుతునే ఉన్నారు కానీ ఇప్పుడు వాస్తవానికి అది ఒక చిన్న దేశాధినేతకు వసతి గృహం లాంటిది తప్ప మరేమికాదు



తమకి వాణిజ్యంలో పోటీదారులైన జపాన్ వ్యాపారవేత్తలు సాండ్‌విచ్‌లుపాలతో సామాన్యంగా జీవిస్తూ ఉంటే బ్రిటిషు వాణిజ్యవేత్తలు విలాసవంతమైన క్లబ్బులలో విందులతో గంటల కొద్దీ కాలక్షేపం చేస్తున్నారు గత వైభవాలు ఇప్పుడు లేవు వలస దేశాలు వేరయిపోవడం, షిప్పింగ్, బ్యాంకింగ్ వ్యవస్థల నుంచి ఆదాయం తగ్గిపోవడంతో బ్రిటిషు వారికి తమ అవసరాలు గడవటమే ఇప్పుడు కష్టంగా ఉంటున్నది

బ్రిటిష్ వారు ఇప్పటికైనా తమ విలాసాలు తగ్గించుకొని నడుంబిగించి కార్యరంగంలోకి దిగకపోతే వారిలో చాల మందికి భవిష్యత్తు అంధకారం అవుతుందని చెప్పిన వారిలో మొదటి వ్యక్తి శ్రీమతి థాచర్ ఆమె అమెరికా జపాన్‌ల



శ్రీమతి థాచర్

మంచి నిపుణులను పిలిపించి పరిశ్రమలు పెట్టడంతో సహా ఆర్థిక వ్యవస్థని ఆధునికీకరణ చెయ్యడానికి తగిన సలహాలు చెప్పమని కోరారు బ్రిటన్‌లో పురాతనమైన కర్మాగారాలు ఉన్నాయి కొన్ని ఉక్కు బ్లాస్ట్ ఫర్నేస్‌లు అయితే వంద సంవత్సరాల నాటివి అవి ఇప్పటికే ముడి ఇనుమును ఉత్పత్తి చేస్తున్నాయి కొందరు నిపుణులు ఇలాంటి పాత కర్మాగారాలను మూసి వేసి లక్షలాది పని వారిని తీసేసారు ఎక్కువ బాధ్యతాయుతంగా మెలగండి, తక్కువ పనికి ఎక్కువ వేతనాలు అడగకండి అని శ్రీమతి థాచర్ కార్మిక సంఘాల వారిని కోరారు రాను రాను ఇక్కడ పరిస్థితులు ఎంత దారుణంగా

తయారయ్యాయంటే ఒక ఎలక్ట్రిక్ ఫ్యూజ్ వెయ్యాలంటె ముగ్గురు పని వారిని పిలవాల్సి ఉంటుంది ఒకరు ఫ్యూజు తీయడానికి, రెండవ వ్యక్తి దానిని బాగుచేయడానికి, మూడవ వారు ఆ ఫ్యూజుని తిరిగి పెట్టడానికి ! కార్మిక సంఘాలలోని కార్మికులు తమకు ఇచ్చిన టీ పలచగా ఉందని, మగ్గులు సరిగా కడుగడం లేదని సమ్మెచేసిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి దీనికి ముఖ్యకారణం బ్రిటిషు వారికి కొంచెం బద్ధకం ఎక్కువ ఏదోవిధంగా గడిచిపోతుందనే భావం వారిలో నాటుకుపోయింది ఎవరో వచ్చి ఏదో చేస్తారనుకుంటారు వారు కానీ సామ్రాజ్యం లేనప్పుడు ఎవరికీ ఏదీ రాదనీ, ఎవరి అండదండలు ఆశించకుండా ఎవరి కాళ్ల మీద వారు నిలబడటం నేర్చుకోవాలని శ్రీమతి థాచర్ బ్రిటిష్ ప్రజలకి చెప్పుతున్నారు

శ్రీమతి థాచర్ చేసిన పనిని, చేస్తున్న దానిని చాలమంది బ్రిటిషు వారు మెచ్చుకుంటున్నారు థాచర్ పరిస్థితులననుసరించి మారుతూంటె, మైఖేల్ ఫుట్‌గారి లేబర్‌పార్టీ బురదలో మరింత కూరుకుపోయే విధానాలని అనుసరిస్తోంది నిరుద్యోగ సమస్యని అడ్డం పెట్టుకుంటున్నది యూరోపియన్ కామన్ మార్కెట్‌ని, 'నాటో'ని బహిష్కరించమని కోరుతున్నది అందువలననే చాలా వార్తాపత్రికలు మైఖేల్ ఫుట్‌కుకూడ ఎన్నికల్లో అవకాశం వుండని చెపుతున్నాయి థాచర్ అన్నా, పేదవారి సమస్యలను పరిష్కరించడంలో ఆమె విపరీత ధోరణి పట్ల చాలమందికి అసంతృప్తి ఉన్నదని ఆ పత్రికలు రాస్తున్నాయి

అన్నిటికన్నా ఆశ్చర్యకరమైన విషయమేమంటే రాజకీయాలలో ఎలాంటి అనుభవం లేని ఒక మధ్యతరగతి వ్యాపారి కూతురు మార్గరెట్ థాచర్ అలాంటి వ్యక్తి చేతిలో అత్యంత క్లిష్టదశలో ఉన్న ఒకదేశం భవిష్యత్తు ఆధారపడి ఉందని అంటే అది ఆశ్చర్యం కలిగించే విషయమే మైఖేల్ ఫుట్, తదితరులు వారి జీవితకాలం అంతా రాజకీయాల్లోనే గడిపినవారు మార్గరెట్ థాచర్ కేవలం ఒక మధ్య తరగతి కుటుంబంలో నుంచి వచ్చిన మహిళ ఆమె కొన్ని రోజులు ఐ సి ఐ లో రీసర్చ్ కెమిస్ట్‌గా, మరికొన్ని రోజులు బారిస్టర్‌గా పనిచేశారు— ఆమె వైఖరి అంతా వ్యాపార సరళిలో ఉంటుంది ఈ విషయంలో కూడా శ్రీమతి ఇందిరాగాంధీకి, ఈమెకు చాలా వ్యత్యాసం ఉంది శ్రీమతిగాంధీ గొప్ప వంశంలో నుంచి వచ్చిన వ్యక్తి ఖరీదైన ఐదుచుక్కల హోటళ్ళలో విందులు చేసుకుంటూ తాము మురికివాడలలో నుంచి పైకి వచ్చినట్లు పోజులుకొట్టే రకం శ్రీమతి ఇందిరాగాంధీ కనుక మార్గరెట్ థాచర్ అయితే అప్పుడు నా పేరు జూలియస్ సీజర్ అవుతుంది ! ★

శంఖమునబోసిన తీర్థము...... బి.యస్. రాజు



ఆది స్వామిచిత్రానందుల వారి ఆనందాశ్రమం

సినీ వినీలాకాశం నుంచి తెగిపడిన చుక్కలు ఆయన శిష్య కోటి...

ఆనాటి సాయంకాలం శిష్య పరమాణువులు కొందరు గురువుగారి విరచితమైన 'సినీతి' శతకాన్ని వల్లెవేస్తున్నారు...

స్వాములవారప్పుడే సుఖ నిద్రనుండి మేలుకొని, స్నాన సంధ్యలు ముగించుకుని, ఓ రెండువున్నుల బ్రాందీ మరో వన్‌ట్వంటీ జర్దా బీడా బిగించి సంతుష్టులై కన్నులరమోడ్చి, పద్మాసనులై, సినీధ్యానంలో మునిగిపోయారు...

రిలీజు కాబోయే సినిమాల జాతకాలు చెప్పటం ఆయన వ్యాపకం... శ్రీవారందులో అందెవేసిన చెయ్యని చెన్నపట్నమంతా పేరు...

చుట్టూచేరిన పరమాణువులు సినిమాల పోకడలను చర్చించుకుంటూ, సందేహాలను గురువుగారికి విన్నవించుకుంటూ, వారి వివరణ విని సంతృప్తులౌతున్నారు. సరిగ్గా ఆ సమయంలోనే అక్కడకు రొప్పుతూ వచ్చాడు—క్రొత్తగా ఆశ్రమంలో చేరి, ఆశ్రమ ధర్మాల ననుసరించి 'శంకానంద'గా మారిన శంకర్రావు...

కడసారి పిల్లవాని మీద తల్లితండ్రులకు, క్రొత్త శిష్యుడిమీద గురువులకు వాత్సల్యం రవంత హెచ్చు... శంకానందుడంటే చిత్రానందుల వారి కంతే.

తన ముందు ముకుళితహస్తుడై నిలుచున్న ప్రియ శిష్యుని జాగ్రత్తగా పరిశీలించి, అతని దీర్ఘ శ్వాసలకు కారణం ఉద్వేగమేగాని, అలసట యెంత మాత్రమూ కాదని గ్రహించినవారై – ఆతని చేరబిలిచి –

''నాయనా ... శంకా ... నీ శంకయేమి?'' అని ప్రశ్నించారు.

శంకానందుడు కొంత తడవు తటపటాయించాడు. స్వామివారు పరిస్థితిని అర్థం చేసుకొని, చుట్టూ వున్న శిష్యకోటికి కనుసైగ చేయగా వాళ్లంతా బయటికి వెళ్లిపోయారు.

''ఇప్పుడు చెప్పు నాయనా ... నీ సందేహం యేమిటి ?''

''గురుదేవా ... మీ సినీతి శతకాన్ని చదువుకుంటున్నాను. అందొక పద్యమున తమరు చెప్పిన సామ్యము నా కర్థము కాలేదు'' అన్నాడు.

గురువుగారు వాత్సల్య పూరితమైన దరహాసం చేసి —

''ఔరా నీ తెలివి కలరు ఫిలింగానూ .. ఈ మాత్రం దానికే యింత తటపటాయింపేల నయ్యా . . ఊఁ ... ఏదీ. .ఆ పద్యం చదువూ'' అన్నారు.

శంకానందుడు అందుకున్నాడు —

''బింకమగు సీనులున్నను;
పొంకముగా క్లబ్బు, తొడల భామిని లేకన్
శంఖముఁబోవని జలమగు,
నిం కెందుకు సందియమ్ము లిల,
నిర్మాతా !''

అని పూర్తి చేసి —

''ఇందు శంఖముఁబోవని జలమన్ననేమో నా కెంతయు తోచుటలేదు గురుదేవా'' అన్నాడు.

గురుదేవులు గంభీరులై — ''వత్సా ! అందర్థము కాని పదములేమున్నవి ? అయినను వివరించెద, వినుము . జలమనగా నీరుకదా — పంచామృతాల్లో నొకటైన యీ జలము వస్తుతః పవిత్రమైనదిగా పరిగణింపబడినను, శంఖంలో పోసినగాని తీర్థముగా గ్రహించి సేవింపరు... అలాగే సినిమాల విషయం కూడా. అయితే సినిమాల్లో 'శంఖంలో పోస్తేగాని తీర్థం'కాని విషయాలు చాలా వున్నాయి... అందొక విషయాన్ని మాత్రమే ఆ పద్యంలో వివరించాను . అర్థమైందా?''

''అర్థమైంది స్వామీ... కాని తమరు పిసరంత సందియాన్నైనా పిట్ట కథల్తో నివృత్తి చేస్తారని ప్రతీతి...'' అంటూ నసిగాడు శంకానంద

శ్రీవారు చిద్విలాసులై .. ''శంకా! ఏమో అనుకున్నాను గాని నీవు ఘటికుడవే .. అయితే విను .'' అని మూడైదుల సిగరెట్టొకటి అంటించుకుని మొదలుపెట్టారు చిత్రానందుల వారు—

''ఓ దశాబ్దం క్రిందటి మాట...

నూతనత్వాన్ని కోరే ఓ నిర్మాత చిత్రానికి కథలను తయారుచేసే ఒప్పందంమీద చెన్నపట్నానికి తీసుకురాబడ్డాడు, నిత్యమూర్తి...

నిత్యమూర్తి స్వతహాగా మంచి రచయిత. పరిమితమైన పాత్రలు, పరిధి దాటని వాటి భాషణలు, భావుకత్వపు టంచుల్ని తాకే ప్రకృతి వర్ణన, స్పటికంలోంచి చూసినట్లు పాత్రల మనో విశ్లేషణ— ఇవన్నీ అతని ప్రతి నవలలోనూ ఉండటంచేత ఒక తరగతి చదువరుల నాకట్టుకున్నవాడు ..''

అని సర్దుకు కూర్చుని, కొనసాగించారు—

''కొత్త రచయితలమీద నిర్మాతలకున్న చిన్న చూపు, అపనమ్మకాలవల్ల సదరు నిర్మాత యొక్క ఆఫీసనే జైల్లో నాలుగు నెలలు మగ్గి ఓ చక్కని కథను తయారుచేసాడు, నిత్యమూర్తి.

కథ చక్కగా వుందన్నాడు నిర్మాత, ఆమూలాగ్రం చదివి చిత్రం వందరోజులన్నారు కథ నాలకించిన నిర్మాత శ్రేయోభిలాషులు...

నిత్యమూర్తి తన మొదటి ప్రయత్నం ఫలించినందుకు ఆనందాతిశయాన్ని పొందాడు..

నిత్యమూర్తి సామర్థ్యం మీద నమ్మకం కుదిరిన ప్రొడ్యూసరు తననే ట్రీట్‌మెంటు, సంభాషణలు తయారు చేయమన్నాడు. రెట్టింపైన ఉత్సాహంతో, నిద్రాహారాల కతీతంగా శ్రమించి మరో నెల రోజుల్లో మొత్తం పూర్తి చేసాడు, నిత్యమూర్తి ప్రొడ్యూసరు, డైరెక్టరు వగైరాలంతా నోటినిండా అభినందించి రైలెక్కించారు నిత్యమూర్తిని.

కాలగతిలో చిత్రం పూర్తయి,రిలీజయింది

సొంత ఊరిలో మరో పదిమంది మిత్రులతో హుషారుగా మొదటిరోజు మొదటి ఆటకు వెళ్లి చివరి వరుసలో సెటిలయ్యారు నిత్యమూర్తి మిత్రబృందం .

సెన్సార్ సర్టిఫికెట్ వేసే వరకూ తన అనుభవాల్ని మిత్రులతో పంచుకుంటూ, వాళ్ళ అభినందనలందుకుంటూ ఉబ్బితబ్బిబ్బౌతున్నాడు నిత్యమూర్తి .

టైటిల్స్ మొదలయ్యాయి...

టెక్నీషియన్లలో మొదటవేసేది రచయిత పేరు..

రానేవచ్చింది ..

'కథ, సంభాషణలు—నిత్యానందం' అని...

నిత్యమూర్తికి కళ్లు బైర్లు కమ్మాయి.. హాలంతా గిర్రున తిరిగింది ..తలనొప్పిగా వుందని వాళ్లతో అబద్ధం చెప్పి. బయటికొచ్చి తిన్నగా స్టేషనుకు పరుగెత్తి చెన్నపట్నం చేరుకున్నాడు ..

హుటాహుటిన ప్రొడ్యూసరు దగ్గరికెళ్లి 'ఏమిటీ అన్యాయం' అని అడిగాడు..

దైవసాక్షిగా తనకేమీ తెలీదన్నాడు నిర్మాత. .

డైరెక్టర్నెల్లడిగితే 'అంతా దైవ ఘటన .. తను మానవమాత్రు'ణ్ణన్నాడు. .


చివరికి నిత్యానందాన్ని కలిసి జరిగిన విషయాలన్నీ వివరించి, 'మిత్రమా... ఇద్దరం ఒక జాతివాళ్లం... పైగా మిత్రులంకూడా... ఇది తగునా' అని అడిగితే 'అంతా దైవప్రేరణ... నా పేరువల్ల వాళ్ళకేవో ప్రయోజనాలుండి వుంటాయి... నేను నిమిత్తమాత్రుణ్ణి' అని తప్పించుకున్నాడు నిత్యానందం...'' అని కథకి 'విశ్రాంతి' ప్రకటించారు గురుదేవులు.

'ఇంటర్వెల్' నియమాల ప్రకారం గురువుగారు మరో రెండవున్నుల బ్రాందీ, ఓ జర్దా బీడా బిగించగా, శిష్యపరమాణువు డొంకచాటుగా ఓ గోల్డుఫ్లేకు ప్లెయిను వూది ఇద్దరూ మళ్లీ యథాస్థానాల కొచ్చారు .

వ్యక్తిగతం



మలయాళ చిత్ర పరిశ్రమలో గత 32 ఏళ్లుగా నిష్కళంకమైన వ్యక్తిగా, నిత్య నూతన నటుడిగా పేరు తెచ్చుకున్న ప్రేమ్‌నజీర్ — అసలు పేరు అబ్దుల్ ఖాదర్ — రాజకీయ రంగ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నారు 54 సంవత్సరాల ప్రేమ్‌నజీర్ 600 చిత్రాలకి పైగా నటించి ప్రపంచ రికార్డు స్థాపించారు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలోని ప్రజలలో అమితంగా ఉన్న సినిమా వ్యామోహం, నిరక్షరాస్యత ఆ రాష్ట్రాలలో ఎం జి.ఆర్ , ఎన్.టి.ఆర్.,లు అధికారంలోకి రావటానికి బాగా దోహదం చేశాయని, కానీ కేరళలో నిరక్షరాస్యత, సినిమా మోజు తక్కువ కనుక రాజకీయాలలో ప్రేమ్‌నజీర్ భవిష్యత్తు ఎలా ఉండేదీ చెప్పడం కష్టం అని కొంతమంది రాజకీయనాయకులు, మేధావుల అభిప్రాయం ..



ఒరిస్సా మాజీ ముఖ్యమంత్రి శ్రీమతి నందినీ శత్‌పథి తిరిగి కాంగ్రెస్ (ఐ) లో చేరడానికి చేసిన ప్రయత్నాలు విఫలం అయినాయి. 1977లో ఆమె ఆ పార్టీని వదిలేశారు. ఒకానొక దశలో రాష్ట్ర స్థాయి పార్టీ స్థాపన గురించి ఆమె తమ అనుచరులతో చర్చించారు కూడా కానీ ఎందువల్లనో దానిని కొనసాగించలేదు ఇప్పుడు ఆమె తమ రాజకీయ ఏకాంతవాసాన్ని వదిలించుకోడానికి ఒక జాతీయ పార్టీ(?)లో చేరాలనుకుంటున్నారు



భారతదేశంలో టెలిఫోన్ వ్యవస్థ చాలా భయంకరంగా ఉందని, రోజున్నరపాటు ఎదురుచూస్తేగానీ బొంబాయి నుంచి ఢిల్లీ ఫోన్‌లో మాట్లాడటానికి వీలుపడదని 'గాంధి' చిత్ర దర్శకుడు రిచర్డ్ అటెన్‌బరో అన్నారు .

శంఖంఃబోవని తీర్థం

శంకానందుడు కూర్చుంటూ—"అన్యాయం గురుదేవా" అన్నాడు.

చిత్రానందులు నిశ్చలంగా — "నన్ను మన్నించు శంకా... అది చాలా ఖరీదైన 'నెపోలియన్ బ్రాందీ... లేకుంటే నీకూ యిచ్చేవాడివి" అన్నారు.

"అదికాదు గురుదేవా... నిత్యమూర్తికి జరిగింది..."

"ఓ అదా... అదంతే నాయనా... అందరికీ శకునాలు పలికే బల్లి కుడితి గోలెంలో పడిందట... నిత్యమూర్తి విషయమూ అంతే మరి... విధిలేక మళ్లీ రైలెక్కాడు... సొంత వూరుకి." అని ఆపి —

"శంకా !... ఇలా ఎందుకు జరిగిందో ఆలోచించావా ?" అని ప్రశ్నించారు శిష్యుణ్ణి.

"అర్థమయింది గురుదేవా ! మీరు చెప్పిన కథనుబట్టి యోచిస్తే, నిత్యమూర్తి రాసిన కథ యెంత ఉత్కృష్టమైందయినాసరే అది మామూలు జలం లాంటిది... దానిని 'నిత్యానందం' అనే శంఖంలో పోస్తేగాని పవిత్రమైన తీర్థం కాలేదు" అన్నాడు.

శిష్యుడి విషయ పరిశీలనకు సంతృప్తులయిన చిత్రానందులవారు మరో ప్రశ్న వేశారు— "బాగా చెప్పావు... అయితే ఆ జలం, పవిత్రమైన తీర్థం కావాల్సిన అవసరం వుందా ?"

"ముమ్మాటికీ వుంది గురుదేవా ... అది తీర్థం కానివేళ ఇటు ఫైనాన్షియర్స్‌గాని, అటు డిస్ట్రిబ్యూటర్సుగాని దాన్ని పుచ్చుకోరు గదా ! ..అలా జరిగిన రోజు ప్రొడ్యూసరే వుండడు... ప్రొడ్యూసరు లేనినాడు రచయితగాని, డైరెక్టరుగాని, మరో టెక్నీషియనుగాని ఎలా వుంటాడు? ... అసలు సినిమాలే వుండవు గురుదేవా ..." అని వుద్వేగంగా అని యింకా ఇలా అన్నాడు ... "అందుచేత నా వుద్దేశ్యంలో ప్రొడ్యూసరు చేసింది న్యాయం కాకపోయినా, అన్యాయం కాదు..."

"భళీ ..మరి డైరెక్టరు ?"

"ఇందులో డైరెక్టరుకు ప్రమేయమున్నా ...అది నేరమని నాకనిపించడంలేదు గురుదేవా... మన్నించండి."

"ఎందుచేత శంకా ?"

"మోపేవాడికి తెలుస్తుంది కట్టెల బరువు ... అలాగే రాసేవాడికే తెలుస్తుంది ... మరో రాతగాని కష్టం."

"భేష్...భేష్ . అర్థమైంది. తప్పంతా — తన పేరు వేసినా నోరు మెదపని నిత్యానందానిదంటావ్, అవునా ?"

"కాదు ... నిత్యమూర్తిది."

అంతటిజ్ఞానీ తెల్లబోయాడు శంకానందుడి తీర్పుకి.

మేఘమాల

ఆకాశంలో మేఘమాలను,
వింతగా చూస్తూ —
కేరింతలతో గంతులేస్తున్నాడు ...
ఓ చిన్న కుర్రాడు.

అదే మేఘమాలలో
శృతుల కృతులకై,
వెతుకుతున్నాడు ...
ఓ ... భావుకుడు.

దానిలోనే,
కుంచెల అంచులకు
దారులు తీస్తున్నాడు
ఓ ... చిత్రకారుడు.

అదే మేఘాలను
ఆశతో, ఆర్తితో,
నీటి చుక్కలకై
ఆతృతతో,
పైకి చూస్తున్నాడు
చెమటోడ్చే — కర్షకుడు.

— పి శ్రీనివాస్

గురువుల నుద్దేశించి మళ్లీ శంకానందుడే అన్నాడు —

"అవును గురుదేవా... కరణముఁగరణము నమ్మిన, మరణాంతకమౌనుగాని మనలేదుసుమీ" అన్న సుమతీశతక నీతి తెలిసి కూడా నిత్యానందం తనకు మిత్రుడనుకోవడం నిత్యమూర్తి చేసిన తప్పు."

చిత్రానందుల వారి మొహం విప్పారింది.

"విషయాన్ని చాలా బాగా విశ్లేషించావు శంకా...అయితే నిత్యానందం తప్పు చెయ్యలేదనేగా నీ తీర్పు ?"

"నిత్యానందం చేసింది తప్పుకాదు గురుదేవా...ద్రోహం."

చిత్రానందుల వారి మొహం మాడిపోయింది ... విచార రేఖలు చోటు చేసుకున్నాయి ముఖంలో.

"గురుదేవా ... నేనేమైనా ... తప్పుగా మాట్లాడానా ?"

"లేదు నాయనా... నువ్వు చాలా కరెక్టుగా చెప్పావు..."

"మరి...మీరింతలో...యిలా..."

"ఏంలేదు శంకా... అయినా ఎందుకులే... నీ శంక తీరే పిట్ట కథ పూర్తయిందిగా ... నువ్వెళ్లి చదువుకో నాయనా."

"వెళ్లేదు గురుదేవా ... మీ దుఃఖానికి కారణం చెప్పాలి."

సినిమానందులవారు కొంచెం తెప్పరిల్లి చెప్పటం మొదపెట్టారు —

"కాల చక్రం మరో నాలుగేళ్లు తిరిగింది.

సెక్సే జీవిత పరమార్థమా!

అనుమానం భయం అనేవి సెక్స్ విషయంలో శాపాలు. 20 సం॥ క్రిందట పెనిసిల్ వేనియా లోని పందొమ్మిదేళ్ల లోపు యువకుడు ఒకతను తన స్నేహితురాలు గర్భవతి అయిందని తెలియగానే భయపడ్డాడు. ఈ వార్త నిజంకాదు. కాని ఆ అనుమానం వల్ల అతనికి లైంగిక చర్య అంటేనే ఏవగింపు కలిగింది.

న్యూయార్క్‌లోని అధికారులు ఏ స్త్రీతోను ఎక్కువ రోజులు లైంగిక సాహచర్యాన్ని కలిగి ఉండరు. నాలుగు లేక అయిదు రోజుల సాన్నిహిత్యంలోనే ఆ స్త్రీలోని భౌతికమైనటు వంటి శారీరక లోపాల వల్ల ఆమెపై సెక్స్ పరమైన ఆసక్తి క్షీణించిపోతూ ఉంటుంది.

ఇలాంటి కథలు కౌన్సిలర్స్‌కు, థెరపిస్ట్‌లకు సర్వసాధారణాలే. వాళ్ళకేం ఇవి వింతలు విపరీతాలు కావు. తమ దగ్గరకు వచ్చే సగం కేసులు సెక్స్ కోరికపై ఒకవిధమైన అనాసక్తితో



కూడిన మానసిక ప్రవృత్తికి సంబంధించినవే అని కొంత మంచి సెక్స్ థెరపిస్టులు అంటున్నారు.

ఆ థెరపిస్టుల దగ్గరకు వచ్చే చాలమంది హార్మోన్ల కొరతవల్ల కంతులతో (ట్యూమర్స్), కనబడని శరీరక సమస్యలతో బాధపడేవారేనని వారు అంటున్నారు.

ఫిలడెల్ఫియా పెళ్లిళ్ల సంస్థ మాజీ డైరెక్టర్ సైకియాట్రిస్ట్, ప్రవేటు సెక్సాలజిస్టు అయిన హెరాల్డ్ లీఫ్ తన దగ్గరకి వచ్చేవాళ్లలో 30 శాతం స్త్రీలు 20 శాతం పురుషులు సెక్స్ కోరికపై అనాసక్తితో కూడిన మానసిక ప్రవృత్తితో బాధ పడుతున్న వారే అంటున్నారు. ఈయన అభిప్రాయం నిజమేనని చాలమంది థెరపిస్టులు అంటున్నారు.

కొందరు మనోవికార సంఘర్షణలతో కోపం, భయం, బాల్యదశ వీడక పోవడం ఇట్టి వాటితో బాధపడుతు ఉంటారు. చాలమంది లైంగిక భావం ఉండటం తప్పు అనే ఆలోచనతో తమ కోరికలను అణచుకుంటూ ఉంటారు. సెక్స్ అంటే అనాసక్తి ప్రవృత్తిగల కేసులు చాల మొండికి పడిన కేసులని సెక్స్ థెరపిస్టులు అభిప్రాయ పడుతున్నారు. సైకో థెరపీ ఈ వ్యాధికి బాగా పని చేస్తుందని అంటున్నారు.

న్యూయార్క్‌లోని మమన్‌ట్ సెనాయ్ హాస్పిటల్‌లోని న్యూమన్ సెక్సుయాలిటీ ప్రోగ్రాములో మనస్తత్వ శాస్త్రవేత్త రాల్‌స్కియావి తక్కువగా ఉండే లైగిక వాంఛ అన్న విషయంపై పరిశోధనలు చేసారు. తమ దగ్గరకి వచ్చిన జంటలపై పరిశోధనలు జరిపారు. పురుషులు నిద్రిస్తుండగా ప్రతి 20 నిమిషాలకు ఒకసారి వారిలో ప్రవహించే హార్మోన్స్ కనుగొనటానికై రక్తాన్ని తీసుకున్నారు. స్త్రీలను మాత్రం వారు మేలుకుని ఉండగానే పరీక్ష చేసారు. ప్రణయ కలాపాల్లో తేలుతున్న ఒక



జంట సంభాషణలను టేపు చేసి ఈ జంటలకు వినిపించారు. స్త్రీలకు మాత్రం ఆ సంభాషణలు ఎలాంటి స్పందనను కలుగ చేయలేదు. పురుషులు మాత్రం ఆ సంభాషణలు వింటూ ఆ ప్రణయ దృశ్యాలని ఊహించుకో కలిగారు. కాని దీని వల్ల వాళ్ళకేం ఉద్రేకం కలుగలేదు

"ఈ రకం వారు ఎంత చక్కగా నడుచుకుంటున్నారు. వాళ్ళు చూడటానికి బాగుంటారు, సంతోషంగా ఉంటారు, తమ కుటుంబాలను అభిమానిస్తారు, పని చక్కగా చేస్తారు. కాని వారి సంతోషానికి వెనుక ఒక విధమైన అసంతృప్తి ఉంటుంది. ఇది ఆశ్చర్యకరమైన విషయమే!' అంటారు షీనెర్ ఏంజిల్ "సెక్స్ అనేది వారి జీవితాల్లో ఆదిలోనే అపశృతులు పలికింది. అందువల్ల వారు వారి శక్తినంతా పనిలో లగ్నం చేసి శక్తి మేరకు పని చేసి మంచి అభివృద్ధిని సాధించారు. వేరే ఎలాంటి కష్టమూ వారికి లేదు. లైంగిక వాంఛలు తక్కువైనందు వల్ల నష్టమేమిటి?" అంటారు డొనాల్డ్ కేప్లాన్ అనే మనస్తత్వ శాస్త్రజ్ఞుడు. ★

నిత్యమూర్తి గుర్తింపు పొందిన సినీ రచయితయ్యాడు.

'బుద్ధిః కర్మానుసారిణి' అనీ...తన పేరు హాట్ కేక్‌లా అమ్ముడు పోతోందన్న నమ్మకంతో నిత్యానందం పేరాశకుపోయి, తన సంపాదనంతా పెట్టి తనే నిర్మాతా, రచయితా, డైరెక్టరుగా ఓ భారీ చిత్ర నిర్మాణం మొదలెట్టాడు.

విధి వక్రించి నిత్యానందం గ్లామరు కొంత తగ్గింది. డబ్బు చాలక — చిత్ర నిర్మాణం ఆగిపోయిన తరుణంలో తన కనుకూలుడైన ఫైనాన్షియర్ దగ్గరకెళ్లి విషయం విన్నవించాడు. పెదవి విరిచాడు ఫైనాన్షియర్ ... ఫలానా పేరును డైరెక్టరుగాను, నిత్యమూర్తి పేరును రచయితగాను పబ్లిసిటీ వేసుస్తే తప్ప ఫైనాన్స్ చెయ్యడం వీలుపడదన్నాడు.

విధిలేని పరిస్థితుల్లో డైరెక్టరును బ్రతిమాలుకోగా, ఒప్పుకున్నాడు. ఆత్మాభిమానాన్ని చంపుకొని, హోటల్ రూమ్‌లో డిస్కషన్సులో వున్న నిత్యమూర్తిని కలిసి విషయం వివరించి, ప్రాధేయపడ్డాడు.

నిత్యమూర్తి ససేమిరా వీల్లేదన్నాడు ... 'నేను నిమిత్తమాత్రుణ్ణి కాదు నిత్యానందం గారూ ... ఆత్మాభిమానం, వృత్తి గౌరవం వున్నవాణ్ణి ... మీరు వెళ్లిరండి' అన్నాడు.

నిత్యానందం తలొంచుకుని వొచ్చేస్తుంటే వెనకనుంచి నవ్వులు వినిపించాయి.

అంతే .. ఆ మర్నాటి నుంచి నిత్యానందం కనిపించలేదు ... అంటుంటే సినిమానందులవారి కళ్ళు చెమ్మగిల్లాయి.

"అన్యాయానికి న్యాయం జరిగింది గురుదేవా .. ఇందులో మీరింతగా బాధపడవలసిన విషయమేముంది ?"

"ఉంది నాయనా ... ఆ నిత్యానందాన్ని నేనే."

"!?......" ★

వారఫలితం

1-7-1983 శుక్రవారం మొదలు 7-7-1983 గురువారం వరకు

♈ మేషం: అయిదారు విధాల లాభించే లాగు కనిపిస్తుంది. ఉన్నత ప్రయాణాలకై యత్నించే వారికి అనుకూల ఫలితం ముఖ్యంగా విద్యా విషయకంగా చెప్పవచ్చు. వ్యాపారం బాగానే ఉంటుంది. స్త్రీలకు: కొన్ని రంగాలలో అంటే సాహితీ రంగంలో రచనలో, నటనలో, ఉద్యోగసంపాదనలో మేలున్నది.

♉ వృషభం: ధన లోపం కనిపించదు. మిత్ర బాంధవులతో వారమంతా కాలక్షేపం చేయగలుగుతారు. శుభ ప్రస్తావనలు కలిసి రాగలవు. కొందరు చాల కాలంగా యత్నించిన వాహనం ఈ వారం లభ్యమయ్యే మార్గ మున్నది. స్త్రీలకు: పోగొట్టు కొన్న వస్తువుల భోగట్టా తెలిసికోగలరు, ఆదాయ మున్నది.

♊ మిథునం: అధికారుల వలన, అయినవారి వలన, మిత్రుల వలన జరుగవలసిన పనులు సుకరంగా జరిగి పోతాయి. విలాస వస్తువులు, ఖరీదు గల వస్త్రములు సేకరించుకో గలుగుతారు. స్త్రీలకు కుటుంబ పెద్దల వలన మేలు పొందనున్నారు. కొందరకు దూర ప్రాంతాలకు పయనించే అవకాశ మున్నది

♋ కర్కాటకం: చాల కాలంగా రాక నిలచిన ధనం చేతి కందే మార్గ మున్నది. కొంత కాలంగా యింటికి రాక నిలచిన బంధువులు హఠాత్తుగా ఈ వారం రానున్నారు. విందు వినోదాలలో పాల్గొనుట, సభా కార్య క్రమంలో పాల్గొనుట కొందర విషయంలో చెప్పదగిన అంశాలు. స్త్రీలకు: నూతన సోద్యోగ ప్రయత్నాలు ఫలవంతం కానున్నవి.

♌ సింహం: ఉన్నత విద్యా ప్రయత్నాలు సాగ రాగలవు ఆశించిన ధనం సమయానికి చేతికి అందక అవసరాలు తీరుతాయి. ఒకానొక విషయంలో మీరు పట్టిన పంతమే నెగ్గుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు సాగిరానున్నవి. వ్యాపారం కలిసి వచ్చే మార్గ మున్నది. స్త్రీలకు: శుభ కార్య ప్రస్తావనలు, నగలు సంపాదించుకొనే మార్గ మున్నది.

♍ కన్య: చిర కాలంగా పరిష్కారం కాని భూ విషయం, నగల విషయం పరిష్కారం కాగలవు. ఉద్యోగ రంగంలో మీకు విలువ పెరుగుతుంది. శ్రమకు తగ్గ ఫలితం లభించే మార్గమున్నది. వ్యాపారంలో నూతన మార్గం చిక్కుతుంది. కొందర విషయంలో ఉద్యోగ రీత్యా 'ప్రమోషన్' లభించే మార్గ మున్నది. స్త్రీలకు: శుభ ప్రస్తావనలు బంధువుల కలిసి కోవటం సంభవం, గ్రహించండి

♎ తుల: 'ఈ వ్యవహారంలో మీదే గెలుపు' అనుకొన్నారు. చివరకు వారాంతంలో వ్యవహారం మీకు ప్రతి కూలం అవుతుంది. బంధువుల ప్రాంతాలకు మీరు ప్రయాణించనున్నారు. అంత మాత్రమే గాక శుభ కార్య నిశ్చయం సంభవమే స్త్రీలకు: యోగాభివృద్ధి గల వారం.

♏ వృశ్చికం: 'రాజకీయంగా మేలు కలుగుతుందని' ఆశించిన మీకు ఆశా భంగమున్నది. అవసరాలకు తగినంత మాత్రమయినా చేతికి లభించటం జరుగుతుంది. ధర్మాదాయ వ్యవహారాలలో మీదే పైచేయిగా పరిగణింప వచ్చు. స్త్రీలకు: బంధువిరోధం, ధనాభావం, ఆశా భంగం చెప్పదగిన వారం.

♐ ధనుస్సు: ఏవేవో ఆలోచనలు మెదలుతాయి. ఎవరెవరినో కలిసి కోవాలని యత్నిస్తారు సభా కార్య క్రమంలో పాల్గొనాలని యత్నిస్తారు. కాని ఏ ఒక్కటి గాని అనుకొన్న విధంగా కలిసి రాదు. స్త్రీలకు: ఉద్యోగ రీత్యా చేసిన ప్రయత్నాలు ఫలవంతం కాగలవు. ఆదాయంలో అభివృద్ధి చెప్పదగిన వారం.

♑ మకరం: ఎవరిని నమ్మాలో ఎవరిని దూరంగా ఉంచాలో, ఏ వ్యవహారం ఫలవంతమో, తెలిసికో లేక తికమక పడుతారు. రాజకీయంగా ఏదో మేలు సంక్రమిస్తుందని ఆశపడితే, అది అంతంత మాత్రమే అని అనిపిస్తుంది. స్త్రీలకు: సాటివారితో కలతలు, వ్యర్థ ప్రయాణాలు, ప్రయోజనా రహితమైన కార్యక్రమం సంభవం

♒ కుంభం: వ్యాపార రీత్యా మీకు అనుకూల కాలమే ముద్రణా వ్యవహారాలు, పత్రికా ప్రకటనా కార్య క్రమ వ్యవహారాలు సత్ఫలదాయకాలు. విలువ గల వస్తువులు సంపాదించుకో గలుగుతారు. విరోధించి దూరంగా పోయిన వారు దాపునకు రాగలరు. స్త్రీలకు: ఉద్యోగాభివృద్ధి, నూతన ప్రయత్న సిద్ధి గల వారం.

♓ మీనం: కొన్ని నెలలుగా ఎటూ తేలని ఒకానొక పరిస్థితి, మీకు అనుకూలంగానే నెరవేర నున్నది. పొరుగూరి వారి సహాయం అపేక్షిస్తారు గాని అదేమీ కలిసి వచ్చే మార్గం లేదు. స్థిరాస్తి వృద్ధి గావించే మార్గ మున్నది. నటనా సామర్థ్యం, రచనా చాకచక్యం గల వారికి, వారం, ప్రోత్సాహకరంగా ఉంటుంది. స్త్రీలకు: యోగకాలం, నాల్గు విధాలా కలిసి వచ్చే మార్గ మున్నది గ్రహించి శ్రమించండి.

విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి

వానాకాలం వచ్చేసింది.
అయినా ఆరోగ్యం గురించి ఆందోళన అనవసరం.



వాతావరణం మారినా, కాలం మారినా
తల్లులకి ఎంతో ఆందోళన కలుగుతుంది.

అన్ని సమయాలలోనూ పిల్లలు మంచి ఆరోగ్యంగా వుండటం ఎంతో అవసరం

మంచి, ఆరోగ్యం కోసం మంచి పోషకాహారం కావాలి.

హార్లిక్స్ అంటే ప్రతి నిత్యమూ ఆరోగ్యంగా వుండటం అన్నమాట.

అందువల్లనే కోట్లాది మంది 100 సంవత్సరాలకు పైగా హార్లిక్స్ మంచి గుణాలను విశ్వసిస్తున్నారు.


ప్రపంచ వ్యాప్తంగావున్న డాక్టర్లంతా ఆరోగ్య సంరక్షణకు హార్లిక్స్ ఆదర్శప్రాయమైనదని సిఫారసు చేశారు.

అంటే ఆశ్చర్యం లేదు.

హార్లిక్స్‌లో వున్న విలువైన, స్వచ్ఛమైన పోషక పదార్థాలను, వాటి మంచి గుణాలను కాపాడే విధంగా, తేలికగా జీర్ణమయే విధంగా అద్భుతమైన పద్ధతిలో మిశ్రమం చేశారు.

హార్లిక్స్ మీ కుటుంబ జీవితంలో భాగంగా వుండేటట్టు చూసుకోండి.

మబ్బులు కమ్మినా, రాత్రి సమయమయినా



మంచి పుష్టికరమైనది



(గత సంచిక తరువాయి)

త్రిపురాంతకుడూ, పద్మగంధీ నేలమాళిగ దాటి వెలుపలకు వొచ్చారు. త్రిపురాంతకునికి గండం గడిచినట్లు అనిపించింది.

ఇద్దరూ త్వరగా నడుచుకుంటూ అశ్వాలను కట్టివేసిన చోటుకు చేరేరు. కాని అక్కడ అశ్వాలు కనిపించలేదు.

"ఏమిటి ? గుర్రాలు ఎలా మాయమయ్యాయి ?" ఆత్రుతతో అడిగింది పద్మగంధి.

"మన గుట్టు ఎవరో కనిపెట్టేరు" అన్నాడు త్రిపురాంతకుడు.

"త్రిపురాంతకా! నీవు చెప్పింది యదార్థం. నీ గుట్టు బట్టబయలు అయింది. అయితే చెప్పవలసింది ఇంకా ఉంది. అది నీ చావు గురించి కాబట్టి నువ్వు చెప్పగూడదులే ! నేను చెబుతున్నాను. యీ రోజుతో నీవు యమపురికి చేరుతావు" అని వినిపించింది.

పద్మగంధికి కాళ్ళు వొణకసాగేయి. త్రిపురాంతకుడు మనసు కుదుట పరచుకుని ఎటువంటి స్థితినైనా సరే ఎదుర్కొనటానికి ఉద్యుక్తుడయ్యేడు.

ప్రక్కనే ఉన్న చెట్టుమీది నుండి ఒక సమున్నత శరీరం కలిగిన ఒక కాషాయాంబరధారి దిగి వొచ్చేడు.

"ఎవరు నీవు ?" ప్రశ్నించేడు త్రిపురాంతకుడు.

"నన్నే గుర్తించలేదా ?"

"ఏమో తెలియదు."

"పిల్లి కళ్ళు మూసుకుని పాలు త్రాగుతున్నట్లు అనుకోకు."

"నీవాచాలత్వంవల్ల ప్రయోజనం లేదు. నీవు ఎవరో నాకు తెలియదు."

"మరచిపోయి వుంటావు. లేదా మరచిపోవాలని ప్రయత్నం చేస్తూ వుండి వుంటావు. ఎట్టకేలకు నీ పని నెరవేర్చావు. ఘటికుడివే. కాని ప్రయోజనం లేదు. నీవు బ్రతికి ఉంటే కదా యీ వార్తను రుద్రాంబకు చేరుస్తావు ?"

"వార్తలు ఏమిటో, రుద్రాంబ ఏమిటో నాకు తెలియదు."

"చారులకు అబద్ధాలు చెప్పే అవుసరం వుంటుంది. చెప్పవచ్చు. కాని నా ముందు ఎందుకు త్రిపురాంతకా !"

"నా పేరు కూడ అది కాదు."

"నీ పేరు అది కాదేమో కాని నా పేరు వసంతుడు" అంటూ మరి కొంచెం దగ్గరగా వొచ్చేడు.

ఆ మాట వింటూనే హతాశుడయ్యేడు త్రిపురాంతకుడు. వసంతుడు రాజప్రసాదంలో పని చేసినవాడే తనను బాగా ఎరుగును. ప్రభుత్వాన్ని వెన్నుపోటు పొడిచేందుకు యిక్కడ చేరేడు.

"నువ్వా" అంటూ ఒక ఛురికను దుస్తుల్లోంచి పైకి తీసి అతడి మీదికి లంఘించేడు త్రిపురాంతకుడు.

"ఆ ప్రయత్నాలు మానుకో. చుట్టూ ఎవరున్నారో చూడు" అన్నాడు వసంతుడు.

చుట్టూ పరికించి చూచేడు త్రిపురాంతకుడు. అతని చుట్టూ దాదాపు నూరుమంది సన్యాసులు దూరంగా నిలబడి ఉన్నారు. వారందరి చేతుల్లోనూ కత్తులున్నాయి. చార విద్యలో ఆరితేరినవాడు త్రిపురాంతకుడు. ఇటువంటి సమయం ఎదురైనప్పుడు యుద్ధం చేసి జయించటం అసాధ్యం కనుకా, యుద్ధంలో చనిపోయినందువల్ల కొన్ని రహస్యాలు— ప్రభుత్వానికి అత్యవసరమైనవి — తనతోనే భూస్థాపితం అయిపోతాయికనుకా— వాళ్ళని కికురించి పారిపోవాలి. యుద్ధరంగంలో అయితే వెన్నుచూపకూడదు. కాని చారవిద్య వేరు.

కాని యిప్పుడు అలా కికురించి పారిపోయేందుకు కూడా వీలులేదు. ప్రక్కన పద్మగంధి ఉన్నది. ఆమెను ఒంటరినిచేసి తాను పారిపోవటం భీరుత్వ మవుతుంది.

ఏమయితే అది అవుతుంది లెమ్మని వెర్రి ధైర్యంతో అలాగే నిలబడిపోయాడు త్రిపురాంతకుడు.

వసంతుడికి తెలుసు, అతని చేతిలో ఛురిక ఉంటే ఎవరూ ఏమీ చేయలేరని.

"ఛురిక యిలా విసుదు" అన్నాడు వసంతుడు దూరంగానే నిలిచి. త్రిపురాంతకుడు గురిచూచి అతని గుండెల్లోకి విసిరేడు ఛురికను. కెవ్వున అరచి కుప్పలా కూలిపోయేడు వసంతుడు.

తక్షణమే తన కర్తవ్యాన్ని నిర్ణయించుకుని పద్మగంధి చేయి పుచ్చుకుని బాణంలా దూసుకుని పొదలమాటుకు తప్పుకుపోయేడు.

ఆ చుట్టూవున్న సన్యాసులు జరుగుతున్నదేమిటో అర్థం చేసుకుని ప్రతిచర్యను నిర్ణయించుకునేలోపుగానే యిదంతా జరిగిపోయింది.

"దగ్గరలోనే ఉంటాడు. వెతకండి. ఎవరి కంటపడితే వారే చంపివెయ్యండి. పొదలన్నీ గాలించండి" అంటూ పొదలమీదపడి గాలించ సాగేరు సన్యాసులు.

కళ్ళఎదుట ఉండగానే పట్టుకోలేని ఆ సన్యాసులకు పొదలచాటుకు పోయేక త్రిపురాంతకుడు ఇంకా ఎలా దొరుకుతాడు?

అతడు తప్పుకుని ఎప్పుడో వెళ్ళిపోయేడు పద్మగంధితో సహా.

ఓరుగల్లు చేరగానే పద్మగంధిని పాంథశాలలో విడిచి శివదేవయ్య దర్శనార్థమై వెళ్ళేడు త్రిపురాంతకుడు.

శివదేవయ్య ఆలోచనా మందిరం చారులతో నిండి ఉంది. వారి చర్చలు త్రిపురాంతకుడు

జరిగిన కథ — 9 : పద్మగంధి ఒక భిక్షకత్తె వేషంతో ఓరుగల్లులోని ఒక పాంథశాలకి చేరుతుంది. తను, పరదేశి కలసి గోపాల దేవునికి బుద్ధి చెప్పాలనుకుంటుంది. త్రిపురాంతకుడు గోపాలదేవునికి బాగ బుద్ధి చెపుతాడు. ఆహవమల్లు జైనస్వామి ఆదేశానుసారం జైన సభలు ప్రారంభించను ఏర్పాట్లు చేయడనికి మొగలిచెర్లలో విడిది చేస్తాడు. మొగలిచెర్లలో ఏ హరిజనుడు ఏకవీరదేవి ఆలయానికి వెళ్ళరాదని ఆజ్ఞ జారిచేస్తాడు వెంకన్నదొర. గోపాలదేవునికి స్పృహ పోగొట్టి పద్మగంధితో పాలంపేట చెర్వుకి బయలుదేరాడు త్రిపురాంతకుడు. వారిద్దరు రామప్ప ఆలయంలో జైనస్వామిని కలుస్తారు. జైనస్వామి పద్మగంధిని గుర్తిస్తాడు. ఏకవీర ఏడుకొండలవాడే తన సర్వస్వం అని భావించడం చూచి శ్రీదేవుని మనసు వికలమైంది. శ్రీదేవుడు స్వామిని నిందించగా ఏకవీర శ్రీదేవుడ్ని గాయ పరుస్తుంది. జైనస్వామి పద్మగంధిని జైనం స్వీకరించమని కోరగా తిరస్కరిస్తుంది.

ఏమయ్యేడన్న విషయంమీదే సాగుతున్నాయి. అందుకు కారణం లేకపోలేదు.

గోపాలదేవుడికి జరిగిన అవమానం ఓరుగల్లులో పెద్ద జ్వాలలు రేపింది. గోపాల దేవుడు స్పృహవచ్చేక వెళ్ళి తన వర్గీయులతో ఇదంతా హిందువులు కావాలని చేసిన కుట్రగా వర్ణించి చెప్పేడు. వారంతా పార్శ్వనాథుణ్ణి స్మరించి రౌద్రం దాల్చేరు.

నగరమంతా రెండు ఝాముల్లో అట్టుడికి పోయి పెద్ద యుద్ధరంగమయింది. హిందువుల గృహాలకు నిప్పు అంటుకుంది. ఎందరో హిందువులు బలిఅయ్యారు. కాని యీ జరుగుతున్నదంతా ఎవరు చేస్తున్నారో ఎందుకు చేస్తున్నారో అర్థంకాకుండా పోయింది.

దీనిని ఆపాలంటే ఏమి చెయ్యాలో శివదేవయ్యకుకూడ తోచలేదు. మూలకారణం ఏమిటో, ఎక్కడనుండి యీ గందరగోళం సృష్టించబడుతున్నదో అర్థంకాకుండా ఆయన మాత్రం ఏమిచెయ్యగలుగుతాడు? చారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

ఇటువంటి సమయంలో త్రిపురాంతక దేవుడు కనిపించకుండా పోవటానికి ఏవో బలీయమైన కారణమే ఉన్నదని ఊహించేరు వారంతా. అదే సమయానికి త్రిపురాంతకదేవుడు అక్కడకు



చేరేడు అతడికి విషయమంతా వివరించేడు.


అంతా విన్నాక త్రిపురాంతకుడు ఒక నిర్ణయానికివచ్చి తన చారుల్లో మెరికల్లాంటి వారికి కొన్ని రహస్యమయిన పనులు పురమాయించి పంపేడు. చారులంతా ఎవరు పనులు మీద వారు వెళ్ళిపోయేరు.

గదిలో త్రిపురాంతదేవుడూ, శివదేవయ్య గారూ మిగిలేరు.

''మహామంత్రులకు అభివాదం'' అన్నాడు త్రిపురాంతకుడు.

త్రిపురాంతకుడు లోపల ప్రవేశించటమూ, చారులు అతడికి విషయాన్ని వివరించటమూ, వెంటనే వారికి త్రిపురాంతకుడు ఏవో కార్యక్రమాలు నిర్దేశించి పంపటమూ యిదంతా చూస్తూనే ఉన్నారు శివదేవయ్య.

''నాయనా నీవు ఎక్కడకు వెళ్ళేవు?'' మహామంత్రి ప్రశ్న.



"నేను జైనస్వామిని చూచి వచ్చేను" అంటూ అంతా పూసగ్రుచ్చినట్లు వివరించేడు త్రిపురాంతకుడు. అంతా మౌనంగా విని తల పంకించేరు ఆయన.

"ఇప్పుడు మనం దాడివెళ్ళినా అంత ప్రయోజనం ఉండదనుకుంటాను" అన్నారాయన.

"అవును. నేను ఎవరికంటా పడకుండా రావాలనే ప్రయత్నించేను. అదృష్టం బాగుండి అలా జరిగివుంటే జైనస్వామిని బంధించటం సుఖతరమై ఉండేది. కాని వసంతుడు చూచేడు. ఇప్పుడు మనం వెళ్ళినా నేలమాళిగ స్వాధీనమౌతుందే కాని స్వామి ఉండకపోవచ్చు." అన్నాడు త్రిపురాంతకుడు ఆయన అభిప్రాయంతో తాను ఏకీభవిస్తూ.

"అంతేకాదు నాయనా! యుద్ధంలో మనం ఆతడిని అణచివేయాలని ప్రయత్నించ కూడదు; అలాచేస్తే అతడు చేసిన తప్పలు ప్రజలకు తెలియవు. అతడెలాగూ జైన సభలకు రావాలికదా! అప్పుడు ప్రజలముందే అతడు నేరస్తుడని మనం నిరూపించాలి. మనం వశ పరచుకోవలసింది జైనస్వామి శరీరాన్ని కాదు నాయనా! ప్రజల హృదయాలను. నీవు తక్షణమే అవసరమయినవన్నీ సమకూర్చుకుని వెళ్ళు మొగిలిచెర్ల" అంటూ ఆదేశించేరు శివదేవయ్యగారు. త్రిపురాంతకుడు ఆయన దగ్గర శలవు పుచ్చుకుని బయలుదేరేడు. అతడికి సాయంత్రం వరకూ అవసరమయిన సామగ్రిని సమకూర్చుకోవటంతోనే సరిపోయింది. కొంత మంది శిల్పులను ముందుగానే మొగిలిచర్ల వెళ్ల వలసిందిగా ఆదేశించాడు.

పొద్దుకూకే వేళకు పాంధశాల చేరేడు త్రిపురాంతకుడు. ఒక చారుడు వచ్చి చేతులు కట్టి నిలిచేడు.

"ఏమి జరిగింది" అన్నాడు కుతూహలంగా త్రిపురాంతక దేవుడు.

"గోపాలదేవుడూ, అతడి అనుచరుల్లో కొందరూ దొరికేరు. మిగిలినవారికోసం గాలింపు జరుగుతోంది" అంటూ విన్నవించాడు చారుడు.

తిరుచరణాలు

"సరేవెళ్ళు" అంటూ అతడిని పంపి వేసేడు.

త్రిపురాంతకునికి యింతదాకా వొచ్చేక ఒక సందేహం కలిగింది. శివదేవయ్యగారు జైనస్వామి చేసిన తప్పుల్ని మొగిలిచర్లలోనే ప్రజల సమక్షంలో నిరూపించాలన్న ఆలోచన ఉంది. అలా జరగాలంటే పద్మగంధిని సురక్షితంగా కాపాడవలసిన అవుసరముంది. జైనస్వామికి వసంతుడు కథంతా వివరించేక ఆయన పద్మగంధిని కూడ తన విరోధి వర్గంతో కలిపి ఆలోచిస్తాడు. కాబట్టి ఆమెకు ఏదయినా ముప్పు వాటిల్లవచ్చు.

"అమ్మా యీ రాత్రికే మన ప్రయాణం" అన్నాడు త్రిపురాంతకుడు ఆలోచనల నుండి పూర్తిగా తేరుకోకుండానే.

"నేను యీ వార్తకే ఎదురు చూస్తున్నాను" అన్నది పద్మగంధి.

"బహుశా, నీవు వేషం మార్చాననుకుంటాను. ఇప్పుడిక అంత అవుసరం లేదు కాబట్టి నీవు మారువేషం తీసివేసి మామూలు దుస్తులు వేసుకోవచ్చు" అన్నాడు త్రిపురాంతకుడు.

పద్మగంధి తన వస్తువులుంచిన చోటు చూపింది త్రిపురాంతకునికి. ఆమె తెగింపు చూచి ఆశ్చర్యపోయేడు.

అంత రాత్రిలో ప్రయాణం ఆమెకు భయమనిపించలేదు. తన ప్రక్కనే గుర్రంమీద వొస్తున్న వ్యక్తి ఆంధ్ర మహాసామ్రాజ్య గూఢ చారుల వర్గానికి నాయకుడు మరి!

"అమ్మా! నీవు యజ్ఞం పూర్తి అయ్యే వరకూ మాతో ఉండాలి" అన్నాడు త్రిపురాంతకుడు. అతని మనసులో తన రక్షణ గురించిన శ్రద్ధ ఎంతటిదో అర్థం చేసుకున్న పద్మగంధి మనసు ఆర్ద్రమయింది.

"నేను చేయవలసిన పనులు యింకా చాల ఉన్నాయి. కనుక నేను కూడ సురక్షితమయిన చోటునే ఉండదలచాను" అంటూ అతనికి సమాధానం యిచ్చింది పద్మగంధి.

తన మనసులోని అనుమానాన్ని, భయాన్ని ఆమె గ్రహించిందని తేటతెల్లమయింది త్రిపురాంతకునికి. సంతోషంతో గుర్రాన్ని అదిలించేడు. చిమ్మచీకటిలో ఆ రెండు గుర్రాలూ మొగిలిచెర్ల వైపుగా దౌడు తీయటం ప్రారంభించేయి.

14

"శ్రీదేవా! నీవు ధన్యుడవయ్యా! యీ శిల్పాలను ఎంత చక్కగా తీర్చిదిద్దుతున్నావు. ఆంధ్ర సామ్రాజ్యం నీకు ఋణపడిందయ్యా" అన్నాడు మహాదేవుడు.

"అంతా మీ ఆశీర్వచనమే బాబూ!" అంటూ వినమ్రుడై పలికేడు శ్రీదేవుడు. అతని వినయ సంపదకు పండితులకు సంతోష మయింది.

"నాయనా! మన యజ్ఞ వేదిక నిర్మించటానికి నీవు తయారుచేస్తున్న విధానం ఎటువంటిది అంటూ ప్రశ్నించేడు పశుపతి.

శ్రీదేవుడు తన పథకాన్నంతా విపులంగా వివరించసాగేడు.

"యజ్ఞ వేదిక అనగానే చతుర్ముఖమయిన మండపం. అంటే పుష్పకము, వైరాజకమూ అనే తొమ్మిది విధాల వాస్తురీతులలో పుష్పక పద్ధతిలో ఉండాలన్నమాట.

నాలుగు ప్రక్కల నాలుగు స్తంభాలుంటాయి. స్తంభాలు షట్కోణాకారంగా ఉంటాయి. స్తంభాలను ముక్కోణాకారంగానూ, చతురస్రంగానూ కూడ చెక్కవచ్చు. కాని షట్కోణాకారంగానూ, అష్టకోణాలతో నూ చెక్కితే ఎక్కువ దృశ్యాలను చూపటానికి వీలు అవుతుంది.

ఈ స్తంభాలమీద శివగాథలూ, రామాయణ గాథలూ చిన్ని చిన్ని బొమ్మలుగా చెక్కుతున్నారు. ఎక్కడైనా బొమ్మ చెక్కటానికి వీలుకానిచోట చిన్న చిన్న పద్మాలూ, పూర్ణకలశాలూ చెక్క బడుతాయి. మరి పోతే అశ్వారూఢ అయిన స్త్రీమూర్తిని కూడ ఏర్పాటు చేస్తున్నాను. ఇటువంటిదే జగత్ప్రసిద్ధమయిన రామప్ప ఆలయంలోనూ ఒకటి ఉంది. హళేబీడు, బేలూరు, రామనాథ పురాల్లోవలె ఎక్కువ

ట్రిలో


ఉపయోగించడానికి మీకొక మంచి కారణం:



ఇతర ప్రముఖ డిటర్జెంట్ బిళ్లలకన్న **దీని ధర 30% తక్కువ.**

ఇదిగో, ఇంకా మూడు కారణాలు:


మరింత నురుగు




దీని సమృద్ధమైన నురుగు మరే డిటర్జెంట్ బిళ్లకన్న ఎక్కువ బట్టలను శుభ్రం చేస్తుంది.

మరింత ఉతికే శక్తి

అతిగా మాసిన బట్టల్ని కూడ చక్కగా శుభ్రం చేయగలది ట్రిలో. అందులోనే ఉన్న బ్లూ తెల్లటి బట్టలకు వాటి అసలు తెల్లదనపు మెరుపు తెస్తుంది.



మరింత మన్నిక




ట్రిలో సులువుగా మెత్తబడిపోదు. అందుకే అందులో వృధాపోయేది ఎంత మాత్రం ఉండదు. పూర్తిగా అరిగిపోయేదాకా ట్రిలోను వాడవచ్చు.

ట్రిలో — మరింత ఉపయోగకరమైన నీలి డిటర్జెంట్ బిళ్ల.

Godrej ఉత్పాదన

CHAITRA-GS-188 TEL



ఇటీవల ఉత్తరప్రదేశ్ ఆంధ్ర ప్రజాసమితి వారు తమ సంస్థ నాలుగో వార్షికోత్సవాన్ని మోడీనగర్‌లో ఘనంగా జరుపుకున్నారు ముఖ్య అతిధిగా విచ్చేసిన కేంద్ర దేశీయాంగ శాఖ స్టేట్ మంత్రి శ్రీ పెండేకంటి వెంకట సుబ్బయ్యగారిని సన్మానిస్తున్న శ్రీ జి భాస్కరరావు సమితి అధ్యక్షుడు శ్రీ పోతుల చిన్నారావుని కూడ చిత్రంలో చూడవచ్చు

అలంకారాలతో కనిపించరు మన శిల్పాలలో స్త్రీమూర్తులు మన శిల్ప స్త్రీమూర్తులు విసర్గ సౌందర్యానికి సంకేతాలు అంతేకాక కప్పుల మీద పరిచే రాతిపలకకు పెద్ద పెద్ద పద్మాలు అలంకరిస్తున్నాము మిగిలి ఉన్న పొడవయిన ఖాళీ స్థలంలో ఏనుగుల దండు చెక్కబడుతుంది

ఇంకా ఎక్కడయినా చోటు దొరికితే రంగులు కలిపి చిత్రాలు వేయించాలి అంటే కుడ్య చిత్రాల వాఘరాతీరంలో అజంతా లాంటివన్న మాట ''

''యీ చిత్రాలకు రంగులు ఎలా సమకూర్చుతావు ఆ రంగులు ఎంత కాలం నిలుస్తాయి'' అంటూ ప్రశ్నించేడు పశుపతి

''స్వామీ! నేను మీకు కొన్ని ముఖ్యమయిన విషయాలు చెప్పతాను చిత్తరువులు చిత్రించ టానికి ఏనుగు దంతంతో గుర్రపు వెంట్రుకలు బిగించి కుంచెలు తయారుచేస్తాము అవి కొంచెం మొరటు కుంచెలు అడవి జంతువుల నుండి ఇంకా సుకుమారమయిన వెంట్రుకలు సంపాదించి సుకుమారమయిన కుంచెలుతయారు చేస్తాము ఇకపోతే చిత్రాలకు వేసే రంగుల విషయం

కర్దమద్రవం, మషీరసం, ధాతురాగం, హరిదళము, మొదలయిన ధాతువులతో రంగులు తయారుచేస్తాం సున్నము, గ్రుడ్డు సొన, బెల్లము మొదలయిన వస్తువుల్ని యీ ధాతువులతో సమ పాళ్ళలో చేర్చి కల్వంలో ఉంచి బాగా మర్దిస్తాము

అలా మర్దించేక అవి జిగురులు తేలుతూ పాకానికి వస్తాయి అలా వొచ్చిన వాటిని తైలాల్లో కలిపి సూర్యపుటం వేస్తాము తరువాత తూలికలతో పలకలమీద చిత్రాలు చిత్రిస్తాము నేను మీకు సవినయంగా మనవి చేసేది ఏమంటే అలా చిత్రించిన చిత్రాలు కొన్ని శతాబ్దాలేకాదు సహస్రాబ్దాలు దాటినా చెక్కు చెదరవు '' అంటూ వివరించేడు శ్రీదేవుడు

తిరుచరణాలు

''భళిరా! ధన్యుడవు ఆయుష్మంతుడవు కావాలి'' అంటూ పండితులిద్దరూ శ్రీదేవుణ్ణి ఆశీర్వదించి లేచారు

''యీవేళ అప్పుడే లేచారేమి స్వామీ'' ప్రశ్నించేరు శిల్పులు

''కృష్ణస్వామితో మాట్లాడవలసిన పను లున్నాయి'' అంటూ పండితులు పర్ణశాల వైపుగా నడవసాగేరు

దారిలో వారికి పద్మా, లక్ష్మి జట్టుగా నడుస్తూ పచ్చిగడ్డి కొరుకుతూ కనిపించేయి

''పద్మా ఏకవీర ఎక్కడ?'' మానవభాషలో ప్రశ్నించినా అర్థం చేసుకున్నట్లుగా ఆ లేడిపిల్ల మోరెత్తి రసాల వృక్షం కేసి చూపింది ఇది మానవ భాషను అర్థం చేసుకోవటం సమా ధానంగా ఏకవీరను చూపటం యదార్థమా? యాదృచ్ఛికమా? అర్థంకాలేదు పండితులకు

''కృష్ణస్వామి ఎక్కడ?''మళ్ళీ ప్రశ్నించేరు లక్ష్మి మెడ ముందుకు చాచి పర్ణశాలవైపు చూపుతూ 'అంబా' అన్నది ఇది యాదృచ్ఛికం కాదనీ, ఆ మూగజీవులు మానవ భాషను అర్థం చేసుకుని సైగలద్వారా సమాధానాలిస్తున్నాయనీ గ్రహించిన పండితులు ఆశ్చర్యపోయారు ఏకవీరను పలకరించి వెళ్ళవచ్చులెమ్మని రసాలం కేసి నడిచేరు

నేలను తాకుతున్నట్లుగా మధ్యలో వొంగి పోయిన మామిడికొమ్మల తోపులో కూర్చుని వుండి ఏకవీర బరువు ఒడినందువల్ల కాబోలు మామిడికొమ్మ ఊగుతోంది దానితోపాటు ఏకవీర కూడ ఊగుతోంది ఆమె చూపులు ఎక్కడో వున్నాయి

''అమ్మా! ఏకవీరా!'' పిలిచేడు పశుపతి ఆమె పలుకలేదు

''ఏమిటమ్మా అలా శూన్యంలోకి చూస్తు న్నావు అక్కడ ఏముందని?'' మహాదేవుడు అడిగేడు

ఏకవీర మందంగా నవ్వింది

''ఎందుకమ్మా అలా నవ్వుతున్నావు'' పశుపతి ప్రశ్న

'' ఆనంద మయింది '' ఏకవీర అన్నది ఎక్కడో, ఏ లోకంలో ఉండో మాట్లాడు తున్నట్లుగా ఉన్నది ఆ స్వరం

''ఏమిటి తల్లీ ఆ ఆనందం? మాకు చెప్పవూ?''

''సౌందర్యమంతా రాసి పోసినట్లు ఆయిందయ్యా'' ఏకవీర

''ఎక్కడ'' అంటూ ఆదుర్దాపడిపోయి ప్రశ్నించేడు పశుపతి

''ఆ మోములో ''

''ఏ మోము తల్లీ'' అంటూ చిరుచెమట పడుతున్న తన ముఖాన్ని శాలువతో తుడిచేడు మహాదేవుడు

''స్వామి మోము'' ఏకవీర సమాధానం

''ఏ స్వామి? ఎక్కడ? మాకు కనిపించదేం?''

''నా స్వామి ఇక్కడే! కావాలనుకున్న వారికి కనుపింపుతాడు నా దైవం ''

''నీ స్వామా? అతడెవరు?''

''ఏడుకొండల మీద నిలిచి లోకాలను ఏలుతున్న స్వామి!''

''వేంకటేశ్వరుడా! ఎక్కడ? ఎక్కడ?'' పండితులిద్దరూ ఒక్కసారిగా తొందర చేయ సాగేరు

''ఎక్కడేమిటి? నీలో నాలో ఎక్కడ కావాలనుకుంటే అక్కడే '' అన్నది ఏకవీర ఆమె మాటలు స్వాప్నికుని సంభాషణ వలె ఉదాసీనంగా ఉన్నది

''మరి మా కళ్లకు కనిపించదేమి?''

''అది చూసే చూపులో ఉందయ్యా!''

''నా కళ్లు పాపిష్టివి కాబోలు '' అంటూ ఒక సందేహాన్ని వెల్లడించేడు పశుపతి

''ఇన్ని రోజులకు ఒక నిజాన్ని ఒంగీకరిం చావోయ్'' అంటూ అభినందిస్తున్నట్లుగా అతడి భుజం తట్టేడు మహాదేవుడు

పశుపతికి ఒళ్లు మండిపోయింది

''అదే నిజాన్ని నీవు యింకా ఒప్పుకోలేదేమి మరి?'' అంటూ వెక్కిరింపుల ఉపాఖ్యానం ప్రారంభించేడు పశుపతి

మహాదేవునికి యిప్పుడు సరిఅయిన ఊహ వచ్చింది ఏకవీర తన్మయభావుకురాలు ఆమె మనసు అతీంద్రియ దృశ్యాలను చూడగలుగు తోంది ఆమె చూచే ఆకృతులూ, అందాలూ, అనుభూతులూ అవి భౌతిక యింద్రియానుభవ యోగ్యాలుకావు

అందుకు పరిపక్వతకోసమే రుషులు తపస్సు చేస్తారు వరుసగా కొన్ని జీవితకాలాలను వెచ్చి స్తారు కాని అది సంచితమైన కర్మ పరిపాకం వల్ల కొందరికి అనుకోకుండా దొరుకుతుంది అది జీవితానికి పరాకాష్ఠ

తురీయమయిన అవస్థ సూక్ష్మశరీరం తాలూకు - సుఖాతి భౌతిక శరీరాన్ని పూర్తిగా మరిచినప్పుడే సూక్ష్మశరీరం తాలూకు అను భూతులు అనుభవయోగ్యమవుతాయి ఏ తపస్సులూ చేయకుండానే సంచితమయిన కర్మ పరిపాకంవల్ల ఆ అనుభూతులు, ఆ తురీయా వస్థ ఏకవీరకు సంప్రాప్తమయినవి

ఏడుకొండల వెంకటేశ్వరుడు ఆమెకు కనిపించేడు కాబోలు.

ఆమె ధన్యురాలు. పుణ్యమూర్తి.

ఎప్పుడూ స్నేహితులతో చిలికి చిలికి తగువులకు దిగే ఆ మహాపండితుడు యీ విషయాన్ని గ్రహించేక ఆయనలోని గాంభీర్యం పైకివచ్చింది. ఎదిగిపోయేడు.

''అమ్మా! ఏకవీరా! స్వామి నిన్ను అనుగ్రహించేరా?'' అని ప్రశ్నించేడు మహాదేవుడు.

''అనుభవానికి అతీతమయిన ఆనందం నాకు ప్రసాదించేడు నా స్వామి'' అన్నది ఏకవీర.

''నీవిప్పుడు ఆ స్వామిని చూస్తున్నావా తల్లీ! స్వామి నీ కళ్ళెదుట నిలచి సల్లాపం చేస్తున్నారా ?''

''అవునయ్యా! శ్రావణ మేఘాలు ఉరిమినట్లు ఉండే ఆ మధురమయిన మాటలు... మీరూ వింటున్నారుకదూ!''

మహాదేవుని శరీరం రోమాంచితమయింది. మనసూ కనులూ ఆర్ద్రమయ్యాయి.

''అంత అదృష్టం యీ నిర్భాగ్యులకు ఎక్కడిది తల్లీ... ఏదమ్మా నీకు కనుపించే ఆ స్వామిని వర్ణించు'' ప్రార్థనాపూర్వకమయిన స్వరంతో అడిగేడు మహాదేవుడు.

తాము దర్శించలేని ఆ పవిత్ర రూపాన్ని — సాక్షాత్తూ దర్శించి ఆ అనుభూతికి లోనయిన ఆమె వర్ణించుతూఉంటే — విన్నా జీవితం ధన్యమవుతుందని భావించేడు ఆ మహాపండితుడు.

ఏకవీరకు యిది అపురూపమయిన అవకాశం అయింది. తాను చూచే స్వామిని తన పలుకులతో వర్ణించటమా! ఆ అనుభూతిని, ఆ స్వామి అందాలను వర్ణించేందుకు నాకున్న భాష చాలుతుందా అన్న ఆలోచన రాలేదు. వర్ణించటమే జీవిత పరమావధి అయినట్లుగా స్వాప్నికమయిన స్వరంతో చెప్పసాగింది.

''చూచేరా నా స్వామిని. కొండంత దొర. కొండలమీద కొలువు చేసిన దొర. భూదేవి పులకించేలా ఆమెను మృదు స్పర్శతో పరవశింపచేస్తున్న ఆ ఎర్రని అరికాళ్ళు చూచేరా!

నిలువెత్తు దొర. ఎంత ఠీవిగా నిలిచేడు. బ్రహ్మ కడిగిన పాదాలు కదూ! ఎంత పవిత్రంగా ఉన్నాయో! కడిమి పూరేకులు పరచినట్లున్న పైనున్న పటం మోకాళ్ళు దాటింది. ఏమి? ఎంత సౌందర్యము? నీలికల్హారంలా ఉన్నదయ్యా ఆ మేను. మేల్మైన దొర కదూ! మేలిమి నీలపు రాయిలోని ధగధగలు లోకమంతా విరజిమ్ముతున్నాడు. లోకాలను దాచిన ఆ చిన్ని చిరుబొజ్జ ఎంత నునుపు! చూపులు సైతం ఆ బొజ్జమీద నిలిచేట్టున్నారయా జారిపోతున్నాయి.

ఇక కౌస్తుభం అలంకరించిన ఆ విశాలమయిన వక్షోభాగం చూచారా? శ్రీదేవి కాబోలు చందన చర్చ చేసింది. ఆ చందన చర్చ ఎలా ఉన్నదో ఊహించేరా? ''శ్రీదేవి సమాగమనాయ చందన చర్చితమివ ఉరఃస్థలం'' అన్నట్లున్నది. అవును ఎవరు యీ వర్ణన చేసింది. బాణుడు కదూ! అతని జీవితం ధన్యమయిందయ్యా! దైవాన్ని చూచేవుంటాడు ఆ బాణుడు.

అవునూ! అంతలోనే అలసిపోకండి. వినండి మరి. ఆ వక్షస్థలంమీద ఆ కుంకుమ అంకితాలేమిటి. ఎక్కడనుండి వచ్చిందో ఆ కుంకుమరంగు.

కమలాకుచ చూచుక కుంకుమతో నియతారుణితాతుల నీలతనో... అవును కదూ! పద్మావతీ కమలాకుచాలమీద భక్తులు అర్పించిన కుంకుమ (సర్వాంగపూజలో) అక్కడ అయింది కాబోలు. ఈ దృశ్యం చూచినందుకే ధన్యమయిందయ్యా జీవితం.

ఇంకా ఆ ఎగు బుజాలు చూచేరు. అదే కదయ్యా పరిపూర్ణ పురుషత్వమంటే. ఈ సృష్టి భారాన్ని వహిస్తున్న గుండ్రని భుజస్కంధాలు కదూ అవి.

ఈ కళ్ళున్నందుకు కరువు తీరిందయ్యా! మనసా నీ వెంత మంచిదానివి. నీవు వుంటేనేగా యీ మైమరపు కలుగుతోంది.

అవునయ్యా! చూచేరా! ఆ ముఖ సౌందర్యం. నవ్వితే మల్లెపూవులు, తుషార బిందువులు, రాలిపడినట్లే అందంగా చల్లగా ఎంత హాయి కలుగుతుందో.

ఆ చెంపలు చూచేరా! ఆ స్వామి శరీరం నీలమణి మేరువు అయినట్లుగా వుంటే ఆ బుగ్గలు గిరికందరాలే కదయ్యా. ఎంత నునుపు ఎంత సొగసు. ముద్దిచ్చినా జారిపోయే నునుపు కదయ్యా అది.

దేవతలను ఆజ్ఞాపించే ఆ కళ్ళు. వాటితో ఎంత ఆకర్షణ. ఆహా! బ్రతుకు ధన్యమయిందయ్యా!

అగ్ని ప్రజ్వరిల్లే ఆజ్ఞా చక్రం! ఆ భ్రూమధ్యం చూచేరా! చూడలేదు. భౌతిక నేత్రాలయితే కాలిపోతాయి.

ఆ లలాటం ఎంత విశాలమయ్యా! సృష్టిలో ఉన్న ఆలోచన అంతా స్వామిదేకదూ! అందుకే అంత విశాలమయిన నుదురు. ఆ నేత్రాలు చూడండి.

''అపాంగైస్సించతే విశ్వం...'' కంటికొస చూపులతో వాటిలోని ప్రేమయే రూపు కట్టిన ఆర్ద్రతతో లోకాలను ఆర్ద్రం చేస్తున్న స్వామి...

తన్మయులై వింటున్నారు పండితులు. మహాదేవునికి ఆ వర్ణన అంతటితో ఆగిపోవటం యిష్టంలేకపోయింది.

''అమ్మా! ఏకవీరా! స్వామికి కిరీటం లేదూ!'' అంటూ ప్రశ్నించేడు. ఏకవీర సిగ్గుపడిపోవటం ప్రారంభించింది.


ఆమె బుగ్గలు ఎర్రవారాయి.

''నాతో సరసమాడవచ్చే స్వామి కిరీటం భరిస్తారా!'' అన్నది. పండితులకు అయోమయమయింది.

ఆమెను ఏకాంతంలో ఒదిలివేయడమే కర్తవ్యమని భావించేడు మహాదేవుడు. యిద్దరూ అక్కడనుండి కదలలేదు.

మబ్బులేని ఉరుములా అప్పుడే అక్కడకు ప్రవేశించిన బిజ్జలుడు ''ఏకవీరా యీ పద్మ ఎంత ముద్దుగా వుంది. నేను తీసుకుపోనా ?'' అంటూ ప్రశ్నించేడు. ఏకవీర ఆ స్వప్నావస్థలోనే ఉండి ''ఊఁ'' అన్నది.

అదే అదను అనుకుని మరో మాట లేకుండా పద్మను బుజాలమీదికి ఎత్తుకుని వెళ్ళసాగేడు బిజ్జలుడు.





ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

శివుడు విష్ణు భక్తుడెట్లయ్యెను ?

"శివాయ విష్ణురూపాయ"అని శివకేశవులకు అభేదం చెప్పబడినా, శివుడు త్రిమూర్తులలో ఒకడైయున్నా, అతడు విష్ణుభక్తుడని విశిష్టాద్వైతులు "శివం మహాభాగవతం స్మరామి" అంటూ మహేశ్వరుణ్ణి ప్రశంసిస్తారు. ఇలా శివుడు విష్ణుభక్తుడై, భాగవతోత్తముడని తెలిపే ఒక గాథ కూడా ఉన్నది

యుగయుగాల క్రిందట గాలాసురుడనే రాక్షసుడు ఉండేవాడు. అతడు మహేశ్వరుణ్ణి గురించి మిక్కిలి ఘోరంగా తపస్సు చేసి, అతని అనుగ్రహాన్ని సంపాదించాడు. శివుడు ఆ రాక్షసుడికి ప్రత్యక్షమై వరాన్ని కోరుకొమ్మని అన్నాడు. "నాకు మరణం లేకుండా అనుగ్రహించాలని కోరితే – అది సాధ్యంకాదని నీవు అంటావు. స్త్రీ గర్భంలో జనించని స్త్రీ వల్ల మాత్రం నాకు మరణం కలిగేటట్లు వరం ఇయ్యి" అని ఆ రాక్షసుడు వరం కోరాడు. శివుడావరాన్ని ఇచ్చాడు.

తనను ఎవ్వడూ చంపలేడు గదా, అనే గర్వంతో ఆ రాక్షసుడు ముల్లోకాలనూ గజగజలాడించి, దేవతలను నానాబాధలూ పెట్టసాగాడు. వాని బాధలను భరించలేక దేవతలు శ్రీమన్నారాయణుని వద్దకుపోయి మొరపెట్టుకోగా, అతడు వారికి అభయం ఇచ్చాడు. తర్వాత శ్రీహరి హరుని వద్దకు పోయి "మహేశ్వరా ! క్రూరుడైన ఆ రాక్షసుడికి ఇలాంటి వరం ఇచ్చావేమి ?" అని అడిగాడు. శంకరుడు "అతడుచేసినతపస్సు ఘోరమైనది. ఆ వరం ఇవ్వక తప్పలేదు. ఎవ్వడికీ వాణ్ణి చంపడం సాధ్యంకాదు. ఎందరో క్రూర రాక్షసులను చంపిన నీకున్నూ సాధ్యం కాదు" అన్నాడు. ఆ మాట విని శ్రీహరి ఆవేశపరుడై "నేనూ చంపలేనంటున్నావా ? వాణ్ణి చంపి తీరుతాను" అన్నాడు. "నీవాతనిని చంపగలిగితే నేను నీకు దాసుడనై నిన్ను నా స్కంధముపై మోయుదునని చెప్పెను.

తర్వాత నారాయణుడు జగన్మోహినీ రూపాన్ని ధరించి, గాలాసురుణ్ణి మోహింపజేసి, మైమరుచునట్లు చేసి, సంహరించి తన ప్రతిన నెరవేర్చాడు. శంకరుడు ఆశ్చర్యపడి "నారాయణా! నీవు త్రేతాయుగంలో దశరథ పుత్రుడగు శ్రీరాముడుగా అవతరించినప్పుడు నేను అంజనాదేవి కుమారుడగు హనుమంతుడనై నిన్ను నా స్కంధంపై ఉంచుకొని మోసి, నీకు దాసుడనై ఉంటాను" అని పలికెను. ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకొనుటకే శివుడు ఆంజనేయుడై, శ్రీరామునికి భక్తుడై, ఆతనిని సేవిస్తూ ఉండెను. ★

తిరుచరణాలు

లక్ష్మి దీనంగా కన్నీరు విడుస్తూ 'అంబా' అని ఆర్తి చేసింది. కాని యీ లోకంలోని సుఖదుఃఖాలకు అతీతురాలై; ఆనందమయ లోకంలో విహరించే ఏకవీరకు ఆ ఆర్తి వినిపించ లేదు. కన్నీరు తుడుచుకోవటం కూడ చేతకాని ఆ మూగజీవి లక్ష్మి అలాగే నిలబడి ఏకవీరను చూడసాగింది.

15

వెంకన్నదొర తలఎత్తి చూచేడు. బిజ్జలుడి భుజంమీది నించి ఛెంగున క్రిందికి దూకి అటూ యిటూ పరుగెట్టసాగింది పద్మ. దానిని పట్టటం బిజ్జలుడికి సాధ్యంకాని పని అయింది.

వెంకన్నదొరకు ఆ దృశ్యం అద్భుతంగా కనిపించింది. పుత్రవాత్సల్యంతో ఆయన మనసు నిండింది. కాని యిటీవల బిజ్జలుడి ప్రవర్తనలో మార్పు వచ్చింది. ఏకవీర ప్రేమలో పడిపోకుండ, కేవలం రాజకీయ దృష్టితో ఆలోచించి బిజ్జలుడిని ప్రోత్సహించేడు తను. కాని అది సాధించటంలో అస్తవ్యస్తత ఏర్పడింది. బిజ్జలుడైతే ఏకవీరను ప్రేమించేడు కాని; ఏకవీర పరాసక్త అయింది. ఆమె మనసు మార్చటంలో బిజ్జలుడు విఫలుడయ్యేడు. అయినా కృష్ణస్వామి చేతినుండి హరిజనులు యువతలకు వొచ్చేరు. అక్కలవాడకు కబురు పంపితే పద్మగంధి యింతవరకూ రాలేదు.

"ఆగు...ఆగు...ఆ...గు పద్మా! నీవు ఎక్కడకు పోతావు? నా ప్రియురాలు ఏకవీర నిన్ను నాకు బహూకరించింది. నీవు నా నుండి పారిపోకూడదు. రా. దగ్గరకు రా" అంటూ ఆయాసంతో కేకలు పెడుతున్నాడు బిజ్జలుడు. కాని పద్మ అతడి చేతికి దొరకటంలేదు. నిలిచి నట్లే కాస్సేపు నిలిచి అతడు దగ్గరకు వెళ్లి పట్టుకొనటానికి ఉద్యుక్తుడు అవగాని కికురించి ఛెంగున ప్రక్కకు దూకుతోంది. పరుగెట్టిన ఆయాసంతో బిజ్జలుడు హైరాన పడసాగేడు

ఇదంతా వినోదవత్తుగా చూస్తున్న ఆయనకు ఆ లేడిపిల్ల ఆశ్రమంలోనిది అని గుర్తురాగానే ఏదో అనుమానం వేసింది. లేచి పెరటిలోనికి వచ్చేడు.

"నాయనా ! బిజ్జలా! యీ లేడిపిల్ల నీకు ఎక్కడిది ?" అంటూ ప్రశ్నించేడు.

"నాయనగారూ! ఇది నాకు ఏకవీర బహూకరించిన ప్రేమకానుక. కాని యిది నానుండి తప్పుకుపోవాలని ఎలా ప్రయత్నం చేస్తున్నదో చూచారూ!" అంటూ ఆయాస పడసాగేడు బిజ్జలుడు. దానిని పట్టుకోవాలన్న పంతం తండ్రి పలకరింపుతో రవంతసేపు సడలింది.

వెంకన్నదొరకు నవ్వు వచ్చింది. ఏకవీరను ప్రేమించి ఆమెను వశీకరించుకుని యింటికి తేవలసిందిగా బిజ్జలుడిని కోరాడతను. కాని బిజ్జలుడు కొండను త్రవ్విపోసి ఎలుకను పట్టిన సామెతగా కేవలం ఆమె పెంచుకునే లేడికూనను పట్టితెచ్చేడు. ఇప్పుడదికూడ చేతికి దొరకకుండా ఆయాసపెడుతోంది.

"త్వరగా పట్టితెచ్చుకో తండ్రీ! దానిని నీవు పట్టలేకపోయేవంటే ఏకవీర ఎగతాళి చేయ గలదు." అంటూ ప్రోత్సహించేడాయన.

"యింకెక్కడి పట్టుకోవటం. నాకు ఆయాసంతో ఉదయంతిన్న కుడుములు గొంతులోనికి వస్తున్నాయి" అంటూ ఆయాసంతో రొప్పుతూ ఒక వృక్షమూలాన చతికిలపడి దీర్ఘంగా ఊర్పులు తీయసాగేడు బిజ్జలుడు.

వెంకన్నదొర ఒక పాలేరును పిలచి దానిని పట్టవలసిందిగా ఆజ్ఞాపించేడు. ఆ పాలేరు దానిని పట్టితెచ్చేడు.

(ఇంకా వుంది)

గుండె గుండెకొక దీపం



— శ్రీ మధురాజీ

పదకొండు గంటలవేళ.

వీధి నిశ్శబ్దంగా వుంది. నిర్మానుష్యంగామా వుంది. చెట్టుచేమా వున్నవాళ్లు తమ పొలం పనులకూ—అది లేనివాళ్లు యితరుల పొలం పనులకూ, బడికెళ్లే వయస్సున్న పిల్లలు బళ్లకూ, వయసుండీ స్థోమతలేని పిల్లలు పశువులు మేపటానికీ వెళ్లి — అప్పటికే చాలా సేపయ్యింది.

అందుకే ఆ వీధి మళ్లీ సాయంకాలందాకా సందడికోసం ఎదురుచూస్తూ నిశ్శబ్దంగా నిరీక్షిస్తోంటుంది.

ఆ వేళ—

పదకొండు గంటలకే ఆకాశంలో సూర్యుడు మిడిసిపడుతున్నాడు—యవ్వనంలోకి అడుగుపెట్టి క్రిందుమీదెరగని గడుసుదానిలా.

'నేనేం తక్కువా' అన్నట్లు గాలి బిగదీసు క్కూర్చుంది—అత్తగారి మీద అకారణంగా అలిగిన కొత్త కోడలిలా.

ఆ వీధి చివర పాత పెంకుటిల్లు.

పడిపోవటానికి ఎదురు చూస్తున్నట్లున్న ఆ పాత పెంకుటింటి ముందటి అరుగుమీద రాలి పోవటానికి సిద్ధమవుతున్న పండు వయసు వృద్ధ స్త్రీమూర్తి.

ఆమె ముఖం —

ఆ యింటి ముందటి ఆకులు రాల్చిన వేపచెట్టులా కళావిహీనంగా వుంది.

ఆమె దేహం —

పెచ్చులూడిన పెంకుటింటి గోడలా వికృతంగా ముడతలుపడి వుంది.

ఆమె కళ్లు —

పెరట్లో యెప్పుడో ఎండిపోయిన బావిలా — శూన్యంగా, దీనంగా వున్నాయి.

ఆమె చూపులు —

మండే ఎండల్లో తొలకరి జల్లుకోసం ఎదురుతెన్నులు చూస్తున్న భూదేవి చూపుల్లా వున్నాయి.

ఆమె అనసూయమ్మ !!

అరవై ఏళ్లు నిండిన అనసూయమ్మ వంచిన తల ఎత్తకుండా ఓపిగ్గా విస్తర్లు కుడుతోంది. పూర్తయిన విస్తర్లు ఒకవంక వరుసలో—బుద్ధి మంతులయిన కుర్రాళ్లలా పొందికగా వున్నాయి. కుట్టవలసిన మోదుగాకులు కట్టలు కట్టలుగా అస్తవ్యస్తంగా వున్నాయి.

అలసిన చూపులు — అలవాటయిన వేళ్లు యాంత్రికంగా కదులుతున్నాయి. ఆ చూపులకు, ఆ వేళ్లకు ఆ పనిలో మూడు దశాబ్దాల అనుభవం వుంది మరి !

అరగంట క్రిందటినుంచి — ఆమె మధ్య మధ్య తల యెత్తి, అరచేయి నొసటికి అడ్డం పెట్టి — వీధివైపు దృష్టి సారిస్తూనే వుంది. నిరాశ నిండిన ఆ చూపులు మళ్లీ పనిలో అయిష్టంగా మునుగుతున్నాయి.

ఎండవేడికి కాకి వేపచెట్టు మీద కూర్చుని అసహ్యంగా అరుస్తోంది.

అరిచే ఆ కాకిని — పదే పదే వీధివైపు చూస్తున్న తన యజమానురాలిని మార్చి మార్చి చూస్తోంది కుంటి కుక్క.

కాలం నిశ్శబ్దంగా, నెమ్మదిగా కదులు తోంది.

కాకి అకస్మాత్తుగా అరవటం ఆపి — ఎటో నిశ్శబ్దంగా యెగిరిపోయింది. కుంటికుక్క, ఏదో వాసనపట్టి పరుగులమీద వీధి మలుపు దాకా వెళ్లి —ఆనందంగా భౌభౌ మని తోకాడిస్తూ—రివ్వున ముసలమ్మ దగ్గరకొచ్చి కాళ్లదగ్గర కూర్చుంది— నాలుక బైటపెట్టి సరదాగా తోకాడిస్తూ.

ఆ కుక్క ముసలమ్మకేం చెప్పిందో ఏమో కాని- ఆమె చేస్తున్న పనాపి— కళ్లనిండా మెరిసే ఆశతో, చిరునవ్వుతో వీధి వైపు చూసింది.

సరిగ్గా అప్పుడే వీధి మలుపు తిరిగాడు పోస్ట్‌మన్ చలమయ్య.

నలభై ఏళ్ళు నిండిన చలమయ్యకు తరగని కలిమి చెరగని ఆతని చిరునవ్వు.

పోస్ట్‌మాన్‌గా ఇరవై ఏళ్లనుండి పని చేస్తున్న చలమయ్య — వందలు వేలు వెనకెయ్యక పోయినా — ఎందరి ఆప్యాయతలనో దోచుకుని ధనంగా దాచుకున్నాడు. పూరిల్లే తప్ప — పెంకుటిల్లయినా కట్టుకోలేకపోయినా ఎంద రెందరి గుండెల్లోనో అభిమానాల గూడు కట్టు కున్నాడు. లోకంలో ఎక్కడో తప్ప దొరకని మంచి మనసు చలమయ్యకున్న తరగని ఆస్తి. అతనందించేవి వుత్తరాలే అయినా అందుకునేవి ఆత్మీయతలు.

దేనికయినా ఈ లోకం ఖరీదు కట్టగల దేమోకాని ఆత్మతృప్తికీ, ఆత్మీయతకూ, ఆప్యాయతకూ ఖరీదు కట్టలేదు కదా !

కాకీ బట్టల్తో, భుజానికి వ్రేలాడే సంచితో, చేతిలో ఉత్తరాల కట్టతో — తన రాకకోసం

గుండె గుండెకొక దీపం

ఎదురుచూచే కళ్లల్లో విషాదాన్ని, ప్రమోదాన్ని నింపుతూ నడుస్తున్నాడు చలమయ్య.

అనసూయమ్మ గుండెలు ఆతురతతో కొట్టుకుంటున్నాయి. చలమయ్య రాకకోసం యింతవరకు వేగిరపడ్డ మనసు — యిపుడు కలవరపడుతోంది.

తన రాకకోసం కళ్లనిండా వేయి ఆశల్ను నింపుకొని ఎదురుతెన్నులు చూస్తున్న అనసూయమ్మ చూపులవెనుక కదులుతున్న నీలినీడల్ను చూస్తూనే చూడనట్లుగా నడుస్తూ చలమయ్య ఆ పెంకుటిల్లు దాటాడు.

'ఆఁ !!' — అనసూయమ్మ దీర్ఘంగా నిట్టూర్చింది. నిట్టూర్పునిండా దట్టంగా పేరుకున్న దుఃఖం.

'నాయనా చలమయ్యా...' ఎదురైన నిరాశ ఆ ముసలి కంఠాన్ని వణికించింది. ఆ పిలుపుకు అలవాటుపడ్డ చలమయ్య కాళ్లు అప్రయత్నంగా ఆగిపొయ్యాయి. 'యివ్వాళకూడా వుత్తరంముక్క రాలేదా నాయనా... ?!'

రాలేదని ఆ ముసలితల్లికి తెలుసు. వస్తే చలమయ్య ఆప్యాయంగా 'అవ్వా' అని పిలిచి, ఆ వుత్తరంముక్క యిచ్చి — వివరంగా చదివి చెబుతాడని కూడా తెలుసు.

అన్నీ తెలిసినా కనీ పెంచిన ఆ మనసు 'అలా' అడగకుండా వుండలేదని చలమయ్యకు బాగా తెలుసు. చలమయ్య చదువు రానివాళ్లకు ఉత్తరాలు వ్రాసిపెట్టటం — చదివి పెట్టటమే కాదు - ఆ వుత్తరాల వెనుకనున్న మనసును కూడా చక్కగా చదవగలడు.

'రేపు తప్పకుండా వస్తుందిలే అవ్వా...' చలమయ్య చిరునవ్వుతో భరోసా యిచ్చాడు.

ఎండిన ఆ చూపుల్లో లీలగా. మెదిలిన ఆనంద రేఖ. ఎదురుచూస్తున్న. ఉత్తరాలు రాలేదని చెప్పటం చలమయ్యకు అలవాటులేదు. అలా చెప్పటం యిష్టపడడు కూడా.

'ఎండనబడి వచ్చావు ... కాసింత సేపిలా అరుగుమీద కూర్చో నాయనా ... అదిగో ఆ కుండలో చల్లని మంచినీళ్లున్నాయి. దాహం తీర్చుకో ... '

నడివేసవిలో చల్లని మంచినీళ్లకన్నా చల్లనయినది ఆ ఆప్యాయత ! చలమయ్య మంచినీళ్లు త్రాగి, ముఖానికి పట్టిన చెమట తుడుచుకున్నాడు పైపంచెతో. పంచవలసిన వుత్తరాలు యింకా నాలుగయిదు మించిలేవు. స్థిమితంగా అరుగుమీద కూర్చున్నాడు.

ఎండవేళ చల్లని చిరుగాలి పలకరిస్తోంది ఆపదలో ఆదుకునే స్నేహితునిలా.

'నాయనా చలమయ్యా ... ఆ వుత్తరాలిచ్చేసి కాసింత యిలారా నాయనా ... 'వాడికి' మళ్లీ ఓ వుత్తరం ముక్క రాసిపెడుదువుగాని. ఇదిగో పొద్దున్నే ఆ యెదురింటి కుర్రాణ్ణి పంపి కార్డు ముక్క కూడా తెప్పించిపెట్టుకున్నాను.'

'మళ్లీ యెందుకవ్వా రాయటం—మొన్ననేగా రాశాను.'

'మొన్నేమిఃటి నాయనా ... అప్పుడప్పుడే పదిహేనురోజులు గడిచాయి. ఇవ్వాళ...రేపు.. నురునాడని వొకటే యెదురుచూస్తున్నాను' ఆమె కళ్లు తుడుచుకుంది.

దూరాన పట్నంలోనున్న కొడుకునుండి 'కమ్మని కబురు' మోసుకొచ్చే కార్డుముక్క కోసం — కనిపెంచి — పండుబారిన ఆ ముసలి తల్లి మనసు — ఎంత ఆతురతతో ఎదురు తెన్నులు చూడగలదో చలమయ్య ఊహించగలడు. కానీ దూరాన వున్న ఆ కన్నకొడుకు మనసే చలమయ్య ఊహకందటం లేదు !

'సరేనవ్వా ! అలాగే ... ఈ వుత్తరాలు పంచి ... నీకు కార్డుముక్క వ్రాసిపెడతాను గాని . . '

వెడుతున్న పోస్ట్‌మాన్ వంక కోపంగా చూసి 'గయ్'మంది కుంటికుక్క

'నీకుత్తరం యివ్వలేదని నీ కుక్కక్కూడా కోపమొచ్చింది కదటవ్వా ?' నవ్వుకుంటూ వీధి మలుపు తిరిగాడు చలమయ్య.

అనసూయమ్మ మనసు — మబ్బులులేని ఆకాశంలా ఖాళీగా అయిపోయింది.

అనసూయమ్మ చూపు — ఎండిన ఎడారిలా నిర్జీవంగా మారిపోయింది.

ఇంకా విస్తర్లు కుట్టాలనిపించలేదు వాటిని దూరంగా జరిపి — కాస్తంత వెనక్కు జరిగి — గోడకి చెరగిలబడింది.

మధ్యాహ్న భోజనాలకు బడిపిల్లలు యిండ్లకొస్తున్నారు — కమ్మ కమ్మగా కబుర్లు చెప్పుకుంటూ — పుస్తకాల సంచులు హుషారుగా ఊపుకుంటూ.

ఆ పిల్లలను అలా ... అలా తదేకంగా చూస్తున్న అనసూయమ్మ మనసు — ముప్ఫై ఏళ్లు వెనక్కి వెళ్లింది.

అనసూయమ్మ భర్త రమణయ్యకు తెలివితేటలు లేకపోలేదుగాని — అవి ఈ లోకంలో — బ్రతుకు బండిని నల్లేరు మీది నడకలా సజావుగా నడిపించటానికి పనికి వచ్చేవిమటుకు కాదు. చిల్లర కొట్టుతో నాలుగు రాళ్లు సంపాదించేవాడు. అనసూయమ్మ విస్తర్లు కుట్టి ఆ నాలుగు రాళ్లకు మరో రెండు రాళ్లు కలిపేది. చాలీ చాలని సంపాదనలో—నలిగి నలిగి పెరుగుతున్న మరో నలుసు రాముడనబడే రామారావు.

రాముడికి పన్నెండేళ్లు రాకమునుపే—గతుకుల రోడ్డులో అతి కష్టం మీద నడుస్తున్న బ్రతుకు బండి అకస్మాత్తుగా అదుపు తప్పింది.

భార్యనీ, కొడుకునీ ఈ జనారణ్యంలో వదిలి, గుండె పోటుతో బ్రతుకు పీడ వదిలించుకున్నాడు రమణయ్య.

రెండు రెక్కల్లో ఓ రెక్క విరిగింది.

బ్రతుకు బండికి ఓ చక్రం విరిగింది.

జనారణ్యంలో విచ్చలివిడిగా తిరుగుతున్న మానవ క్రూర మృగాలధాటికి భయపడి అనసూయమ్మ కూడా బలవంతంగానైనా 'బ్రతుకుపీడ' వదిలించుకుందామనుకుంది. కానీ—బెదురుతున్న లేడిపిల్ల చూపులతో 'కన్న ప్రేమ' ఆమె ప్రయత్నాన్ని మొదలంటా నరికివేసింది.

చిరిగిన విస్తరిలాంటి తమ బ్రతుకుని సరి చేసుకొనటానికి అనసూయమ్మ విస్తర్లు కుట్టటానికే తన బ్రతుకంకితం చేసింది.

శ్రమ ... శ్రమ ... శ్రమ ... రేయింబగళ్ళు శ్రమ.

శరీర శ్రమను అధిగమించ గల్గింది కాని— మానసిక వ్యధకు సుడిగాలిలో బగుడాకులా వణికి పోయింది.

మానవ మృగాల ఆకలి చూపులు......

వయసులో నున్న ఒంటరి ఆడదాని మీద— చురకత్తులుగా దూకుతున్న చూపులు.

ఆ చూపులకు తను బలికాకూడదు.

ఆ క్రూర మృగాల ఆకలికి తను ఆహుతి కాకూడదు.

అందుకై—

అనసూయమ్మ ఏ స్త్రీ చెయ్యని సాహసం చేసింది.

ఉపవాసాలతో తన శరీరాన్ని యెండగట్టింది. సంస్కారం లేకుండా తన దేహ ఛాయను మట్టి పాలు చేసింది. చివరకు — నల్లగా తుమ్మెదల బారులా నిగనిగలాడే తన తలను గొరిగించుకుంది.

ఇప్పటి అనసూయమ్మ ఒకప్పటి అనసూయమ్మకు ఛాయమాత్రంగానైనా కాదు. అప్పుడు మృగాల కళ్ళు చల్లబడ్డాయి—ఎదుట వేడెక్కించే రూపంలేక.

ఇదంతా ఆమె యెందుకు చేసింది? కారణమేమిటి? తన సుఖాన్ని, జీవితాన్ని యెందుకు త్యాగం చేసింది??

సమాధానం స్వల్పం. కొడుకుకోసం! తన కన్న కొడుకుకోసం !!

తల్లి కష్టంతో కొడుకు పెరిగాడు.

తల్లి కన్నీళ్లతో కొడుకు మరీ పెరిగాడు.

ఆ కన్నతల్లి త్యాగాలతో కొడుకు మరీమరీ పెరిగాడు.

వయసులో పెరిగాడు. చదువులో పెరిగాడు. పెళ్లితో పెరిగాడు. ఉద్యోగంతో పెరిగాడు. సంపాదనతో మరీమరీ పెరిగాడు. అంతస్తుతో మరింతగా పెరిగాడు.

కొడుకును 'అలా అలా' పెంచిన ఆ కన్న తల్లికి అందనంత ఎత్తుకు పెరిగాడు...! గుండెల్లో దాచుకుని పెంచిన ఆ కొడుకుని, గుండె చించుకొని తను పిలుస్తున్నా వినపడనంత, వినిపించుకోనంత ఎత్తుకు పెరిగాడు.

శ్రమించి, శ్రమించి అలసిన ఆ శరీరం— యిక శ్రమించలేక— అక్కున చేర్చుకుని యింత విశ్రాంతి నివ్వమని ప్రాధేపడుతున్నా ఆదరించనంతటి అంతస్తుకు పెరిగాడు ఆ కొడుకు.

మడతలుపడ్డ ఆ చెంపలనిండా కన్నీళ్లుగా మిగిలాయి ఆ జ్ఞాపకాలు. ఆ జ్ఞాపకాలమాటున మునిగిన ఆ మనసు— చలమయ్య రాకను కూడా గుర్తించలేదు.

'ఏమవ్వా!... ఏడుస్తున్నావా?'—చలమయ్య గొంతులో బాధ.

'కాదు నాయనా! ఎందుకో మనసు పదే పదే గతంలోకి పోతోంది. అయినా ఈ ముసలి మనసుకు గతం తప్ప భవిష్యత్తేముంటుంది—?!'

అనసూయమ్మ మాటలు ఎన్నెన్నో జీవిత సత్యాలను విప్పి చెప్పినట్లుగా తోచాయి చలమయ్యకు. అనుభవాలతో పండిన మనసూ, వయసూ ఆమెవి!

అనసూయమ్మ కన్నీళ్లు తుడుచుకుంది— చలమయ్యకు కార్డు అందించింది.

'ఒరే రాముడూ! యిప్పటికే నీకు ఎన్నో ఉత్తరాలు వ్రాయించాను. నా శరీరంలో శక్తి పూర్తిగా సన్నగిల్లింది. నాలుగు గింజలు కూడా వుడకేసుకోలేక పోతున్నాను. ఇక్కడ వున్నది నా కట్టె మాత్రమేరా... నా ప్రాణం వున్నది నీదగ్గరేరా నాయనా. నేను నోరు తెరిచి— నీ దగ్గరకు వస్తానురా నాయనా అని అనకముందే— పిలుచుకుపోవటం నీ ధర్మం. నా కంతటి అదృష్టం లేదు. వస్తాను— వస్తానని నే వ్రాయిస్తున్నా సరే నీవు పలకటంలేదు. కళ్లల్లో ప్రాణం పెట్టుకొని రోజూ నీ ఉత్తరం కోసం ఎదురుచూస్తున్నాను. నీ కన్నతల్లి మనసు నీకంత అర్థం కాలేదా నాయనా. ఆశ చావక, మనసు చంపుకోలేక చలమయ్యతో మళ్లీ నీకీ వుత్తరం వ్రాయిస్తున్నాను. ఇది నిన్ను కని పెంచిన తల్లి చివరి కోరిక — చివరి వుత్తరం కూడా...''

అనసూయమ్మ కళ్లు మూసుకుని— యెదురుగా ఉన్న కొడుకుతో చెపుతున్నట్లుగా తన ధోరణిలో తను చెప్పుకుపోతున్నా — ఆమె మనసును ఎలా అక్షరబద్ధం చేయాలో చక్కగా తెలిసిన చలమయ్య అలానే చేసి ఆ వుత్తరం ముగించి చదివి వినిపించాడు.

విని ఆమె సరిపోయిందన్నట్లుగా తలూపింది.

'మరి నేవస్తానవ్వా...టైమవుతోంది—'

కార్డు తీసుకవెడుతున్న చలమయ్య వెంట వీధి మలుపుదాకా తోకాడించుకుంటూ ఆనందంగా వెళ్లింది కుంటికుక్క.

తప్పదన్నట్లుగా నాలుగు మెతుకులు యెంగిలిపడి మిగిలింది కుక్కకేసింది. కుట్టిన విస్తర్లు తీసి ఓ ప్రక్కగా పెట్టి ఆకులు మూలకుతోసి మంచంవేసి నడుం వాల్చింది అనసూయమ్మ.

శూన్యంగావున్న ఆమె మనసు గతించిన గతంకేసి మళ్లీ పరుగులు తీసింది. ఎక్కడో దూరంగా చర్చిలో రెండు గంటలు మ్రోగాయి.

* * *

మళ్లీ మధ్యాహ్నం ...


చిటపటలాడుతున్న ఎర్రని ఎండ ...

బిగుసుకపోయిన గాలి ...

ఆకులు రాలిన వేపచెట్టు మీద కాకిగోల...

నిశ్శబ్దం రాజ్యమేలుతున్న వీధి ...

పాత పెంకుటింటి అరుగుమీద మోడుగాకులకు విస్తర్లుగా పునర్జన్మ కల్గిస్తున్న అనసూయమ్మ ... ఆమె కాళ్లదగ్గర అరమోడ్పు కన్నులతో కుంటికుక్క ...



గుండె గుండె కొక దీపం

తల్లి మనసు కొడుకు కబురుకోసం వేగిర పడుతోంది.

లోకంతీరు తెలిసిన బుద్ధి మనసును అదుపులోపెట్ట ప్రయత్నిస్తోంది.

నిరీక్షణ...నిరీక్షణ...

జీవన సాయం సంధ్యలో — తను నాటి ... నీళ్లుపోసి...కంచెవేసి రక్షించి పెంచి పెద్దచేసిన వృక్షము క్రింద కాస్తంత నీడకై ఆశ...ఆరాటం.

తల్లిగా అది అత్యాశకాదు ... ఆశ కూడా కాదు.

అది ఆమె హక్కు—అది అతని బాధ్యత !!

హక్కులు హరించుకు పోతున్నప్పుడు —

పోరాడి సాధించుకోగల వయసూలేదు—

మనసూరాదు. ఎదుటి వ్యక్తి బాధ్యతలు మరిచిపోతున్నప్పుడు మందలించి గుర్తుచేయగల అధికారమూలేదు—అవకాశమూ రాదు.

కనీస కోర్కెలు కూడా చంపుకొని—రామున్ని రామారావుగా చేసిన ఆ మనసు—కనీస సుఖాల గొంతు నులిమి— మట్టిని మాణిక్యంగా మార్చిన ఆ తనువు—

ఒక పిలుపు కోసం—

కేవలం ఒక తియ్యని పిలుపుకోసం---

'అమ్మా ! నీకు నేనున్నా రా--' అన్న ఒక చిన్న భరోసా కోసం — పలవరించి పోతోంది, రేపవళ్లూ కలవరించిపోతోంది ఆముసలి తల్లి మనసు.

ఆ పలకరింతతో పులకరించిపోవాలని క్షణాలు యుగాలుగా సుదీర్ఘంగా నిరీక్షిస్తోంది.

అనసూయమ్మ ఆలోచనలను చెదర గొడుతూ—కుక్క వీధి మలుపు దగ్గర్నుంచి భౌభౌ మంటూ తోకాడించుకుంటూ వచ్చింది.

ఎండమావుల్లాటి ఆ తల్లి కన్నుల్లో నీటి ఊటలాటి ఆనంద రేఖ !

పోస్ట్‌మాన్ చలమయ్య వీధి మలుపు తిరిగాడు. పాత పెంకుటింటి ముందు ఆగాడు. ఆనందంతో అనసూయమ్మ గుండె వేగం పెరిగింది.

'ఏమవ్వా ! భోజనం చేశావా ? అప్పుడే విస్తర్లు ముందేసుక కూర్చున్నావు—' చలమయ్య అరుగు మీద కూర్చున్నాడు.

'ఎక్కడిది నాయనా...నీ కోసమే చూస్తు కుడుతున్నా—'

చలమయ్యకూ తెలుసు—కొడుకు పిలుపు ఆ ముసలి తల్లికి పంచభక్ష్య పరమాన్నాలకన్నా ఎక్కువని.

'ఇదిగో అవ్వా...నీకు ఎం. వో. వచ్చింది—'

'అయితే...వుత్తరం రాలేదా నాయవా...'

ఆమె గొంతులో నిరాశ-

'ఇవ్వాళ డబ్బొచ్చింది కాబట్టి — బహుశా రేపు వుత్తరం రావచ్చు—' నిరాశలో నిదురిస్తున్న ఆశను నిద్రలేపుతున్నాడు చలమయ్య.

యం. వో.ఫారం మీద అనసూయమ్మ వేలిముద్రవేసింది.

చలమయ్య అయిదు పది రూపాయలనోట్లు అందించాడు.

'దీనిమీద కూడా ఏమీ రాయలేదా నాయనా' ఇంకా ఏదో ఆశ.

'రేపెలాగూ వుత్తరం వ్రాస్తాడు కాబట్టి రాసుండడులేవ్వా' —

అనసూయమ్మ చలమయ్య కళ్లలోకి సూటిగా చూసింది. తన రాముడు కూడా చలమయ్య యీడువాడే. చదువుకునే రోజుల్లో యిద్దరూ మంచి స్నేహితులు కూడా. హైస్కూలు చదువుతోటే విరమించుకుని చలమయ్య పోస్టాఫీసులో వుద్యోగానికి చేరినపుడు తను 'అయ్యో' అనుకుంది. తన కొడుకు యింకా పైకి చదివి పెద్ద వుద్యోగంలో చేరినపుడు 'హమ్మయ్య' అనుకుంది.

కానీ — మనిషిగా ఈ చలమయ్య ముందు తన రాముడేపాటి ? సూర్యుడి ముందు దివిటీ !!

'నాయనా చలమయ్యా ! వాడు నన్ను రమ్మని వ్రాయడు నాయనా... వ్రాయడుగాక వ్రాయడు నాయనా...' గొంతు బొంగురు బోయింది దుఃఖంతో.

'తప్పక రాస్తాడవ్వా... రామారావు మనసు నాకు తెలుసు...'

'మళ్లీ ఈ నెల కూడా డబ్బు పంపించాడుగా... ఇక మరో నెలదాకా ఈ ముసలితల్లి వాడికి పొరపాటునైనా గుర్తుకు రాదు. వాన్ని కని పెంచిన ఋణం యిలా నెలనెలా నోట్ల కట్టల ద్వారా తీర్చుకుంటున్నా ననుకుంటున్నాడే

పింగాణీ దంతాలు !

కొత్త పింగాణీ దంతాన్ని జపానులోని ఆప్టికల్ కంపెనీవారు తయారు చేశారు. ఇది ఇతర కృత్రిమ దంతాల కంటే మరింత అనువుగా దవడ ఎముకలో సరి పోగలదని తేలింది. కాల్షియం ఫాస్పేటు ఎక్కువగా వుండే కృత్రిమ దంతాన్ని తయారుచేయాలని ప్రయోగాలుప్రారంభించారు. కానీ చివరకు సహజమైన దంతం కంటే గట్టిగా ఉండే పింగాణీ దంతాన్ని రూపొందించారు. ప్రయోగశాలలో జరిపిన పరీక్షలలో ఇది 95 శాతం విజయాన్ని సాధించింది. దవడ ఎముక ఈ పన్నుకు మరింత ఆధారం కల్పిస్తుంది. దీనిని అమర్చటానికి ఉపయోగించే చిగురు పదార్థం గట్టిగా అతుక్కోవటం వలన బాక్టీరియా, వైరస్ వ్యాధులు కూడా ఏర్పడవు.

కాని — ఈ పండువయసులో నా మనసేం కావాలని వాడికి అర్థంకాదు నాయనా... కాదు కాదు...'

ముడతలుపడ్డ ఆ చెక్కిళ్లనిండా కాల్వలుగా కన్నీరు.

'వాడి డబ్బుక్కూడా యిదే నాయనా ఆఖరు... ఈ నెలరోజులూ వాడి పిలుపు కోసం చూసి చూసి విసిగి విసిగి ఏడ్చి ఏడ్చి తప్పకుండా చచ్చిపోతాను. అప్పుడు వాడొచ్చి లోకం కోసం రాని కన్నీళ్లు తుడుచుకుంటాడు. . మనసులో ఈ ముసలిపీడ విరగడయిందనుకుంటాడు. కోడలుపిల్ల యాభై మిగిలిసందుకు సంతోష పడుతుంది. నా బ్రతుకింతే నాయనా యింతే.. దయలేని కొడుకులగన్న అందరి తల్లుల కధ యింతే నాయనా, యింతే—'

అనసూయమ్మ దుఃఖాన్ని ఆపగల శక్తి చలమయ్యకు లేదు.

ఆమె ఆవేదనమా, ఆకాంక్షనూ అర్థం చేసుకోగల చలమయ్య మనసు మౌనంగా కన్నీళ్లు కార్చింది.

అనసూయమ్మ ముఖంలోకి సూటుగా చూస్తున్న చలమయ్య కళ్లు — ఆమె చెంపనుండి చెవిదాకా నల్లగా కట్టిన గాయం మచ్చను కన్నీళ్లతో గమనించాయి.

అవును. ఇప్పుడది కేవలం మచ్చే. కాని ఒకప్పుడది మండిన గాయం. ఆమె ముఖన్ని మనసునూ మండించిన గాయం.

చలమయ్యకు యింకా బాగా గుర్తుంది ఆ ఆ సంఘటన. ఆ సంఘటనతో ఆ తల్లి మనసు పొందిన అవమానం కూడా యింకా గుర్తుంది.

పదవ తరగతి చదువుతున్న రామారావు చౌదరిగారమ్మాయికి ప్రేమలేఖ వ్రాశాడు ఆ అమ్మాయి ఆ లేఖను వాళ్ల నాన్నగారికిచ్చి ఏడ్చింది.

గ్రామంలో ఎదురులేని చౌదరి యింతెత్తున ఎగిరాడు చెలరేగిన కోపంతో మండు వేసవి మధ్యాహ్న మార్తాండుడయ్యాడు.

ఫలితం—! రామారావుని పెడరెక్కలు విరిచి వారి బంగళా స్తంభానికి కట్టి— కొరడా తీశాడు.

ఈ వార్తవిన్న తల్లి మనసులో వేయి పిడుగులు పడ్డాయి.

కన్నపేగు క్షేమం కోసం కలవరపడింది. చౌదరిగారింటికి పరుగుతీసింది ఆ బీద తల్లికి కావలసింది అభిమానం కాదు— కొడుకు క్షేమం. అందుకే చౌదరిగారి కాళ్లకు చుట్టుకుంది— తన కొడుకుని క్షమించమని.

చౌదరి మనసు కరుగలేదు సరికదా... కొరడా రివ్వున గాలిలోకి లేచింది తోక త్రొక్కిన త్రాచులా.

క్షణాల్లో చౌదరిగారికాళ్లు విడిచి కొడుకును చుట్టుకుంది ఆ తల్లి.

ఛెళ్... ఛెళ్... ఛెళ్...

కొరడా కసిగా కాటు వేసింది. ఆ తల్లి

పీపు నుండి, ముఖం నుండి రివ్వున రక్తం చిమ్మింది.

కొడుకు క్షేమం కోసం కన్నతల్లి రక్త సమర్పణం !

ముఖంమీద పడిన గాయం కంటె ఆమె మనసుమీద పడిన గాయం మరింత పెద్దది. అందుకోసం ఆమె కొన్నాళ్లు కన్నతల్లి లాటి ఆ వూర్ని వదిలేసింది.

గాయపు మానని మచ్చను చూస్తున్న చలమయ్య మనసు గతాన్ని త్రవ్వింది.

హుఁ ...

ఇపుడు చెట్టంత పెరిగిన ఆ కొడుకు— కని పెంచిన తల్లికి చేరెడు నీడ నివ్వటానికికూడా వెనుకాడుతున్నాడు.

ఛీ... ఛీ...

చలమయ్య కన్నీళ్లు తుడుచుకుని కదిలాడు.

కదిలిపోతున్న చలమయ్యను కన్నీళ్లతో చూస్తూనే వుంది అనసూయమ్మ.

ఎండ మండిపోతునే వుంది— కన్నమనసు తెలియని కన్నకొడుకు దౌష్ట్యంలా.

*　　　*　　　*

మరునాడు ...

మరునాడు ... ...

మ ... రు ... నా ... డు ...

కాలం బరువుగా ... బాధగా క్షణాలు యుగాలుగా మారి కదులుతూంది. ఎదురు తెన్నులు చూసి చూసి అలసిసొలసిన ఆ కన్నులు— బరువుగా, భారంగా కన్నీళ్లతోనే కన్నకొడుకు అక్షరాహ్వానం కోసం నిరీక్షిస్తూనే వున్నాయి ఓపిగ్గా.

ఆ కన్నతల్లి మూగమనసు బాధను కళ్లారా నిత్యం చూస్తున్న చలమయ్య మనసు కన్నీరు కారుస్తోంది జాలి జాలిగా.

నిర్దయగా ఆ ముసలి తల్లి గుండెకోత కోస్తున్న ఆ కన్నకొడుకుమీద రోజు రోజుకూ అసహ్యం పెరుగుతునే వుంది.

ఆ కన్నతల్లి ప్రేమానురాగాలను, రక్త మాంసాలను దోపిడీ చేసుకుని పెరిగి — తన జీవితాన్ని పెళ్లాం బిడ్డలకే పంచిపెట్టి — కన్న తల్లికి కన్నీళ్లే మిగిల్చిన ఆ కొడుకుమీద — చలమయ్య మనసు మండిపడుతూ వుంది.

గుండెదాకా చీలిన నేలతల్లి తొలకరి జల్లుల కోసం వేచినట్లుగా —

ఆకులన్నీ రాలి బోసిపోయిన చెట్టు వసంతం కోసం తపించినట్లుగా —

మండే ఎండలకు ఎండిన వంకా వాగు వానచినుకు కోసం తపించినట్లుగా.

ఆ తల్లి చూచి . . చూచి . . చూచి ... పూర్తిగా అలిసింది.

ఎదురుచూస్తున్న వుత్తరం రాలేదు —

కలలు కంటున్న కమ్మని పిలుపు రానేలేదు.

కన్న కడుపు మనసు కరుగనేలేదు.

అనసూయమ్మ మనసు గాయపడింది. ఏ మందులకూ, మాకులకూ లొంగని విధంగా గాయపడింది.

ఎదురుచూచిన కళ్లముందు కటిక చీకటి. ఏ వెలుగురేఖలకు విచ్చని దట్టమైన కారుచీకటి.

ఓడిన మనసూ, వాడిన వయసూ అనసూయమ్మను ఒక్కసారిగా మంచ మెక్కించాయి.

జ్వరం ... జ్వరం ...

మూసిన కన్ను తెరవని జ్వరం ...

జ్వరంలో కలవరింతలు ... ఆ జ్వరంలోనే కొడుకు పిలుపు కోసం ఎదురుతెన్నులు ..

మరునాడు మధ్యాహ్నం .

పోస్ట్‌మాన్ చలమయ్య మండే ఆ మనసును చల్లార్చగలిగేవుత్తరం లేకుండానే—వట్టి చేతులతో —మధనపడే మనసుతో ఆ పెంకుటింటి ముందు ఆగాడు. పెంకుటింటి అరుగుమీద అనసూయమ్మ కూర్చునే స్థలం బోసిగా — ఏ ప్రేమకూ నోచని మనిషి మనసులా వుంది.

చలమయ్య మనసు వేగిరపడింది.

ఇంట్లో కుక్కిమంచంలో జ్వరంతో మూలుగుతూ—తన ఊసే పట్టించుకోని కొడుకు కోసం తహ తహ లాడిపోతూ కలవరిస్తున్న ఆ ముసలి తల్లిని చూసి కన్నీళ్లతో కరిగి పొయ్యాడు.

అనుకోకుండా చలమయ్య మనసులో గత కాలపు జ్ఞాపకాలు కదిలాయి. రామారావనే ఓ కరకు గుండెల కసాయిని నవమాసాలు మోసి, జన్మనిచ్చి, అష్టకష్టాలూ, అవమానాలూ పడి పెంచిన తల్లేకాదు ఆమె—

ఆ కసాయికి కేవలం ఒక్క జన్మేకాదు — పునర్జన్మ కూడా ప్రసాదించిన మహాతల్లి ఆ కన్నతల్లి.

అవును —

రాముడు కాలేజీలో చదువుతుండగా ఓసారి శెలవులకు యింటికొచ్చాడు తనూ, తన తల్లి స్థితి, తన తాహతూ మరిచి కామందులగారబ్బాయితో తగవు పెంచుకున్నాడు.

పొగరెక్కిన పొట్టేలు గా కొండను ఢీకొన్నాడు. ఫలితం—? తల పగిలింది.

ఆ దృశ్యం అనసూయమ్మ గుండెల్ని పిండి చేసింది

రక్తపు మడుగులో గిలగిల కొట్టుకుంటున్న కొడుకు—

కడుపు చించుకొని పుట్టిన కన్నకొడుకు క్షణక్షణానికీ మృత్యువువైపు కదులుతున్నాడు.

అనసూయమ్మ గుండెలు పగిలేలా ఏడ్చింది

చూపరుల గుండెలు ... ...ంగలా ఏడ్చింది.

ఎక్కాలు ముక్కలుచేసుకున్నా సరిగా కడుపే నిండని పరిస్థితి ఆమెది.

మృత్యుముఖంలోని కొడుక్కు క్షణాల్లో వైద్యం జరగాలి...జ. .ర. .గా...లి. కానీ — ఎలా ? ఎలా ? ? ఎలా ? ? ?

అప్పటికి సంవత్సరం క్రిందే పోస్ట్‌మాన్‌గా చేరిన చలమయ్య ముందు కొచ్చాడు — పగిలే ఆ గుండెను సముదాయించటానికి.

దయగల మనసులు తలా ఒక చెయ్యి అందించాయి.

రామారావును పట్నంలోని ఆస్పత్రిలో చేర్పించారు.

సాయంకాలానిక్కూడా పరిస్థితి మెరుగు పడలేదు. రామారావింకా చావుబతుకుల్లోనే వున్నాడు.

కన్నతల్లి ఏడ్చి ఏడ్చి — యిక ఏడ్వలేక సొమ్మసిల్లి దీనంగా శూన్యంలోకి పిచ్చిదానిలా చూస్తూవుంది. కొడుకు క్షేమం కోసం కనిపించని దేవుళ్లకు మొక్కుకుంటునేవుంది.

అపుడు డాక్టరన్నాడు — రామారావు బ్రతకటానికి రక్తం కావాలని — ఆ గ్రూపు రక్తం ఆస్పత్రిలో లేదనీ...

'ఆఁ !!!'

అనసూయమ్మ గుండెలు గుభేలుమన్నాయి.

కానీ — అంతలోనే ఆ తల్లి మనసులో ఏదో ఆనందరేఖ...

'బాబూ .. డాక్టరు బాబూ... నేను వాని కన్నతల్లిని.. వాడు నా రక్తం పంచుక పుట్టిన వాడు. . నా రక్తం పరీక్షించండి... తప్పక సరిపోగలదు...'

ఏడుస్తూనే డాక్టర్లను వేడుకొంది. పరీక్షలు జరిగాయి.

తల్లిగా అనసూయమ్మ జన్మ సార్థకమయ్యింది.

తన రక్తాన్ని పంచియిచ్చి కొడుకుకు పునర్జన్మ ప్రసాదించింది.

అపుడు —

ఆ తల్లి మనసుకు ప్రపంచాన్ని జయించినంత సంతృప్తి.

ఏ తల్లి హృదయమూ అధిరోహించని శిఖరాన్నెక్కినంత ఆనందము —

కానీ —

ఇపుడదే తల్లి మనసు ప్రపంచంలోని సౌభాగ్యాన్నంతా పోగొట్టుకున్నంత దుఃఖ మగ్నంగా వుంది.

అంతులేని అగాధాల్లో కూలిపోయినంత దీనంగా, దయనీయంగా వుంది.

కళ్ళు తుడుచుకుని చలమయ్య బయటికి నడిచాడు. వాకిట్లోనే ఎదురయ్యింది కుంటికుక్క దీనంగా చలమయ్య కళ్లలోకి చూస్తూ —

చలమయ్య మనసును కలచాయా కుక్క చూపులు.

కేవలం ఎంగిలిమెతుకులు తిన్న కుక్క తన యజమానురాలికోసం అంతగా దిగులుపడిందే—?!

మరి... మరి... మమతలు పంచుకుని... బ్రతుకును పెంచుకున్న ఆ కన్నకొడుకు...?!

ఆపైన ఆలోచించలేక గబగబా నడిచి వీధి మలుపు తిరిగాడు చలమయ్య.

*   *   *

రెండు రోజుల తర్వాత—

ఉత్తరాలు సార్టింగ్ చేస్తున్నపుడు చలమయ్య కళ్లు ఆశ్చర్యంతో మెరిశాయి. మనసు ఆనందంతో పరవశించింది......కార్డు ముక్క...

అనసూయమ్మ ఎదురు చూస్తున్న వుత్తరం వచ్చింది. ఎక్కడో దూరాన వున్న కొడుకు మనసును అక్షరాలుగా మోసుకొచ్చింది ఆ వుత్తరం.

ఎలానూ ఆ వుత్తరం అనసూయమ్మకు తనే చదివి వినిపించాలి కాబట్టి ఆ కార్డుముక్క సంకోచం లేకుండా చదివాడు చలమయ్య.

అంతే!!!

గుండె గుండె కొక దీపం

వందల వేల వోల్టుల షాక్ తిన్నట్లుగా నిలబడిపొయ్యాడు.

తన వునికినే మరిచి స్థాణువుగా మిగిలిపొయ్యాడు.

అమృత జల్లుల కోసం ఎదురు చూస్తున్న ఆ ముసలి తల్లి మనసు మీద విషపు జడివానలు కురిపించే వుత్తరమది.

ప్రేమ పిలుపు కోసం నిరీక్షించే ఆ కన్న తల్లి గుండెలో హాలాహలం చిలికించే వుత్తరమది.

అనసూయమ్మ చిరకాల కోర్కెను నిర్దాక్షిణ్యంగా తిరస్కరించాడు ఆ కొడుకు. ముసలి తల్లిని తనతో తీసుకు వెళ్లటానికి వీలుకాదు— ససేమిరా వీల్లేదన్నాడు కూడా. పైగా మాటిమాటికి వెధవ వుత్తరాలు వ్రాయించి ఆఫీసులో తన పరువు తీస్తోందన్న తీవ్ర హెచ్చరిక కూడా చేశాడు. నెల నెలా తను పంపే యాభై రూపాయలు చాలకపోతే మరో అయిదో పదో పంపుతానన్నాడు—నోరు మూసుకుని, మరింక వుత్తరాలు వ్రాయకుండా అక్కడే పడివుండమని కోపంగా రాశాడు అందులో......

ఆ కుళ్ళు అక్షరాల వెనుకనున్న విషగాలుల్నుండి తెప్పరిల్లటానికి...మనసున్న ఆ మనిషికి పది నిమిషాలు పట్టింది.

చలమయ్య కోపంతో పళ్ళు పటపట కొరికాడు.

ఆ నరరూప రాక్షసుని పీక నులిమి చంపినా పాపం లేదనిపించింది అతనికి. ఆవేశం తగ్గింతర్వాత ప్రస్తుత కర్తవ్యాన్ని గురించి నింపాదిగా ఆలోచించాడు. ఒకవేళ ఈ వుత్తరం ఆమె వింటే గుండె పగిలి మరణిస్తుంది... తప్పక దారుణమైన హృదయ బాధతో మరణిస్తుంది.

బాధ్యత గల ఒక వుద్యోగిగా ఆ వుత్తరం ఆమెకందించటం తన విధి.

మనసున్న ఓ మనిషిగా ఓ ప్రాణం కాపాడటం తన కర్తవ్యం.

చలమయ్య మనసు నిండా ఎడతెరిపిలేని ఆలోచనలు...

ఎదురైన సమస్యకు సబబైన పరిష్కారం కోసం ఆరాటం...

చాలసేపటికిగాని చలమయ్య ఆలోచనలు ఓ కొలిక్కి రాలేదు. మనసునిండా దట్టంగా ముసురుకున్న సమస్యల చీకట్లో పరిష్కార వెలుగురేఖ అవును... పరిష్కారం దొరికింది.

ఓ ఖాళీ కార్డుమీద గబగబా నాలుగు వాక్యాలు వ్రాశాడు. దానిమీద తనే అనసూయమ్మ అడ్రసు వ్రాశాడు. తనే పోస్టలు ముద్ర గుద్దాడు.

తర్వాత— తను పంచవలసిన ఉత్తరాలు బొత్తిలోకి తను వ్రాసిన కార్డు కూడా యెక్కింది.

అసలైన కార్డు పదిలంగా జేబులో పెట్టుకున్నాడు.

అనసూయమ్మగారి వీధి మలుపు తిరిగాడు చలమయ్య. కుంటికుక్క భౌభౌ మంటూ స్వాగతం పలికింది. జ్వరం కొంచెం నెమ్మదించిన అనసూయమ్మ మనసు చలమయ్య అడుగుల సవ్వడి కోసం వేగిరపడుతోంది.

'అవ్వా! ఇదిగో నీకుత్తరమొచ్చేసింది నీ కొడుకు వ్రాశాడు... నే చెప్పలా నాలుగు రోజులు ఆలస్యమయినా తప్పక వ్రాస్తాడని... ఎంతయినా రాముడు నీ కొడుకే కదా... ఊరికే నువ్వు వేగిరపడి... ఆలోచనలతో జ్వరం తెచ్చుకున్నావ్—' చలమయ్య గొంతులో హుషారు. గుండెలో బాధ.

'ఆఁ!!... వుత్తరమొచ్చిందా నాయనా...

నాలుగు క్షణాల కిందటదాకా కదలలేనిది.. ఇపుడు హుషారుగా లేచి కూర్చుంది. ఆ ముసలి తల్లి శరీరాన్ని నడిపించేది తిండికాదు! మరి? కన్న ప్రేమ!! చలమయ్య ఆనందంగా, హుషారుగా చదివాడు.

''త్వరలోనే వస్తున్నాను — వచ్చి నిన్ను తీసుకెడతాను—అమ్మా! నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో— డాక్టర్లకు చూపించి మందులవ్వాడు...''

ఎండిన మనసు ఆనందపు జల్లులతో తడిసింది.

గుంటలు పడ్డ చెక్కిళ్లలో విజయరేఖ మెరిసింది.

చీకటి నిండిన కళ్లల్లో వెలుగు వెల్లువ పొంగింది.

ఆ తల్లి మనసు పురివిప్పిన నెమలిలా ఆడింది. తన అదృష్టానికి పొంగిపొంగి పోయింది.

'నా రాముడి మనసు నాకు... నాకు తెలుసు నాయనా! తెలు...సు. ఈ కన్నతల్లిని... ఈ ముసలితల్లిని... మరిచిపొయ్యేటంత నీచుడు కాదు నాయనా... కాదు.. ఓ వారం రోజుల్లో వచ్చేస్తానన్నాడుగా.. పాపం వాడి కెన్నిపనులో .. క్షణం తీరికుండదు... అయినా వచ్చేస్తాడులే...'

ఆనందంతో తనలో తానే మాట్లాడుతున్న ఆ తల్లిని పిచ్చివాడిలా గుడ్లప్పగించి చూశాడు పోస్ట్‌మాన్ చలమయ్య.


ఆ దృశ్యం చూసి కళ్లనిండా తిరిగిన కన్నీళ్లు చెక్కిళ్లమీదుగా జారాయి.

కార్డు ఆమె చేతిలోపెట్టి — బరువెక్కిన గుండెలతో గబగబా బయటికి నడిచాడు చలమయ్య.

ఆ కార్డులోని అక్షరాలను నిమురుతూ - కన్నకొడుకు వీపు నిమిరినంతగా ఆనంద పరవశత చెందుతోంది ఆ బీదతల్లి వెర్రిమనసు.

ఆ సాయంకాలం —

బస్సుకు పంపటానికి పోస్ట్ బ్యాగ్ సిద్ధం చేస్తున్నవేళ — పిడుగులాటి వార్త క్షణాల్లో ఊరంతా వ్యాపించింది.



డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

ఎం. బి. కె. — విజయవాడ

నాకు ఇస్నోఫీలియా 36 శాతం ఉన్నది. దానిని పూర్తిగా నివారించుటకు తీసుకోవలసిన జాగ్రత్తలు, వాడవలసిన మందులు తెలియ జేయండి ?

★ ఇయోసినో ఫిల్సు అనేవి రక్తంలోని తెల్లకణాలలోని ఒకరకం. మామూలుగా 6నుంచి 8 దాకా ఉండవచ్చును. రక్తంలోని వీటిసంఖ్య అలర్జీవల్ల పెరుగుతుంది. ఎందువల్ల అలర్జీ ఏర్పడిందనే విషయాన్ని పరీక్షించటం అవసరం. మలపరీక్ష, ఛాతి ఎక్సరె మొదలైనవి పరీక్షలు అవసరం అవుతాయి.

హెట్రజాన్ మాత్రలుగాని, యూనీ కార్బ సాన్ మాత్రలుగాని వైద్యుల సలహాప్రకారం వాడవలసి ఉంటుంది. మూలకారణం అయిన అలర్జీకిగాను యాంటీ హిస్టమినిక్ మందులైన పిరిటాన్, అవిల్ మొదలయినవాడటం, కడుపు లోని క్రిములకిగాను తగినమందులు (పైపరజీన్ సిట్రేట్) వాడటం అవసరం.

బి. ఎస్. కె. — హైదరాబాద్

నా వయస్సు 18 సం॥లు. నేను ప్రతి రోజూ ఉదయం రాత్రి కాల్‌గేట్ టూత్ పేస్టుతో పండ్లు తోముతాను. అయినా నా స్నేహితులు నన్నుచూసి నా దగ్గర భరించరాని దుర్వాసన వస్తున్నదనీ, నేను మాట్లాడుతూ ఉంటే అది మరీ ఎక్కువగా ఉంటుందనీ అంటారు. నావద్దకి ఎవరూ చేరరు. అవసరం కొద్దీ దగ్గరకివచ్చి మాట్లాడినా వీలయినంత త్వరగా తొలగిపోతారు. టాన్సిల్స్, అడినాయిడ్స్ వంటివి ఏవీ పెరగలేదన్నారు.

★ నోటిద్వారా దుర్వాసన రావటానికి దంతరోగాలు, చిగుళ్ళవాపు, టాన్సిల్స్ వాచి ఉండటం, ఊపిరితిత్తులలో చీమువంటి పదార్థం చేరటం, బ్రాంకియెక్టేసిస్, అజీర్ణం మొదలయినవి కారణాలవుతాయి.

మీరు వీటికిగాను వైద్యులవద్ద పరీక్ష చేయించుకోవటం అవసరం.

ఎస్. ఆర్. — తుంగభద్రాడాం

బుల్‌వర్కర్‌ను వుపయోగిస్తే కేన్సర్ వస్తుందని విన్నాను. నిజమేనా ? సుఖవ్యాధులు ఒకసారి వస్తే ఎవరూ వాటిని నిర్మూలించలేరని ఎక్కడో చదివాను ఇది ఎంతవరకు నిజం ?

★ బుల్ వర్కర్‌కి కేన్సర్‌కి ఏమీ సంబంధము లేదు.

అన్ని రకాల సుఖరోగాలకీ ప్రస్తుతం మందులు ఉన్నాయి. ఆ మందులని ఎవరూ క్రమబద్ధంగా శాస్త్రీయంగా వాడటంలేదు. కొంతవరకు, తక్కువ మోతాదులో మందులను వాడటంవల్ల ఏ విధమైన ప్రయోజనమూ లేకపోగా ఆ మందులు ఆ రోగానికి పనిచెయ్యలేని పరిస్థితి (బాక్టీరియాలు మందులకి లొంగని స్థితి — రెసిస్టెన్స్) ఏర్పడే అవకాశం ఉంటుంది.

ఎ. ఎస్. ఆర్. — నరసారావుపేట

నా వయస్సు 19 సం.లు. నాకు 5 సం.ల నుండి చెవులో చీము కారుతున్నది. ఎంతో మందికి చూపించాను. మందులు ఇచ్చారు కాని ఫలితం కనపడలేదు. ఈ మధ్యనే కొద్దిగా వినబడుట లేదు.

★ చెవులలో నుంచి కారే చీముని లేబరేటరీ లలో కల్చర్ చేసి, సెన్సిటివిటీ టెస్టు మూలంగా ఏ మందులకి ఆ క్రిములు లొంగుతాయో కనుకొని ఆ మందుని చెవులలోను, ఇంజక్షను లేక మాత్రల మూలంగా గాని వాడవలసి ఉంటుంది.

అరుదుగా చెవి భాగంలో చిన్న శస్త్రచికిత్స చేయవలసి రావచ్చును. ★

అనసూయమ్మ మరణించింది !!

'ఆఁ !!!' —

చేతిలో పని క్షణాల్లో పూర్తిచేసి పరుగుల మీద వెళ్లాడు చలమయ్య ఆ పెంకుటింటికి.

పెంకుటింటి ముందు జనం మూగారు.

కుక్కి మంచంలో నిర్జీవంగా ఆ ముసలి తల్లి.

కుంటికుక్క ఆకాశంకేసి చూసి 'గో'మని దీనంగా ఏడుస్తోంది.

మధ్యాహ్నపు దృశ్యం చలమయ్య కనుల ముందు మెదిలింది.

చలమయ్య కళ్ళు శ్రావణ మేఘాల్లాగా వర్షిస్తున్నాయి.

తను ఏది జరగకూడదని ఊహించుకుని — ఆలోచించి ఆలోచించి వుపాయం ఆలోచించాడో — అక్షరాలా అదే జరిగింది.

జనం అనసూయమ్మ మంచితనం గురించి — ఆమె పడిన కష్టనిష్ఠూరాల గురించి — దీనంగా కన్నీళ్లతో చెప్పుకుంటున్నారు.

అదే జనం కరకుగుండెల కసాయి కొడుకు గురించి హేయంగా తిట్టుకుంటున్నారు. ఆమె చనిపోయినా —

ఆమె కళ్లు యింకా దేనికోసమో నిరీక్షిస్తున్నాయి.

ఆ నిరీక్షణ ఎవరికోసమో చలమయ్యకు తెలుసు.

కన్నీళ్లు తుడుచుకుని 'ఆ కన్నకొడుకు'కు టెలిగ్రాం యివ్వటానికి చలమయ్య కదిలాడు.

వాకిట్లో కన్నీళ్లతో దీనంగా కుంటికుక్క.

* * *

అన్నీ తెలిసిన చలమయ్యకు తెలియంది ఒక్కటే. అదే ఆమె చావు రహస్యం.

తను చొక్కా జేబులో మరచిన ఆవలు వుత్తరం — తన పదేళ్ల కొడుకు — అడ్రసు ప్రకారము అనసూయమ్మకు అందించాడనీ తెలియదు —

కేవలం అందించటమే కాకుండా చక్కగా చదివిపెట్టాడనికూడా తెలియదు.

అంతే !!

కొడగట్టిపోతున్న గుండె దీపం బాధతో, భయంతో, అవమానంతో, దుఃఖంతో రెపరెప లాడిపోయింది.

సుడిగాలిలో చిరుదివ్వెలా వణికిపోయింది.

రక్తమాంసాలు పంచుకపుట్టిన కసాయి కొడుకును పెంచిన ఆ గుండె అడుగు పొరల్లో — చలమయ్య తియ్యని మనస్సుకు వల్లని ఆనన్ను లభించింది.

కొడుకు వుత్తరాన్ని కసిగా ముక్కలుగా చించింది ఉద్వేగంతో.

చలమయ్య వుత్తరాన్ని తృప్తిగా నిమిరింది కన్నీళ్లతో.

అంతే — రెపరెపలాడుతున్న దీపం భగ్గున ఆరిపోయింది.

... ఓ బీదతల్లి గుండెలో కొడగట్టిన దీపాన్ని వెలిగించటానికి ఓ మనసున్న మనిషిగా చలమయ్య చేసిన ప్రయత్నాన్ని — విధి వ్యతిరేకించింది.

దీపం ఆరిపోయింది. ★

సీరియల్

నీలి మేఘ సందేశమా..

వక్కలంక పద్మావతి

(గత సంచిక తరువాయి)

జరిగిన కథ—5: సురేంద్ర తను గాయత్రిని ప్రేమిస్తున్నట్లు మంజులతో చెపుతాడు. గాయత్రి మాటలకు సురేంద్ర మనసు దెబ్బతింటుంది. తను గాయత్రిని మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నట్లు ఆమెకు చెపుతాడు. గాయత్రి కూడ సురేంద్రను ప్రేమిస్తుంది కాని తండ్రికి భయపడి తన ప్రేమను బయటకు వ్యక్తం చేయలేకపోతుంది. గాయత్రి మనస్సు విప్పి తన ప్రేమను సురేంద్రతో చెపుతుంది. మంజుల, వినోద్, సురేంద్ర, గాయత్రిలు మహాబలిపురం పిక్నిక్ వెళ్ళి అక్కడ సరదాగా కాలక్షేపం చేస్తారు. మంజుల వివాహం వినోద్‌తో జరిగిపోతుంది. తిరుపతిలో ఒక సినిమా నిర్మాత గాయత్రి అందాన్ని చూసి ఆకర్షింపబడుతాడు.

ఒక వారం రోజులు గడిచాయి. సురేంద్రను దగ్గరకు పిలిచారు విశ్వనాథంగారు.

''సురేంద్రా! ఒక నెల రోజులపాటు మేమిద్దరం పుణ్యక్షేత్రాలు దర్శించి రావాలను కుంటున్నాం! యీ రాత్రికే ప్రయాణం. ఇల్లూ అదీ చూసుకుంటూవుండు. వేళకు భోజనంచేసి ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో! రాము నీకేంకావాలో చూస్తుంటాడు. యీ రాత్రికే మా ప్రయాణం'' అని చెప్పి అన్నీ అతనికి ఒప్పగించి వెళ్ళిపోయారు.

*　　*　　*

మంజులవాళ్ళు వెళ్ళినరోజున గాయత్రి ఇంటికి వచ్చేసరికి సాయంత్రం అయిపోయింది. ఉదయమనగా వెళ్ళిన గాయత్రి ఇంకా రాలేదేవిటా అని పరమేశంగారు గాయత్రి వెళ్ళేముందు బాగా ఆలస్యం అవుతుందని చెప్పినా... ఆయన ఆతృతగా ఎదురుచూస్తూనే వున్నారు.

అందుకో ప్రత్యేకమైన కారణం వుంది.

ఉదయం గాయత్రి అటు వెళ్ళగానే, మంజులా వాళ్ళతో గాయత్రి తిరుమలకు వెళ్ళి నపుడు ఆమెమీద మనసుపడిన సినిమా ప్రొడ్యూసర్ పట్టువదలని విక్రమార్కుడిలా గాయత్రి ఇంటి అడ్రసు తెలుసుకుని తన సెక్రటరీ 'స్వామి'ని రాయబారానికి పంపించాడు.

పరమేశంగారు 'స్వామి' ద్వారా విషయం తెలుసుకుని ఆశ్చర్యపోయారు. అక్కడ తన కూతురును చూసి వెర్రివేషాలేయకుండా, మర్యాదగా సాంప్రదాయసిద్ధంగా వచ్చి తనని అడుగుతున్నందుకు ఆయనకు సంతృప్తి కలిగింది. ఆ తర్వాతే మిగతా వివరాలు తెలుసుకున్నారు.

అతనిపేరు శ్రీనివాసన్ అనీ, ఒకప్పుడు విజయవాడలోనే వుండేవారనీ, తండ్రి చని పోవటంతో ఆస్తులన్నీ అమ్ముకుని... సినిమా వ్యాపారం చేసే వుద్దేశంతో తల్లితోపాటుగా మద్రాసులో స్థిరపడి మంచిపేరు, డబ్బు సంపాదించుకున్నట్టు చెప్పాడు సెక్రటరీ!

''గాయత్రమ్మగారిని చూసిన తర్వాత కట్నాలూ కానుకలూ ఒక్క పైసాకూడా వద్దన్నారు. పెళ్ళికాగానే మీ కుటుంబం మొత్తాన్ని మద్రాసు తీసుకువచ్చెయ్యమన్నారు. అక్కడ పెద్ద ఎస్టేటు, నౌకర్లూ... మిమ్మల్ని ఒక్కసారి వచ్చి వారి కుటుంబం, వంశం... సాంప్రదాయాలు అన్నీ చూసి మాట్లాడుకోవచ్చని చెప్పమన్నారండి! ఆయన చాలా గొప్పవారు... బుద్ధిమంతులు.

పరమేశంగారు ఆలోచనలోపడ్డారు. కొద్ది నిమిషాలు కూర్చుని ''రేపు షూటింగ్ పూర్తి చేసుకుని వెళ్ళిపోతున్నాంసార్! మళ్ళీ రేపు ఉదయం వస్తాను. అన్నీ బాగా ఆలోచించుకుని జవాబు చెప్పండి—'' అని వెళ్ళిపోయాడు స్వామి.

ఆయనకు నోట మాట రావటంలేదు సంతోషంతో! ఇన్నాళ్ళూ తన బంగారు తల్లి ఎలాటి వాడిచేతిలో పడుతుందోనని తెగ బెంగపడి పోయాడాయన. కోరినంత కట్నాలిచ్చి పెళ్ళి చేసే స్థోమతలేదు. ఆమె అదృష్టమే యీ అవకాశాన్ని తెచ్చింది. నా తల్లి గొప్ప అదృష్ట వంతురాలౌతుందని ఎప్పుడూ అనుకునేవాడు. 'అదే నిజమయిందీ రోజు' అనుకుంటున్న ఆయన కళ్ళల్లో నీరు నిలిచింది — అది ఆనందమో.. మరేభావమో...!!

ఆ శుభవార్త గాయత్రికి చెప్పాలని తహ తహ లాడిపోతూ గుమ్మంలోనే నిలబడ్డారు — ఆమెకోసం ఎదురుచూస్తూ!

గాయత్రి వచ్చి కాళ్ళు మొహం కడుక్కుని, లోపల అడుగు పెట్టింది. ''ఏమిటి నాన్నా! నా కోసమే ఎదురు చూస్తున్నట్టున్నారు కదూ! చాలా లేటయి పోయింది. మంజులా వాళ్ళు ఇప్పుడే వెళ్ళారు నాన్నా, అది వెళ్ళిపోతూంటే దుఃఖం ఆగలేదు నాకు.''

పరమేశంగారు అవేమీ పట్టించుకునే స్థితిలో లేరు. గాయత్రికేసి ఆప్యాయంగా చూస్తూ ఆమె తల నిమరసాగారు నెమ్మదిగా.

''నాన్నా! ఏమిటి. మీరివేళ అదోలా వున్నారు?'' అంది సందేహిస్తూ.

''అక్కా! నీకు పెళ్ళి కుదిరింది. పెళ్ళి కొడుకు పేరు శ్రీనివాసట. మద్రాసు వాళ్ళు. సినిమాలు తీస్తారట. ఇకనించి మనం బోలెడు సినిమాలు చూడొచ్చు ఎంచక్కా'' బేబి సంతోషంగా చెప్పింది.

ఉలిక్కిపడి తండ్రికి దూరంగా జరిగింది గాయత్రి.

''నిజమే గాయత్రీ! నువ్వెంత అదృష్ట వంతురాలివి తల్లీ! మొన్న మీరు తిరుమల వెళ్ళి నపుడు అతను నిన్ను చూశాడట. నిన్ను తప్ప ఎవరినీ చేసుకోనన్నాడట. కులం, గోత్రం, సాంప్రదాయం అన్నీ సవ్యంగానే వున్నాయమ్మా! లంకంత ఇల్లు, లక్షల ఆస్థి గాయత్రీ! తల్లిలేని నిన్ను కంటికి రెప్పలా చూసుకున్నానమ్మా! ఇప్పుడు నీ గురించి నాకిక దిగులులేదు. నీ తర్వాత పిల్లల భవిష్యత్తు కూడా ఆనంద ప్రదంగా వుంటుందమ్మా!''

అంటూ సంతోషంగా అంగీకరిస్తుందనే భావంలో ఆమె మొఖంలోకి చూస్తున్న పరమేశ్వరంగారు, ఆమె మొహంలో వస్తున్న మార్పులను భావాన్ని చూసి విస్తుపోయారు.

గాయత్రికి తండ్రి మాటలు వినిపించడం లేదు. ఆ రోజు తిరుమల కొండమీద... తమకు తటస్థపడ్డ సినిమా వ్యక్తుల్ని గుర్తుకు తెచ్చు కుంటుంది.

''ఏమ్మా! గాయత్రి; నువ్వేమంటావు తల్లీ''

దిమ్మెరపోయినట్టు చూసిందామె తండ్రిని.

''నాన్నా ! నన్ను క్షమించండి ! నేనీ పెళ్లి చేసుకోలేను.''—గొంతులో ఏదో అడ్డు పడినట్లు ఇంకేం చెప్పలేకపోయింది.

ఈసారి ఆశ్చర్యపోవటం ఆయన వంతయింది.

''ఎందుకని గాయత్రీ'' అన్నారు తగ్గు స్వరంలో !

ఆమె కళ్ళల్లో సురేంద్ర కనిపించాడు. అతన్ని దూరం చేసుకోవటం అనే ఆలోచనే ఆమె భరించలేకపోతూంది. బాధతో కళ్ళు మూసుకుంది. జలజలా కన్నీరు ప్రవహించింది ఆమె చెక్కిళ్ళమీద.

పరమేశంగారు ఆమెనే చూస్తూ నిలబడిపోయారు. ఆ చూపులకే తట్టుకోలేకపోయింది గాయత్రి.

''నాన్నా ! జీవితం ఆనందంగా గడవాలంటె డబ్బు, కులం, గోత్రం ఇవే ప్రధానం కాదు. మనసును ఆకర్షించే మనిషి కావాలి. ఆ మనిషిగా సురేంద్రని ఎన్నుకున్నాను. నన్ను క్షమించి మా ఇద్దరికీ వివాహం చేసి ఆశీర్వదించండి నాన్నా !''

దుఃఖంలో వణికిపోతూ ఉద్రేకంగా అంది.

ఆయన ఆశలు, ఆలోచనలు ఒక్కసారిగా చెదిరిపోయాయి. కోపంతో కళ్ళు నిప్పుకణాలైనాయి. ఆవేశంలో ఆయన గుండె ఎగిసి, ఎగిసి పడుతుంది. నెమ్మదిగా గాయత్రిని సమీపించారు

అంతే !

ఒక్కక్షణం ... ఏం జరిగిందో గాయత్రికి



తెలీలేదు. కళ్ళు తెరిచేసరికి ఆమె చెంప ఎర్రగా కందిపోయింది. చేత్తో చెంపను తడుముకుంటూ స్తంభానికి చేరగిలపడింది.

''గాయత్రీ ! నువ్వు ... నువ్వు ... నా కూతురివేనా ? నిన్ను నా ప్రాణంగా పెంచాను. తర తరాలుగా వస్తున్న వంశ ప్రతిష్టల్ని భగ్నం చేసి నువ్వు నీ స్వార్థం చూసుకుంటావా ? ... ఇవాళ ప్రేమించావు. రేపు పెళ్ళాడతావు ! కులాలూ మతాలూ మహావృక్షాల్లా వేళ్ళు పాతుకున్న యీ సమాజంలో ... అవి అంత ముఖ్యం కావనుకోవటం వఠి భ్రమ. నీ ఇష్ట మొచ్చిన వాడిని చేసుకో ! నీ తరువాత వాళ్ళ గతేమిటి ? వాళ్ళ జీవితాలమీద నీ ప్రభావం ఎంత తీవ్రంగా వుంటుందో ఒక్కసారి ఆలోచించావా ?

అయినా ... నీ ఇష్టం నీ నిర్ణయం ప్రకారమే నువ్వీ గడపదాటి వెళ్తే ... మళ్ళీ ఈ గుమ్మంలో అడుగుపెట్టకు. నువ్వసలు పుట్టనే లేదనుకుంటాను ... నా ఊపిరున్నంతవరకూ ఈ వంశ ప్రతిష్టకు ఏమచ్చా రానీవటం నేను సహించలేను. బాగా ఆలోచించుకో'' అంటూ ఒక్కక్షణం కూడా అక్కడ నిలబడకుండా పూజ గదిలోకి విసురుగా వెళ్లి తలుపులు వేసుకున్నారాయన.

వెర్రిదానిలా మాన్పడిపోయింది గాయత్రి. తండ్రికి, అక్కకి జరిగిన సంభాషణ విని భయపడి ...బేబీ గాయత్రి దగ్గరగా వచ్చింది. కిరణ్ దూరంగా నిలబడి పోయాడు.

బేబీని ఒళ్లోకి తీసుకుని కుమిలి కుమిలి ఏడ్చింది గాయత్రి.

పిల్లలకి అన్నం పెట్టి నిద్రపుచ్చింది. తండ్రి పూజగదిలోంచి బయటకు రానేలేదు భోజనానిక్కూడా !

గాయత్రీ మంచం మీద నిస్తేజంగా పడుకుంది. ఆమె కళ్లవెంట ధారలుగా కన్నీరు. ఆ క్షణంలో బ్రతకటం దుర్భరమనిపించింది ఆమెకి. లోకమంతా చీకటిగా అనిపించింది. ఆమెలో కసి, దుఃఖం, దైన్యం కెరటాల్లా విరుచుకుపడుతున్నాయి.

" 'నావాడు' అనుకున్న సురేంద్ర ... నా మనసుని, నా హృదయపు అట్టడుగు పొరల్ని కూడా స్పందింపజేసి నాలో నిద్రాణంగా వున్న ఆరాధనని పొందాడు. తన్ను తన గుండెల్లో గుడి కట్టి దాచుకున్నాడు. అలాటి వాడికి కాకుండా, ఏమాత్రం పరిచయం లేని వాడికి తనెలా భార్య కావటం ?"

తలుచుకున్నకొద్దీ ఆమె మనసు నీరవుతుంది. అయినా 'ఆలోచనలుతప్ప తన బ్రతుక్కి ఏంమిగిలింది' అనుకుంది.

ప్రక్కకి తిరిగి చూసింది బేబీ ప్రశాంతంగా నిద్రపోతూంది.

"తను వీళ్లకి దూరమై బ్రతగ్గలదా ! సురేంద్రతో తన పెళ్లి ... నైతికంగా వీళ్ల బ్రతుకులమీద ఎలాటి ప్రభావాన్ని కలిగిస్తుందో! తన చిన్నారి చెల్లెలి జీవితం ఏమవుతుందో ! ! కానీ ... మారుతున్నకాలం సమాజ రూపాన్ని మార్చకుండా ఇలాగే వుంచుతుందా ! ఏమో ! ఏమీ తోచటంలేదు తనకి."

ఆమె ఆలోచిస్తుందేగానీ స్థిరమైన నిర్ణయానికి రాలేకపోతూంది. ఆమె మనసు, బుద్ధి, ఆత్మ, అన్నీ సురేంద్ర కోసమే పలవరించసాగాయి — తన జీవితాన్ని, కాలాన్ని విలువల్నీ సర్వం తనకే అంకితం చేసిన సురేంద్రను పోగొట్టుకోవటం సాధ్యమా" చివురుటాకులా కంపించిపోయిందామె.

తెల్లవార్లూ దుఃఖిస్తూ... ఆలోచిస్తూ నిద్రలేకుండా గడిపేసింది. ఆమె మనసులో రగిలే సెగలు, పొగలు ఆర్పేందుగ్గానీ... ఆమెను ఓదార్చేందుగ్గానీ, ఎవ్వరూ లేరు. ఈ దుఃఖాన్ని యీ అలజడిని ఒక్క సురేంద్ర సన్నిధిలోనే మర్చిపోగలదు తను. సురేంద్రని కలుసుకోవాలి.

అలా ఎంతోసేపు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది గాయత్రి.

* * *

"కొందరి జీవితాల్లో ఎలాటి చలనంగానీ, ఏవిధమైన మార్పులు చేర్పులుగానీ ఉండవు. వాళ్లు నిజంగా అదృష్టవంతులు. ఆ అదృష్టం తనకిలేదు. జీవితాన్ని నిశ్చింతగా... నిండుగా గడిపేయాలని ఆశపడింది తను" అనుకుంది మరోసారి గాయత్రి. ఆమె మనసు తుఫాన్‌లో చిక్కుకున్న నావలా ఊగిసలాడుతోంది.

తెల్లవారింది. ఎవరి పనుల్లో వాళ్లు లీన

ఇది మేఘ సందేశమూ...

మయ్యారు. పరమేశంగారు మౌనంగా మడితో పూజా కార్యక్రమంలో మునిగిపోయారు. గాయత్రి పిల్లలకు స్నానాలూ అవీ పూర్తిచేసి స్కూలుకి తయారు చేసింది.

'స్వామి' రానే వచ్చారు. గాయత్రి విషయం అతనితో ఏం చెప్పాలో ఎలా చెప్పాలో ఆలోచనలో పడ్డారు పరమేశంగారు.

ఆయన మౌనంగా...సీరియస్‌గా ఉండటం అతనికి తికమకగా వుంది.

ఏదో ఒకటి చెప్పి 'స్వామి'ని పంపేయాలని నిర్ణయించుకుని అతనిముందుకువచ్చి కూర్చున్నారాయన. మనసులో మాటల్ని మననం చేసుకుంటూ "గాయత్రికి యీ పెళ్ళి ఇష్టంలేదని" చెప్పాలనుకుంటున్న పరమేశంగారు పెదవుల్ని విప్పబోతున్నంతలో గాయత్రి అక్కడికి వచ్చింది గబగబా !

ఒక్కక్షణం 'స్వామి'ని చూసి తలొంచుకుని చెప్పింది.

"నేనీ పెళ్ళి అంగీకరిస్తున్నానని శ్రీనివాస్ గారితో చెప్పండి" అని పక్కకు తిరిగి తండ్రితో అంది మళ్ళీ—

"కన్నవాళ్ళ పరువు, ప్రతిష్టలు నిలపటానికాకపోతే పిల్లలెందుకు నాన్నా వున్నది ! మీ ఇష్టప్రకారమే కానివ్వండి" ఒక్కోమాటే ఒత్తి పలుకుతున్న ఆమెను చూసి పరమేశంగారు నిశ్చేష్టులయ్యారు.

* * *

సురేంద్రవున్న గదిలోకి అడుగుపెడుతుంటే కాళ్ళు వణికాయి గాయత్రికి.

సోఫాలో కూర్చుని ఇంగ్లీషుమాగజైన్ తిరగేస్తున్న సురేంద్ర గుమ్మంలో జీవంలేని శిల్పంలా నిల్చునివున్న గాయత్రిని చూశాడు.

"రా గా య త్రీ ! అక్కడే నిలబడిపోయావేం ?" అన్నాడు చిరునవ్వుతో.

ఆ పిలుపుకోసమే అహర్నిశలూ తపించి

పిల్లలు

కార్బన్ పేపర్ కింది
తెల్లకాగితాలు
పిల్లలు
పై కాగితంపై
వంకర టింకర రాత
రాస్తే
పడతాయా
కింది కాగితంపై
ముత్యాల్లాంటి
అక్షరాలు ?

— 'కాశీనాథ & కాశీనాథ'

పోయే గాయత్రి ఒక్క ఉదుటునవచ్చి అతని కాళ్ళ దగ్గర కూలబడిపోయి వెక్కి వెక్కి ఏడవసాగింది. మనసులోని బాధంతా కరిగిపోయేలా ఏడ్చింది. ఆ ఏడుపు వుధృతానికి అతనికాళ్ళు వణుకుతున్నట్లు అనిపించింది.

సురేంద్రకి ఏమీ అర్థం కావటంలేదు.

"గాయత్రీ! నువ్విలా ఏడుస్తున్నావంటే.. నాకు ఒక్కటే కారణం కనిపిస్తుంది" అంటూ ఆమెను మెల్లగా చేతులతో లేవదీసి పక్కన కూర్చోబెట్టుకుని ... తలమీద చేయివేసి నిమురుతూ మళ్ళీ అడిగాడు.

"నీకు పెళ్ళి నిశ్చయం చేయబోతున్నారా?" అతను నెమ్మదిగానే అడిగినా, ఆ ప్రశ్నలో అంతర్లీనంగా వినిపిస్తున్న వ్యధ సూటిగా ఆమె హృదయపు అంచుల్ని తాకింది.

ఉలిక్కిపడి అతన్ని చూసింది. అతని కనురెప్పల మధ్య మెరుస్తున్న నీటి పొరని చూసి కుమిలిపోయింది గాయత్రి.

"సురేన్ !" దుఃఖంతో ఆమె గొంతు పెగలటం లేదు.

"బాధపడకు గాయత్రీ! నాక్కావలసింది.. నీ నిర్ణయం ఏమిటని ! నిన్ను నా మనసంతటితోటూ ప్రేమించాను. నీ చేతుల మధ్య వణికే ఆత్రుతతో ... నన్ను ... నా ప్రేమానురాగాల్ని నీకు నివాళులిచ్చాను. మన ప్రేమ శాశ్వతం కావాలి. ప్రేమ స్థిరపడాలంటే ఆ ఇద్దరిలో ఉండకూడనిది పిరికితనం. నువ్వు కూడా ధైర్యస్థురాలివనే నా నమ్మకం" సురేంద్ర కంఠం గంభీరంగా మారింది.

గాయత్రి ఏమీ మాట్లాడలేకపోతోంది దుఃఖంలో ! ఆమె అతని సహనాన్ని బలహీనం చేస్తోంది.


"గాయత్రీ ! మాట్లాడు. నువ్వు ఏమీ చెప్పకపోతే నిన్నేమని అర్థం చేసుకోవాలి ! నీ కళ్ళకేసి నిముషానికొకసారి పిచ్చిగా ... ఆత్రుతగా చూసే నా చూపులు నిన్ను కరిగించటం లేదూ ! నన్ను విడిచిపెట్టి నువ్వు బ్రతగ్గలవా ! నా కోసం ... మన కోసం ... సంఘ ప్రభావాన్ని వదిలించుకోలేవా ? చెప్పు గాయత్రీ !"

"నాకు సాధ్యం కావటంలేదు సురేన్ ! ఈ సమాజపు నీతి బోధనలు,... సనాతన భావాలు, పెంపకాలూ ఇవన్నీ మనుషుల్లో జీర్ణించుకుపోయి మనలాటి వాళ్ళ ప్రేమలు వీటికి ఆహుతయి పోతున్నాయి. మన విషయంలో కూడా అదే జరిగింది సురేన్ !

నాన్న మన వివాహానికి అంగీకరించటంలేదు. నా జీవితం కోరుకున్నవాడితో సుఖంగా గడిచిపోవటానికి మా కుటుంబం భవిష్యత్తు బలి కావటం జరుగుతుందని హెచ్చరిస్తున్నారు. నేను ఆ మాటలు భరించలేకపోతున్నాను సురేన్ !"

అతను గట్టిగా నిట్టూర్చి ... లేచి నిలబడ్డాడు.

"గాయత్రీ ! యీ సంఘానికి సంస్కారం



లేదు. ఋా మూఢనమ్మకాలనుంచి బైటపడేశక్తి, వివేకం, ఋా సమాజానికి లేవు మనకు తోచిన న్యాయాన్ని, ప్రేమని, స్వేచ్ఛని పొందే సాహసం మనం చేస్తే మనం చెడిపోతున్నామని బాధ పడతారు వీళ్ళు అదీ కొంత కాలమే గాయత్రీ ! మనం భయపడ కూడదు ఆత్మధైర్యంతో మన ప్రయత్నానికి అడ్డుపడే వాళ్ళని ధిక్కరించి నిలబడి మన ప్రేమను గెలిపించుకుందాం చరిత్రలో మనం చదివిన భగ్నప్రేమికుల జాబితాలో మనం చేరకూడదు

గాయత్రీ ! పద ! మన కలల్ని నిజం చేసుకోవటానికి, మనం భార్యాభర్తలం కావటానికి మీ నాన్నగారు అంగీకారాన్ని ఎందుకివ్వరో తెలుసుకుందాం అంగీకరించకపోతే చట్టబద్ధంగా చేసుకుంటామని చెప్దాం ! లేకపోతే నీమీద లేనిపోని అపవాదులు సృష్టిస్తుందీలోకం పద గాయత్రీ'' అంటూ ఆమె భుజం మీద చేయివేసి ముందుకి అడుగు వేయబోయాడు

గాయత్రి అతని గుండెల్లో తల పెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది అతని సాహసం చూస్తుంటే ఆమె గుండె వేగం హెచ్చుతూంది తన తండ్రికి, ప్రియుడికి మధ్య వివాదం ఎలా పరిణమిస్తుందో ఊహించలేక పోతూంది

అయినా తన పెళ్ళికి ఇంకా తండ్రి ఎందుకు అంగీకరిస్తాడు తన లిదుగుబాటును తండ్రి సహించలేక చిన్నారి తమ్ముడు చెల్లెలుతో సహా ఆత్మహత్య చేసుకోవటానికైనా వెనుదీయుడు ఆయన సంగతి ఆ వంశం సంగతి తనకి బాగా తెలుసు

తనకోసం అహర్నిశలూ పరితపించే సురేంద్రకు తను ఏం మిగుల్చుతుంది? ఇది చాలక తండ్రి దగ్గర అతనికి అవమానం జరగటం తను చూడలేదు సురేంద్రను ఇంటికి రానీయ కూడదు

''గాయత్రీ ! ఏమిటి ఆలోచిస్తున్నావు'' అతని ప్రశ్నకి ఆమె మొహం వెలవెలాబోయింది తలత్రిప్పి సురేంద్రను చూసింది

అతని చేతిని గట్టిగా నొక్కుతూ ''రెండు రోజులక్రితం నిశ్చితార్థంకూడా జరిగిపోయింది సురేన్ !'' అంది శక్తిని కూడదీసుకుని

సురేంద్ర స్థాణువులా నిలబడిపోయాడు అతని రక్తం మరిగి గడ్డకట్టింది దుఃఖం, బాధ, ఆవేదన ఒక్కసారిగా అతని ముఖంమీదికి పొంగాయి అందువల్ల కలిగిన ఒత్తిడికి అతని కళ్ళు రక్తం చిమ్మినట్టుగా అయ్యాయి

ఉద్వేగం పట్టలేక విసురుగా వెళ్ళి కుర్చీలో కూలబడి టేబుల్‌మీద చేతులు ఆనించి చేతుల్లో తలదాచుకున్నాడు అతని మనసునావరించిన పెనుతుఫాన్ హోరులో తల మొద్దుబారిపోతోంది ఆవేదన పొంగి దుఃఖంగా మారుతోంది

గాయత్రి భయంగా, నిస్సత్తువగా నిలబడిపోయింది

పది నిమిషాలు గడిచాయి మౌనంగా !

గాయత్రి మెల్లగా అడుగులో అడుగేసుకుంటూ అతనిదగ్గరికి వెళ్ళింది మోకాళ్ళమీద కూర్చుని అతని ఒడిలో తలపెట్టుకుంది

గాయత్రి పెళ్ళి నిశ్చయమైందని తెలిసినా ఆమెమీద ప్రేమభావం చంపుకోలేకపోతున్నాడు సురేంద్ర.

"సురేన్ ! నన్ను క్షమించు" అంది గాయత్రి అతని చేతులు పట్టుకుని.

అతను కళ్ళు విప్పిచూశాడు. ఆర్తిగా చూస్తున్న ఆ కళ్ళవెనుక పొంగుతున్న సముద్రపు ఘోష ఆమె హృదయానికి వినిపిస్తూంది.

"గాయత్రీ!" అదే మృదు మధురమైన పిలుపు. ఆ పిలుపులో అనురాగం, ప్రేమ, ఆనందం.. అన్నీ.. అన్నీ.. కోల్పోయింది తను. తనెంత దురదృష్టవంతురాలు ! అని వాపోయింది గాయత్రి.

"గాయత్రీ ! పిరికితనంతో నువ్విలా చేస్తావని అనుకోలేదు. నా రక్తం అణువణువులోనూ చూడు; మాలిన్యంలేని నా ప్రేమ కనిపిస్తుంది. నా ఆశల్ని, అనుభవాల్ని నిజంచేస్తావని, నాలో స్పందనని అధికం చేస్తావని అనుకున్నాను. కానీ నీతో గడిపిన మధురమైన క్షణాల్ని మాత్రమే నాకు మిగుల్చుదామని అనుకున్నావా! ఒంటరిగా.. ఇక నేను ఒక్కణ్ణే ఆ జ్ఞాపకాలు రొదలు ఎలా భరించేది గాయత్రీ !"

అతని కళ్ళల్లోనీళ్ళు ఎన్నడూ చూడని గాయత్రి తపించిపోయింది... అతన్ని విడిచి ఎక్కడికీ వెళ్ళనని, ఓదార్చాలనుకుంది. కానీ... ఎలా ? ఏమని ఓదార్చగలదు తను !!

వాళ్ళు పెట్టిన పసుపు కుంకుమలతో తను శ్రీనివాస్‌కి కాబోయే భార్య అయింది. ఇప్పుడు అతన్ని తుడిచేసి తాను సురేంద్రతో ఉండి పోతానని చెప్పగలదా ! భగవాన్ ! నా జీవితాన్ని ఎందుకిలా చిక్కులపాలు చేశావు. నాకేది దారి ?" నిశ్శబ్దంగా కన్నీరు కారుస్తూ ఉండి పోయింది.

ఆమె దుఃఖాన్ని అతను చూడలేక పోయాడు. ఆమె భయాన్ని, సంశయాల్ని మెల్లగా పోగొట్టి ధైర్యం చెప్పి... తమ బంధం శాశ్వతం చేసుకోవాలనుకున్నాడు. కొన్ని క్షణాల తర్వాత అడిగాడు.

"గాయత్రీ ! వరుడెవరు ?" ప్రశాంతంగా వుంది అతని ప్రశ్న.

శ్రీనివాస్ గురించి అన్ని విషయాలూ వివరంగా చెప్పింది గాయత్రి.

"తర్వాత అన్నికార్యక్రమాలు నాప్రమేయం లేకుండానే జరిగిపోయాయి. ఒక పది రోజుల్లో మంచి ముహూర్తాలున్నాయనుకున్నారు. అన్ని ప్రయత్నాలూ చేసుకుంటున్నారు సురేన్ . ఆ రోజే నీ దగ్గరికి రావాలనుకున్నాను గానీ . నాన్న గారు నన్ను అంటిపెట్టుకునే వున్నారు. యీ రోజైనా, పెళ్ళి కుదిరినందుకు సంతోషంగా తిరుమల దేవుని దర్శించటానికి వెళ్ళటంతో నాకీ అవకాశం కలిగింది."

ఇది మేఘ సందేశమూ...

గాయత్రి రెండు చేతుల్ని తన గుప్పెటలో బంధించాడు సురేంద్ర.

"గాయత్రీ ! నువ్వేం భయపడకు. ఆ శ్రీనివాసన్ దగ్గరికి వెళ్ళి మన విషయంచెప్పి... మనని అర్థం చేసుకొమ్మని ప్రార్థిస్తాను. నీకోసం ఏమైనా చేస్తాను గాయత్రీ ? నువ్వు లేకపోతే నా జీవితానికి అర్థంలేదు. నిన్నుదూరం చేసుకోలేను గాయత్రీ !"

ఆ మాటలు వింటూనే బెదిరిన లేడిలా చూసింది అతన్ని. ఆమె మనసు చిగురుటాకులా కంపించింది.

"వద్దు సురేన్ ! వద్దు. నువ్వంతపని చేయకు. నాకు యీ పెళ్ళి కాదంటే మా నాన్న భరించలేరు. నా తమ్ముడు, చెల్లెలి భవిష్యత్తు నా మూలంగా అంధకారం కావటం న్యాయమా సురేన్ ! ఈ జన్మకి మన జీవితాలింతే ! నన్ను క్షమించు" ఆమె కంఠం వణికింది.

సురేంద్ర కోపం కట్టలు తెంచుకుని ప్రవహించింది. అతనిలో ఆగ్రహం, బాధ, అవమానం ఒక్కసారిగా కెరటంలా ఆమెమీద విరుచుకుపడ్డాయి.

"గాయత్రీ ! ఎవరి అదృష్టం వాళ్ళది. నీకు మనసిచ్చాను. నాదాన్ని చేసుకోవాలనుకున్నాను. కానీ...నీకు నీ తండ్రి...తోబుట్టువులు ముఖ్యం. నాకన్నా అన్ని విధాలా గొప్పవాడైన వాడు నీకు భర్తగా వస్తున్నాడు.

నాకోసం నువ్వు వాళ్ళందర్నీ ఎందుకు కాదనటం... నువ్వు అతన్నే చేసుకుని ... నువ్వేడుస్తూ, అతన్ని సుఖపెడుతూ నీపుట్టింటి ప్రతిష్ఠల్ని వెయ్యింతలు చెయ్యి. నువ్వేభావంతో యీ పెళ్లికి ఒప్పుకుంటున్నావో గానీ ... ఇంక నాకు మిగిలింది మాత్రం చీకటే ! వెళ్ళు గాయత్రీ ! ఇకవెళ్ళు" కుర్చీలోంచి లేచి వెళ్లి కిటికీ చువ్వలు పట్టుకుని కొండల మీద చీకటి కమ్ముతున్న మబ్బుల్ని చూడసాగాడు.

"సురేన్ ! నా మీద కోపం తెచ్చుకోకు. నేను భరించలేను. నన్ను అర్థం చేసుకోగల్గింది నువ్వొక్కడివే అనుకున్నాను... కానీ నువ్వుకూడా ..."

"గాయత్రీ!" గట్టిగా అరిచాడు. అతని కంఠంలో కసి, ద్వేషం...మరేదో తీయని ప్రేమ, అనురాగం ప్రతిధ్వనించాయి.

"గాయత్రీ నా ముందు నుంచి వెళ్లిపో ! నీ ప్రేమా, సానుభూతీ ఇంకేమీ నాకు వద్దు. నువ్వింకా ఇక్కడే వుండి, నన్ను చిత్రవధ చెయ్యకు. ప్లీజ్ గెటౌట్ !"

అతని మనసును, కోరికల్ని, ఆనందాన్ని, తన గుప్పెట పట్టుకుని దుఃఖాన్ని, బాధని, ఆవేదనని అతనికి మిగిల్చి వెళ్లిపోయింది గాయత్రి.

ఆమె అటు వెళ్లగానే ముంచుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక మనసులో కుమిలిపోతూ తనివితీరా కన్నీరు కార్చాడు సురేంద్ర.

* * *

గాయత్రి పెళ్లిరోజు దగ్గరకొచ్చేసింది. సినిమా ప్రముఖులంతా వస్తారని పెళ్లి తిరుమలేశుని సన్నిధిలోనే జరగాలన్నాడు శ్రీనివాసన్ ఇంకా రెండు రోజులుండగా అతని తల్లి పట్టుచీరలు, నగలు ... పసుపు కుంకుమలతో పంపించింది కోడలికి. రెండువైపులా వ్యవహారాలన్నీ శ్రీనివాసన్ సెక్రటరీ 'స్వామి' చూసుకుంటున్నాడు.

అన్ని ప్రయత్నాలూ ఘనంగానే సాగిపోవటం చూస్తుంటే పరమేశం గారికి ఆనందానికి అవధులు లేవు. ఆయన హడావిడి అంతా ఇంతా కాదు.

లగ్నం మర్నాడు రాత్రి అనగా "స్వామి" వచ్చాడు. రేపటి కార్యక్రమాలు ఏ విధంగా జరగాలో వల్లించి చెప్తున్నాడతను.

ఇంట్లో దగ్గర బంధువులు హడావిడిగా తిరుగుతున్నారు.

గాయత్రి తన గదిలో ఒంటరిగా కూర్చుని ...అతని మాటలు వింటూ నిర్లిప్తంగా వుండి పోయింది. ఆ మాటలు, ఆ ఏర్పాట్లు ఆమెకు సంతోషం కలిగించటంలేదు. యీ ప్రపంచంలో ఏ విషయాలు పట్టించుకోని యోగినిలా...గదిలో ఒక మూల కూర్చోంది. సహజంగా ఆమెలోని అణకువకు జతగా... జీవితంలో తను ఎదుర్కోబోతున్న సమస్యలన్నీ కళ్ళముందు కదులుతున్నా వేటికీ చలించని నిర్లిప్తత కూడా ఆమె మొఖంలో కనిపిస్తోంది.

* * *

సంధ్య చీకట్లు అలుముకుంటున్నాయి. క్షణాలు గడిచిన కొద్దీ గాయత్రి మనసులో చీకటి మరింత ముసురుకుంటోంది. రేపటి రోజును తలుచుకుంటే ఆమె మనసు వణికిపోతుంది. శ్రీనివాసన్‌తో తన పెళ్ళి జరగబోతుందన్న విషయం గుర్తుకొచ్చినపుడల్లా ఆమె గుండెల నిండా సెగలు కమ్ముకుంటున్నాయి.

ఉండి ఉండి ఆమె మనసు గతాన్ని తిరగదోడుతోంది. కంటికి కనిపించని వ్యక్తి ఆమె ఆత్మలో లీనమై అలాగే వున్నాడు. అతనితో గడిపిన అందమైన రోజులు క్షణక్షణానికి కళ్ళ ముందు కదిలి హృదయాన్ని మరింత కలవర పెడుతున్నాయి.

"సురేన్ ! తనని ఆకర్షించిన ప్రియుని కోసం స్త్రీ ఏమైనా చేస్తుందంటారు. మరి నేనెందుకిలా వుండిపోయాను...అనుకుంది. గతం ఆమె మనసును కలచివేస్తుంటే భవిష్యత్తు మరింత అయోమయంగా అనిపించింది. పరువూ, ప్రతిష్ఠలు అనుకుంటూ బ్రతుకును అంధకారం చేసుకోవటం ఎంతవరకూ సమంజసం అనిపించింది ఆమె హృదయానికి. ఇవన్నీ ఆలోచిస్తున్న.కొద్దీ ఆమెలో ధైర్యం అధికం కాసా

కుమార్తెని చెరచిన వ్యక్తిని కోర్టులో హత్య చేసిన స్త్రీ !

ఒక పురుషుని హత్య చేసినందుకు మారియన్ బేక్ మెయర్ అనే ఆమెకు కోర్టు 6 సంవత్సరాలు జైలు శిక్ష విధించింది. ఆమెకు 32సం॥లు. తన 7 సం॥లు కూతురు 'అన్నా'ను మానభంగం చేసి చంపిన కారణంగా కోర్టు రూములో క్లాస్ గ్రెబౌస్కీ అనే 35 సం॥ల పురుషుని ఆమె కాల్చి చంపింది. ఆ సమయంలో ఆమె మానసిక పరిస్థితి బాగానే ఉందని జడ్జి అన్నారు.

ఆమెకి 8 సం.లు జైలు శిక్ష విధించాలన్న ప్రాసిక్యూషన్ డిమాండ్‌ను కోర్టు తగ్గించింది. అంతేకాదు బేక్ మెయర్‌ను కష్టడీలోకి తీసుకోవాలన్న ప్రాసిక్యూషన్ వాదనను కూడ కోర్టు తోసిపుచ్చింది. కొందరు ప్రేక్షకులు తీర్పు వినగానే తీర్పు వారనుకున్నంత దయతో లేనందున అసంతృప్తి వెళ్ళిడి చేసారు.

ఈ ఆసక్తికరమైన కేసు గురించి చూడ్డానికి చాలమంది ప్రజలు గంటల కొద్దీ చలిలో చినుకులు పడుతున్నా ఆ ఉదయం కోర్టు దగ్గర క్రిక్కిరిసి ఉన్నారు.

కోర్టు తీర్పు విన్న రెండు గంటల కంతా మెరియన్‌బేక్ మెయిర్ నల్లని పాంటు, సాదా తెల్లషర్టు ధరించి కోర్టు వెనుక తలుపు గుండా ఆన లాయర్లు, పోలీసులు కూడ ఉండగా కోర్టు భవనాన్ని వదిలి వెళ్ళింది.

వెలుపల చేరి ఉన్న చాలమంది ఫోటోగ్రాఫర్లు, టి. వి. కెమెరామెన్‌లకు ఆమెను కలుసుకోను అవకాశం కలుగలేదు. బేక్ మెయర్ ఉద్దేశ్యపూర్వకంగానే గ్రెబౌస్కీని కాల్చింది అన్న ప్రాసిక్యూషన్ వాదనను కోర్టు అంగీకరించింది. కాని ఈ హత్య ముందుగా ఆలోచించి కుట్రతో చేసిందని అనడానికి సరైన ఆధారాలు దొరకలేదని కోర్టు తన తీర్పులో చెప్పింది.

మారియన్ బేక్ మెయర్



లోడ్ చేసిన పిస్టల్ తన హేండ్ బేగ్‌లో దాచుకొని కోర్టు రూములో కొచ్చిన బేక్ మెయిర్ క్షణం ఆలశ్యం చెయకుండా గ్రెబౌస్కీని కాల్చి చంపింది

కాల్చి చంపడానికి ముందు తన కూతురు ఫొటోని చూసుకుంది. దాంతో ఒక్కసారిగ ఆవేశం పెరిగింది.

గ్రెబౌస్కీ కేస్‌లో న్యాయస్థానం చేసిన తప్పులు దుప్పటి క్రింద దాగేవి కాదని కోర్టు చర్యలు స్పష్టం చేసాయి. లైంగికపరం అయిన నేరం చేసిన గ్రెబౌస్కీని జైలు నుంచి ముందుగా విడుదల చేయడం, న్యాయస్థానం అతని మీద సరిపడినన్ని తనిఖీలు చేయడం, అతను లైంగిక పతనానికి హార్మోను చికిత్స పొందే ముందు నిపుణుల అభిప్రాయాన్ని పొందక పోవడం ఆ తప్పుల్లో కొన్ని.

"ఈ తప్పులు చేయకపోయినట్లైతే అన్నా చంపబడి ఉండేది కాదు" అని కోర్టు నిక్కచ్చిగా చెప్పింది. కాని బేక్ మెయర్‌పై ఉన్న ఆరోపణలను వదులుకోడానికి ఇది కారణం కాదు.

హత్య చేసినందుకు శిక్ష విధించడం న్యాయ సమ్మతం కానీ తన 7 ఏళ్ల కూతురు మానభంగానికి, చావుకి పరిస్థితులను ఏ కోర్టు అన్వేషిస్తుంది ? ఆ లైంగిక వెర్రి తలలకు ఎప్పుడు అంతం లభిస్తుంది ? ★

గింది. సురేంద్ర కోసం ఏమైనా చేయాలని పిస్తుంది."

కాబోయే అత్తగారు పెట్టిన నగలన్నీ ఒంటి మీద నుంచి తీసేసి పెట్టెలో పెట్టింది.

గాయత్రిలో ఇప్పుడు తన గురించిన ఆలోచన, విచక్షణ మంచులా గడ్డకట్టుకు పోయాయి.

క్షణక్షణం సురేంద్ర రూపం కళ్ళల్లో కదల సాగింది. వెంటనే వెళ్ళి అతన్ని కలుసుకోవాలి. అతన్ని తీసుకొచ్చి, తన తండ్రిని, శ్రీనివాసన్‌నీ ఒప్పించి అదే ముహూర్తానికి వివాహం జరిపించుకోవాలి !

ఆ ఆలోచన రావటంతోనే గాయత్రి తన నెవరూ గమనించకుండా ఆ చీకటిలో ... ఇంటి నించి బైటకు అడుగుపెట్టింది పిచ్చిధైర్యంతో.

* * *

తన మనసులో జరిగే సంఘర్షణతో పోరాడుతూ, తనలో మూర్ఖత్వాన్ని, పిరికితనాన్ని ఛేదించుకుని ఆ చీకటిలో అతన్ని ఓదార్చాలనే తపనతో ... తన సాహసాన్ని అతనికి తెలియజెప్పి అతని మొఖంలో వెలిగే కాంతి రేఖల్ని తనూ పంచుకోవాలనే ఆర్తితో ఆ ఇంట్లో అడుగు పెట్టింది గాయత్రి.

"సురేంద్రబాబు రెండురోజుల క్రితం ఊరెళ్ళారండి ! ఉద్యోగానికి రెండు నెలలు శెలవు పెట్టి వెళ్ళినట్టు ... మా అయ్యగారు యాత్రల నుంచి రాగానే చెప్పమన్నారు" అని వినయంగా నౌకరు 'రాము' చెప్పిన మాటలు విన్న గాయత్రి నవనాడులూ కృంగిపోయినట్లయింది. ఆమె ఆలోచనలన్నీ గాలి బుడగల్లా ఆమె కళ్ళముందే పేలిపోయాయి.

"ఇంకేమైనా చెప్పారా!" అంది మిణుక్కు మంటున్న ఆశతో ... శక్తిని కూడదీసుకుని.

"లేదమ్మా ! ఇంకేమీ చెప్పలేదు. నిన్న మీ నాన్నగారు ఇచ్చిన శుభలేఖలు రెండూ సురేంద్రబాబుగారు లేకపోవటంవల్ల ఆ టేబిల్ మీదే వుంచానమ్మా !" అన్నాడు.

గాయత్రి మెట్లమీదే కూలబడిపోయింది. ఆమె కళ్ళనుండి ధారాపాతంగా కన్నీరు కురిసింది.

ఇప్పుడేమిటి చేయటం ! సురేంద్ర కోసం తను గడపదాటి బైటకివచ్చిందే ! అతను తనతో ఒక్కమాటకూడా చెప్పకుండా ఎక్కడికి వెళ్ళాడో! అతను కనుపించకపోతే ఇప్పుడేమిటి దారి ! తన జీవితమిలా రాలి పోవలసిందేనా !

లేదు ... లేదు. తను ఈ పెళ్ళి చేసుకోగూడదు. ఎంతకాలమైనా ఎన్ని యుగాలైనా సురేంద్రకోసమే బ్రతకాలి. అంతే ..

భుజంనిండా కొంగు కప్పుకొని చెమటలు కక్కుతూ ఆ చీకటిలో నడుస్తూ ... తిరుపతి రైల్వేస్టేషన్‌కి చేరింది. ప్లాట్‌ఫాం మీద అప్పుడే కదలబోతున్న రైల్లోకిదూకి నిస్తేజంగా సీట్లో కూలబడి పోయింది గాయత్రి.

(ఇంకా వుంది)

విత్తుల ఎంపికలోనే ఉందన్న సంగతి మేమూ గుర్తించాం, అందుకే, చిక్కదనం, సువాసనా సరైన పాళ్లలో ఇచ్చే కాఫీ విత్తుల ఎంపికలో మా నిపుణులు శిక్షణ పొందారు.

అమ్మ చేసినట్టుగానే మేమూ కాఫీ విత్తుల్ని సరిగ్గా తగినంతమేరకు వేయిస్తాం. అలా ఆ చిక్కదనం, సువాసన, రంగు పరిపూర్ణ స్థాయిలో వచ్చేలా చేస్తాం.

సరిగ్గా అలాటి సమయంలో ఆ విత్తుల్ని అతి వేగంగా చల్లారుస్తాం. దానితో వాటి మంచితనం, సువాసన, రుచి, చిక్కదనం, రంగు అన్నీ అలా అందులో నిలిచిపోతాయి.

ఆ విత్తుల్ని నాజూగ్గా పొడికొట్టి, బ్రహ్మాండమైన పర్కొలేటర్లలో పడపోస్తాం. దీనితో ముదురు రంగుతోటి, ముగ్గుల్ని చేసే సువాసనతోటి అతి చిక్కని డికాక్షన్ తయారవుతుంది.

అనుదినం ఉదయం పూట అమ్మ కాఫీ రుచికి నోచుకున్న వారందరికీ ఇది సుపరిచితమైందే.

చిక్కని డికాక్షన్ నుంచి మళ్ళీ పొడి.


ఈ దశలో డికాక్షన్‌ను సుతారంగా ఆరబెట్టడం ద్వారా దాన్ని పొడి రూపంలోకి మార్చడం జరుగుతుంది. ఈ పద్ధతి వెనక 40 ఏళ్ళ పరిశోధన, అనుభవాల పరిపూర్ణత ఉంది.

ఇక బంగారు గోధుమ రంగులో ఉన్న ఆ పొడిలో తాజాదనం, సువాసన సమృద్ధిగా ఉంటాయి.

ఆ తాజాదనాన్ని అలా నిలిపి ఉంచడం కోసం

ఆ పొడిని జాడీలలోకి, సంచీలలోకి నింపి, దాని సువాసన, రుచి, చిక్కదనం అన్నీ అందులోనే దాగి ఉండేలా సీలుచెయడం జరుగుతుంది. ఆ గుణాలన్నీ కలిసి ఏ వేళలోనైనా, ఏ జాములోనైనా

ఆ సన్‌రైజ్ తొలివెలుగుల తాజాదనపు అనుభూతి మీకు నిస్సందేహంగా అందుతుంది.



ఇక సన్‌రైజ్ అచ్చంగా ఇంట్లో అమ్మ పద్ధతి లోనే తయారవడం వల్ల, ఆ శ్రేష్ఠతకు ఇదొక యోగ్యమైన బిరుదే అనవచ్చు కదా మరి!



ఇంట్లో అమ్మ చేసిన కాఫీ అందించే ఆ తొలివెలుగుల తాజాదనపు అనుభూతి కోసం.

ఎంపిక చేసిన పట్టణాలలో మాత్రమే లభించును

HTD-FSL-7910 TEL



సినిమా విశేషాలు

-జి. వి. జి.




'భార్యాభర్తల సవాల్'లో సుమలత

"అమాయకుడు కాదు అసాధ్యుడు"లో అపర భీముడు

బయటనుంచి "పట్టుకోండి కొట్టండి పట్టుకోండి!" అన్న కేకలు వినిపించాయి నాటకాలరాయుడు (పద్మనాభం) పారిపోతున్నవాడల్లా ఇంట్లోకి జొరబడేసరికి ప్రసాద్ (కృష్ణ), రాణి (జయసుధ) అతని వంక చూశారు

"బాబోయ్! చంపేస్తున్నారు రక్షించండి— రక్షించండి!" అంటూ నాటకాలరాయుడు ప్రసాద్, రాణీల చుట్టూ తిరిగి, "ఆపద,



'అమాయకుడు కాదు అసాధ్యుడు' కృష్ణతో జయసుధ

బాబూ! కాపాడు," అంటూ ప్రసాద్ కాళ్ళు పట్టుకున్నాడు

ఇంతలో కొందరు కోపావేశంతో ఆ ఇంట్లో ప్రవేశించారు వాళ్ళలో ఒకడు "ఈ రోజు రాత్రికి వీధి నాటకం ఆడ్తానని మా అందరి దగ్గరా చందాలు పోగుచేసి, నాటకం ఆడకుండా డబ్బుతో పారిపోవాలనిచూస్తున్నాడు," అంటూ ప్రసాద్‌తో మొరపెట్టుకున్నాడు

"ఏమయ్యా! అదేం జబ్బు?" అని ప్రసాద్ అడిగితే, నాటకాలరాయుడు "జబ్బు కాదండీ — నా ఖర్మ నేను చేసుకున్న పాపం తీరా నాటకం ఆరంభించబోయే సమయానికి భీముడి వేషం వేసే వెధవ తప్పతాగి పడి పోయాడు వాడు లేకుంటే నాటకం సాగదు, బాబూ! ఆ మాట చెప్పి, నే పాడతానంటే

"చిత్తం కాని కథ —" నాటకాల రాయుడు బుర్ర గోక్కున్నాడు

"చెప్పనయ్యా నువ్వు చెప్పేంది చేస్తా"

"ఏం లేదండీ భీముడి భార్య, ద్రౌపది —"

"ఏ పది?"

"ద్రౌపది ఆమెను కీచకుడనే రాక్షసుడు మోహించి, బలాత్కారం —"

"ఏం కారం?"

"అదే — బలఎంతం చెయ్యబోతే, తానామె వేషంలో పోయి, చాటునుండి — తీరా వాడు చెయ్యి పట్టుకోగానే చంపేస్తాడు అంటే —"

"ఎట్టా? చెయ్యి పట్టుకోగానే చంపేస్తాడు అంతేకదా? అయితే ఇంకేం? పదండయ్యా పదండి అంతా పోయి కూచోండి"

వీళ్ళు వింటేగా?" అన్నాడు.

"అసలు నాటకం ఏమిటి?" ప్రసాద్ ప్రశ్నించాడు

"కీచక వధండీ. భీముడు లేకుండా వీలు పడదు," అన్నాడు నాటకాలరాయుడు

"పోనీ — ఆ భీముడి వేషం నేనేసేస్తాను ఏం — నేను పనికిరానా? ఊళ్ళో అంతా నన్ను భీముడంటారు తెలుసా?"

"అనటమేమిటి, బాబూ! మీసాలు లేవన్న మాటేగాని, తమరు సాక్షాత్తూ భీములుగారే!"

"అయితే ఇంకేం? మీసం పెట్టి వేషం వేస్తా"

నాటకాలరాయుడి ముఖం విప్పారింది "ఆపద్బాంధవా! నమోన్నమ నమోన్నమః నమోన్నమ!" అంటూ జనంతోపాటు నిష్క్రమించాడు

"ఏమండీ! మీరూ —" రాణి విస్మయంతో చూసింది

"ఏం ఫరవాలేదు నేనంటే ఏమిటనుకున్నావ్! వచ్చి నువ్వు చూడు స్టేజీ అదిరిపోవాలి మన ప్రెస్టేజీ పెరిగిపోవాలి," అంటూ ప్రసాద్ బయలుదేరాడు

విజయనిర్మల స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో డూండీ కథ సమకూర్చి, సమర్పించే శశిరేఖా మూవీస్ "అమాయకుడు కాదు అసాధ్యుడు" చిత్రానికి పి బాబ్జి నిర్మాత

నాగేష్, గొల్లపూడి



విడియో విశేషాలు

★ కొందరు ముఖ్య మంత్రులు, మంత్రులు, ఎం పి.లు, ఎం ఎల్ ఎ.ల గృహాలలోనూ విడియోసెట్లు ఉన్నాయట వాటిలో తాజా చిత్రాలు చూడడం చట్ట విరుద్ధమన్న సంగతి వారెరుగరా?

★ ఇండోర్‌లో 1,900 చ అడుగుల స్థలాన్ని కొన్న ఒక వ్యాపారి అక్కడ విడియో థియేటర్లు నెలకొల్పడానికి కలెక్టర్‌కు దరఖాస్తు పెట్టుకున్నాడట

★ బొంబాయి గేట్‌వే ఆఫ్ ఇండియా వద్ద ఎన్నో నావలలో విడియో ద్వారా చిత్రాలు ప్రదర్శింపబడుతున్నాయి వాటిలో కొన్ని బొంబాయిలోని థియేటర్లలో ప్రదర్శింపబడే తాజా చిత్రాలు కూడా ఉన్నాయట

★ జోధ్‌పూర్‌లోని మోహన్ టాకీస్‌లో "విధాత" హిందీ చిత్రం ప్రదర్శింపబడుతూన్నప్పుడే అదే ఊళ్ళో కొన్ని చోట్ల విడియోలలో అదే చిత్రం ప్రదర్శింపబడిందట

★ అమితాబ్ చిత్రం "కూలీ" విడుదలపక ముందే ఆ చిత్రం తాలూకు 9 రీళ్ళు బొంబాయి, సి పి, బీరార్‌లలో విడియోల ద్వారా చూపబడుతున్నాయట "లోగ్ క్యాకహేంగా" అనే చిత్రం విడుదలపక ముందే ఆ చిత్రం తాలూకు విడియో కేసెట్లు రాజస్థాన్‌లో చలామణిలో ఉన్నాయట గోండియా(సి పి)లో "అంధా కానూన్" విడుదలకు మునుపే అక్కడి 3 విడియో కాఫీ హౌస్‌లలో ఆ చిత్రం రోజూ నాలుగు ప్రదర్శనలు హౌస్‌ఫుల్ అవుతున్నాయట

"రాజ్ కుమార్"లో మందు ప్రహసనం

అధునాతనమైన ఆ భవంతిలో దాబా చీకటి పడుతోంది ప్రకృతి మంద్ర స్థాయిలో మందు పుచ్చుకుంటున్నట్లుంది

జడ్జి జగన్నాధరావు (రావు గోపాలరావు) కుర్చీలో కూర్చున్నాడు ఎదుట తాతారావు (అల్లు రామలింగయ్య) గ్లాసుల్ని పట్టుకొని అతి వినయంగా నిల్చొన్నాడు

"కూర్చోరా! కొంగలా అలా నుంచున్నావేం?" అన్నాడు జగన్నాధరావు

"భలేవారే!" తాతారావు ముక్కు మీద వేలేసుకున్నాడు "తప్పుడని చేస్తూ మీ ముందు కూర్చోవటం కూడానా?"

గ్లాసులో విస్కీ, సోడా పోస్తూ, "తాగడం తప్పుకాదురా తాగి వాగడం, వాగి దొర్లడం తప్పు, ముందర కూర్చోరా!" అన్నాడు జగన్నాధరావు

గ్లాసు అందుకుని తాగుతూ, "ఎంతైనా మీరు పెద్దవారు విద్యావేత్తలు, న్యాయమూర్తులూనూ మీ ముందు నే నెంత," అన్నాడు తాతారావు

"ఎంతేమిటి? ఒక రౌండంత"

"అందుకేనండి మీరు నాకు నచ్చారు ఏదీ— ఇంకో రౌండు వెయ్యండి"

ఎన్నో రౌండ్లు అయిపోయాయి ఖాళీ అయిన సీసా మసక మసగ్గా కన్పిస్తూంటే తాతారావు ఎదురుగావున్న కుర్చీలో కూలబడ్డాడు అతన్ని విస్కీ తాగిందో లేక విస్కీని అతను తాగాడో కాని, కాళ్ళు మాత్రం జగన్నాధరావుమీది కెళ్ళాయి "ఒరేయ్, జగ్గూగా! హెచ్చు తగ్గులు లేకుండా అంతా ఒకటే అంటావురా? అంటే— నీ లెవల్, నా లెవల్ ఒకటే అనా?"

"అలాఅనినేనెక్కడఅన్నానయ్యా,బాబా?"

తాతారావు ఠీవిగా గ్లాసును నేలకేసి కొట్టాడు "షటప్! నా దగ్గర ట్రిక్స్ ప్లే చెయ్యకు అసలు నువ్వెంతరా— బచ్చాగాడివి పోయ్! ఇంకో గ్లాసులో పోయ్ నాకు"

"తప్పుతుందా? ఈ మేళం రోజూ ఉందేగా?" అంటూ తాతారావు కాళ్ళదగ్గర జగన్నాధరావు చతికిలబడ్డాడు

'ఒరేయ్! దొంగకోళ్ళు పట్టే నాయాలా! నాకు తెలీకుండా నా ఇంట్లో మందు తాగేసి, నన్ను ఏదేదో అంటావా? డొక్క చించేస్తాను ఒరేయ్! దేవుడైనా, దేశానికి పి ఎం అయినా ఐ డోంట్ కేర్! దటీజ్ తాతారావు వాటీజ్ తాతారావు?"

"దటీజ్ తాతారావు"

"నో డిసీస్ తాతారావు!" అంటూ గ్లాసును విసిరేసి, పడిపోయాడు

శోభన్‌బాబు, జయసుధ, అంబిక, జానకి, నిర్మల, జయమాలిని, నూతన్ ప్రసాద్, మాస్టర్ సురేష్ ముఖ్య భూమికలను పోషించిన శ్రీనాధ్ మూవీస్ "రాజ్ కుమార్" చిత్రాన్ని గుత్తా రామినీడు దర్శకత్వంలో అలపాటి రంగారావు నిర్మించారు నిర్వహణ కోగంటి భాస్కరరావు,


★

'భాగ్యలక్ష్మి'లో



'ముక్కుపుడక'లో విజయశాంతి






"తోడూ — నీడ"

"అనురాగానికి, త్యాగానికి అర్థం ప్రేమ బంధానికి, అనుబంధానికి అర్థం పెళ్లి జీవితానికి ప్రేమ తోడు అయితే, పెళ్లి అందుకు నీడ అవుతుంది ఈ ప్రాతిపదికపై మహిళలను ఆకట్టుకొనే ఎన్నో అంశాలు గల చిత్రం," అన్నారు ఎస్ పి వెంకన్నబాబు ఈయన నిర్మిస్తున్న మహేశ్వరీ ఫిలిమ్స్ వారి పై చిత్రంలో శోభన్‌బాబు తండ్రీ కొడుకులుగా ద్విపాత్రలు నిర్వహిస్తున్నారు రాధిక, సరిత, నళిని నాయికలు గుమ్మడి, ప్రభాకరరెడ్డి, అల్లు రామలింగయ్య, సూర్యకాంతం తక్కిన నటవర్గం మాటలు, పాటలు, ఆత్రేయ రాశారు చక్రవర్తి సంగీతం, నవకాంత్ ఛాయ, సాయికుమార్ శిల్పం, గౌతమ్‌రాజు కూర్పు నిర్వహిస్తున్నారు "జూన్ 11 నుంచి 18 వరకు జరిగే చివరి షెడ్యూల్లో మూడు పాటలు చిత్రీకరింపబడతాయి," అన్నారు డైరెక్టర్ వి జనార్ధన్

"సినిమాకెళ్లి అలా తడిసిపోయి వచ్చావేమిటి? చెమటా-ఏడుపా?"



నమోదు చేయబడిన చిత్రాల పేర్లు


ప్రతిభ చిత్ర "ప్రజావిజయం", శ్రీ కాత్యాయనీ క్రియేషన్స్ "దిగివచ్చిన దేవుడు", జయకృష్ణా మూవీస్ "దొంగగారు", శ్రీ విశ్వప్రశాంత్ మూవీస్ "మానవుడు — దానవుడు", రమా ఫిలిమ్స్ మూవీస్ "ముద్దుల చెల్లెలు", విజయ ఆదిత్య క్రియేషన్స్ "ప్రేమ సాగరం", శ్రీ విశ్వప్రశాంత్ మూవీస్ "మరో మొనగాడు"

డైరెక్టర్ తాతినేని ప్రసాద్ కొత్త చిత్రాలు

1 పద్మాలయా వారు హిందీలో నిర్మించే "మనిషికో చరిత్ర" 2 సుహాసిని ద్విపాత్రాభినయంతో నరసింహారావు, వెంకటేశ్వరరావు నిర్మించే చిత్రం 3 గొల్లపూడి, అల్లు రామలింగయ్య ప్రభృతులతో "ఎంగళ్ వాద్యార్" అనే విజయవంతమైన తమిళ చిత్రం ఆధారంగా ఎం కె రాధ, అక్కినేని ఆనందబాబు నిర్మించే చిత్రం

శుభలేఖ సుధాకర్

"సుధాకర్ పేరు గల నటులు మరో ఇద్దరు ఉన్నారు గనుక ఇటువంటి నా వ్యవహార నామం "శుభలేఖ సుధాకర్", అని పాత్రికేయుల సమక్షంలో ప్రకటించాడు "శుభలేఖ, రెండు జెళ్ళ సీత, సవాల్, జీవన చదరంగం", తమిళంలో "తుణై" చిత్రాలలో ప్రశంసనీయంగా నటించిన యువకుడు ఈ స్ఫురద్రూపి విశాఖపట్నం ఎల్ బి కాలేజీలో బి కామ్ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు తమిళనాడు ఫిలిమ్ అండ్ టెలివిషన్ ఇన్‌స్టిట్యూట్‌లో నటనలో శిక్షణపొంది, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై, 1980–81 సంవత్సరానికి ఉత్తమ విద్యార్థిగా ఎస్ ఎస్ కృష్ణన్ రోలింగ్ ట్రోఫీని గెలుపొందాడు ప్రస్తుతం "కొత్త దంపతులు, భైరవకోన, శుభకామన (హిందీ)" చిత్రాలలో నటిస్తున్నాడు "బాపుగారి దర్శకత్వంలో ఒక తెలుగు చిత్రంలో, మరో ప్రముఖ సంస్థ నిర్మించే తమిళ చిత్రంలో బుక్ అయ్యాను నా తొలి చిత్రం 'శుభలేఖ' శతదినోత్సవం జరుపుకోవడం నా అదృష్టం అదే పాత్రను హిందీ 'శుభకామన' లో ఇచ్చిన డైరెక్టర్ కె విశ్వనాథ్ గారికి ఎంతో ఋణపడి ఉంటాను నన్ను ప్రోత్సహించిన జంధ్యాలగారు, బాపుగారు, జైదేవ్‌గార్లకు కూడా ఎంతైనా కృతజ్ఞుడ్ని అందరి ఆశీస్సులతో లంచెలంచెలుగా పురోభివృద్ధి చెందగలనని నా విశ్వాసం," అన్నారు శుభలేఖ సుధాకర్



అక్కినేని, శ్రీదేవి 'శ్రీరంగనీతులు'

"చండి – చాముండి"

"టార్జాన్ లాంటి పాత్రను తొలిసారిగా తెలుగు తెరపై ఒక యువతి నిర్వహిస్తుంది రాజా అనే ఏనుగుతో పాటు మరో పది ఏనుగులు చేసే అద్భుతమైన పనులు ఆశ్చర్యంకలిగిస్తాయి పూర్తిగా మైసూర్ అడవుల్లో షూట్ చేస్తాం స్క్రిప్ట్ రెడీ అయింది ఇక ఆర్టిస్టులను ఎన్నుకోవడమే తరువాయి," అన్నారు కె ఎస్ రెడ్డి ఈయన స్క్రీన్‌ప్లే దర్శకత్వంలో సురేఖా పిక్చర్స్ తయారుచేసే "చండి – చాముండి" చిత్రానికి పేరాల కథ, మాటలు రాశారు సత్యం సంగీత దర్శకుడు "జూన్ నుంచి షూటింగ్ ప్లాన్ చేశాం," అన్నారు నిర్మాత కె ప్రకాష్ ఈయన ఇంతకు ముందు "కదిలి వచ్చిన కనకదుర్గ" చిత్రాన్ని నిర్మించారు

తారలు – తీరులు

★ "నేను సుశీల, జానకిగార్లలా తెర వెనుక పాడాలని మా నాన్నగారు ఆశించారు కాని, తెర ముందుకు వచ్చేశాను," అంది పూర్ణిమ ఎప్పుడూ ఈమె సులోచనా పట్టాభిరామన్ అనే సంగీత విద్వాంసురాలి వద్ద శాస్త్రీయ సంగీతం అభ్యసించింది మురళి ఆర్కెస్ట్రా బృందంతో కలిసి పాడి, బహుమతులు కూడా అందుకుంది ఇప్పుడు భరతనాట్యం నేర్చుకుంటోంది

★ "నేనుకూడా బాగా పాడతానండోయ్," అంది అంబిక ఈమె రచయిత్రే కాదు, నిజంగా మధురగాయని కూడా ఇటీవల బెంగుళూరులో జరిగిన 'డాక్టర్ రాజ్‌కుమార్ మ్యూజికల్ నైట్'లో ఈమె పాడి, హర్షధ్వానాలందుకుంది "అసలు నేను చదువుకునే రోజుల్లోనే స్కూలు పాటల పోటీలలో ఎన్నో సార్లు బహుమతులు కొట్టేశాను," అంది అంబిక ఓసారి బహుమతి ప్రదానోత్సవానికి విచ్చేసిన మెర్రిలాండ్ స్టూడియో అధినేత సి సుబ్రహ్మణ్యం అమ్మాయి చూడ్డానికి కూడా అందంగా ఉంది," అంటూ తను నిర్మించే "నాలు మణిప్పగళ్" అనే చిత్రంలో అవకాశమిచ్చాడట (శ్రీదేవి తొలి మలయాళ చిత్రం కూడా అదే) అప్పుడు అంబిక వయసు 11 ఆ తర్వాత పదహారు మలయాళ చిత్రాలలో బాల తారగా నటించి, 13వ ఏట "సీత" చిత్రంలో నాయిక అయింది

★ "ఆ మధ్య కాశ్మీర్ ఔట్‌డోర్ షూటింగ్‌కు వెళ్ళినప్పుడు నా పర్సును పోగొట్టుకున్నాను" అన్నారు చిరంజీవి ఆ తర్వాత ఆ పర్సు కేరళ నుంచి అక్కడికి వచ్చిన ఓ కాలేజీ విద్యార్థినికి దొరికిందట పర్సులోని చిరంజీవి ఫోటోను ఆమె గుర్తుపట్టి, ఆయన ఏ హోటల్లో బసచేసి ఉన్నారో వాకబుచేసి, అక్కడికి స్వయంగా వచ్చి, పర్సును అప్పగించింది కృతజ్ఞతగా చిరంజీవి బుట్టెడు ఆపిల్స్‌ను ఇచ్చారట

★ "చంద్రలేఖ" చిత్రాన్ని జ్యోతి వరుసగా ఏడురోజులపాటు చూసిందట

★ దీప తన ఇంట్లోని విజిటర్స్ రూమ్‌లో కమలహాసన్, రజనీకాంత్ ఫోటోల మధ్య తన ఫోటోను తగిలించి ఉంచింది

★ హేమమాలినిలాగే వహీదా రహమాన్ ఛటర్జీ కూడా కట్టిన చీరను మళ్ళీ కట్టదట

★ ఒక తమిళ నిర్మాత, గాయని ఎస్ జానకితో "మా చిత్రంలో సిల్క్‌స్మితకు మీరో పాట పాడాలి," అన్నాడట "క్షమించాలి ఓ వంక భక్తి గీతాలు పాడుతూ, మరో వంక ద్వంద్వార్థాలు వచ్చే అశ్లీలమైన పాటలను ఎలా పాడను?" అందట జానకి


★ సిల్క్‌స్మిత ఎంతో ముద్దుగా పెంచుకునే బాబీ అనే కుక్క ఇటీవల చనిపోయింది ఆ వేదనతో ఆమె ఆ రోజంతా ఏ షూటింగ్‌లోనూ పాల్గొనలేదట

సినిమా

త్రినాధరావు దర్శకత్వంలో "ముద్దుగుమ్మ"

''టీన్ ఏజ్ లవ్ స్టోరీస్ ఎన్నో వచ్చాయి. కాని, మా 'ముద్దుగుమ్మ' చిత్రం ఎంతో విలక్షణమైన ఇతివృత్తం ఎన్నో ట్విస్ట్‌పాయింట్లు ఉన్నాయి కమల్ అమ్రోహి (బొంబాయి) ఫిలిమ్ ఇన్‌స్టిట్యూట్‌లో నటనలో శిక్షణ పొందిన చంద్రకిరణ్ అనే అందాల యువ నటుడ్ని సెకెండ్ హీరోగా పరిచయం చేస్తున్నాం,'' అన్నారు పి త్రినాధరావు చలనచిత్ర నిర్మాణం లోని అన్ని శాఖల్లోనూ అనుభవం గడించిన ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వం నెరపే తొలి చిత్రం విజయకళామందిర్ వారి ''ముద్దుగుమ్మ'' నరేష్, పూర్ణిమ నాయకా నాయికలు — హేమసుందర్, దొరస్వామి నాయుడు, వెంకట్రావు మాస్టారు, వీరభద్రరావు, సుత్తివేలు, రాళ్ళపల్లి, మోహన, నర్తకి అంజలి పాత్రధారులు. మద్దిపట్ల సూరి సంభాషణల కర్త. బి.శంకర్ స్వరకల్పనలో సి.నారాయణరెడ్డి, పాలవెల్లి, భావశ్రీ, శారదా అశోకవర్ధన్ గీతాలు రాశారు. వి. ఎస్. ఆర్. కృష్ణారావు ఛాయ, వెంకటేశ్వరరావు కూర్పు, కె. విజయసారథి సహకార దర్శకత్వం, శ్రీనివాస శర్మ, నారాయణ రావు ప్రొడక్షన్ నిర్వహిస్తారు. ''జూన్ 30 నుంచి మా చిత్రంలోని ఏడు పాటలను రికార్డ్ చేస్తాం. జూలై 8 నుంచి నెలాఖరువరకు విశాఖపట్నం ప్రాంతాలలో ఒకే షెడ్యూల్‌లో షూటింగ్‌ను పూర్తిచేస్తాం,'' అన్నారు ఈ చిత్ర నిర్మాత పి. వి. రమణమూర్తి, బి.కామ్

గురజాడ ఆర్ట్స్ థియేటర్‌వారి తొలిచిత్రం పాటల రికార్డింగ్ ఇటీవల ఎ. వి. ఎం. స్టూడియోలోని ఆర్. ఆర్. థియేటర్‌లో జరిగింది. సంగీత దర్శకుడు జె.వి.రాఘవులు, వర్ధమాన గాయకుడు డా. కోనాడ అశోక్‌లని చిత్రంలో చూడవచ్చు.





'అగ్నిజ్వాల'లో నరేష్, అరుణ

నరేష్ హీరోగా కొత్త చిత్రం

''హొగెనకల్, ఒట్టాయిగూడెం ప్రాంతాలలో జూలై, ఆగస్ట్ నెలల్లో ఒకే షెడ్యూల్లో షూటింగ్ పూర్తవుతుంది,'' అన్నారు ఈదుపుగంటి వెంకటేశ్వరరావు ఈయన నిర్మించే దేవతా కంబైన్స్‌వారి చిత్రంలో నరేష్ హీరో 'చట్టానికి కళ్ళు లేవు' ఖ్యాతి ఎస్ ఎ చంద్రశేఖర్ దర్శకుడు ఈదుపుగంటి నాగేశ్వర రావు కూర్పు, నిర్మాణ సారథ్యం వహిస్తారు

"ఊహాసుందరి"

''చక్కని ప్రణయగాథ కొత్త నటి నళిని ఊహాసుందరిగా నటిస్తోంది,'' అన్నారు మహేశ్వరీ ఆర్ట్ పిక్చర్స్ అధినేత ఎస్ పి వెంకన్నబాబు విశాఖపట్నం చుట్టుపక్కల, అరకులోయలో మే 14 నుంచి జూన్ 5 వరకు ఏకబిగిన షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో నరేష్, సుధాకర్, రావుగోపాలరావు, అల్లు రామలింగయ్య వీరభద్రరావు, వేలు, గీత, అత్తిలి లక్ష్మి నటించారు సత్యానంద్, వేటూరి, చక్రవర్తి శ్రీకాంత్, సాయికుమార్, చక్రవర్తి, జయరామారావు తెరవెనుక కృషి చేశారు కథ స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అనిల్‌కుమార్

"పండంటి కాపురానికి పన్నెండు సూత్రాలు"లో అపర మన్మథుడ్ని మరువే అయ్యబాబు

అయ్యబాబు (గొల్లపూడి) కుర్చీలో కూర్చొని కూనిరాగాలు తీస్తున్నాడు. ఆయన కాళ్ళు పడుతున్న అప్పడు (రాళ్ళపల్లి) టీపాయ్‌ని తన్నిపట్టి ఆయన కాలువేలును లాగబోయి కింద పడ్డాడు.

"అబ్బా !" అంటూ అయ్యబాబు "కాలను కున్నావా ? వేలనుకున్నావా ? తాట వలిచేయగల్ను రాస్కెల్ !" అంటూ మళ్ళీ కాలు అందించి, "ఒరేయ్, అప్పడూ ! నేనో సంగతి అడుగుతాను— నిజం చెప్పరా ! నా ఛాతీలాంటి ఛాతీ మామిడిపల్లి మంగరాజుకుందట్రా ?" అని అడిగాడు.


"ఛాతీ ఛాతీ అండీ ? కాదు, సహారా ఎడారి మామిడిపల్లి మంగరాజుకే కాదండి చీపురుపల్లి సింగరాజుకీ లేదండి," అన్నాడు అప్పడు.

అయ్యబాబు సగర్వంగా నవ్వుకుంటూండగా ఎదురింటి పనివాడు ఒక ఉత్తరం తీసుకువచ్చి, "మోహిని అమ్మ మీకీ జాబు ఇమ్మందండీ బాబుగారు మీరే కదండీ ?" అని అడిగాడు.

అప్పడు జవాబిచ్చాడు "మామూలు బాబుగారు కాదు, అయ్యబాబుగారు పేచీకి

'దుర్గాదేవి'లో జయమాలిని, మోహన్‌బాబు





మురళీమోహన్, జమున, కృష్ణంరాజు 'కోటికొక్కడు'

దిగారంటే — ఎలాంటోళ్ళనైనా అయ్యబాబోయ్ అనిపించేస్తారు"

"అయితే, మీకేనండి ఉత్తరం," అంటూ ఇచ్చి వెళ్ళిపోయాడా కుర్రాడు.

అయ్యబాబు ఉత్తరాన్ని విప్పబోతూ, "అమ్మగారున్నారా ?" అని రహస్యంగా అడిగాడు.

"ఆ పక్కనున్నారండి," అన్నాడు అప్పడు.

అయ్యబాబు ధైర్యంతో ఆ ఉత్తరాన్ని చదవసాగాడు. ప్రియమైన బాబుగారికి "ఈ బాబుని నేనేమంటావా ?"

అప్పడు ఆతృతతో "ఇంకొంచెం ముందు కెళ్ళండి ఇంకొంచెం," అన్నాడు.

"మీరు ప్రతిరోజూ ఉదయాన్నే పరుగెడుతూ ఉంటే, నా గుండెల్లో పూలరథం పరుగెడుతున్నట్టుగా ఉంటుంది. మీ అందం, మీ ఆరోగ్యం, మీ ఛాతీ చూసి —"

"మరేం డౌటు లేదండి, బాబూ ! ఆ మోహిని ఖచ్చితంగా మిమ్మల్నే లవ్ ఆడుతూన్నదండీ, బాబూ !"

"నా మనసు మీకేనాడో అంకితం చేశాను."

"బాబోయ్ ! ఇంక చదవ్వొద్దు. ఆపెయ్యండి. ఇది నిజంగా అసాధ్యమైన పేరు. మీరు కొంచెం కూడా అనుమానించకుండా బయల్దేరండి. ఆలస్యం చేస్తే, రోజులు అస్సలే బాగోలేవు."

అయ్యబాబు తనలో తాను ఉప్పొంగిపోయాడు.


దగ్గుబాటి భాస్కరరావు నిర్మించే అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ "పండంటి కాపురానికి పన్నెండు సూత్రాలు" చిత్రానికి రాజాచంద్ర దర్శకుడు.

"భైరవకోన"

"ఐదు యువజంటలు ముఖ్య భూమికలు నిర్వహించే సస్పెన్స్, హారర్, థ్రిల్లర్," అన్నారు వి జయదేవ్. డూండీ బావమరిది అయిన ఈ యువకుడు గతంలో త్రిమూర్తి ప్రొడక్షన్స్‌లో సహాయ, సహకార దర్శకుడుగానూ, తాంత్రిక ఛాయాగ్రాహకుడు రవికాంత్ నగాయిచ్ వద్ద ఇరవై చిత్రాలకు సహదర్శకుడుగానూ అనుభవం గడించారు. ఇప్పుడీయన దర్శకత్వంలో శ్రీ విఘ్నేశ్వరా ఆర్ట్స్ అధినేత కె దామోదరం నిర్మించే "భైరవకోన" చిత్రం షూటింగ్ మే 22 నుండి జూన్ 15 వరకు కృష్ణాజిల్లాలో ఒకే షెడ్యూల్లో పూర్తవుతుంది. పేరాల సంభాషణలకర్త. రాజ్‌కోటి స్వరకల్పనలో ఆరుద్ర, సి నారాయణరెడ్డి గీతాలు రాశారు. ఎం వి రఘు ఛాయ, మణి ప్రొడక్షన్, శేఖరరెడ్డి కూర్పు, కొల్లి అంజిరెడ్డి నిర్వహణలో వి పెంచలయ్య సహ నిర్మాత.

'కొత్త దంపతులు'లో శుభలేఖ సుధాకర్, తులసి





'తోడు—నీడ'లో రాధిక, సరిత, శోభన్‌బాబు

"శక్తి"

"ధనశక్తి కన్నా స్వశక్తి మిన్న," అనే సిద్ధాంతం మీద రూపొందించబడిన చిత్రం అన్నారు గోపీ మూవీస్ "శక్తి" చిత్ర దర్శకుడు కె రాఘవేంద్రరావు — దేశానికి పల్లెటూళ్ళ పట్టుకొమ్మలు. పట్టణాలు పారిశ్రామికంగా పురోభివృద్ధి సాధించాలంటే పల్లెలే ఆదరువు. దేశానికి వెన్నెముక రైతు. రైతు లేనిదే దేశానికి ప్రగతి లేదు. చేను సాగుచేసి, నీరుపోసి, బంగారు పంటలు పండించి, ప్రజాజీవనాధారానికి మూల కారకుడవుతున్నాడు రైతు. అతను నేల తల్లిని నమ్ముకున్న జీవి. కష్టమొచ్చినా సుఖమొచ్చినా ఆ తల్లి ఒడే అతనికి దిక్కు. ఆ తల్లి ఒడిన అందరూ చల్లగా బతకాలి. అభిమానాన్ని కాపాడుకుంటూ, దానికోసమే ప్రాకులాడుతూ ఆ రైతన్న అలాగే ఎంతోకాలంగా మనుగడ సాగిస్తున్నాడు. అటువంటి రైతు కుటుంబం కథ,' అని కూడా డైరెక్టర్ వివరించారు. ఈ చిత్రంలో కృష్ణ, జయసుధ, రాధ, రావు గోపాలరావు, ప్రభాకరరెడ్డి, అల్లు రామలింగయ్య, శుభ, నిర్మల, చలపతిరావు పాత్రధారులు. సత్యానంద్, చక్రవర్తి, కె. ఎస్. ప్రకాష్, శ్రీనివాసరాజు, కోటగిరి వెంకటేశ్వరరావు, జాస్తి ప్రభృతి సాంకేతిక శక్తితో ఎ. గోపాలకృష్ణ నిర్మాత

"మాసూమ్" లాంటిదే మరో చిత్రం

గతంలో "ఖ్వాజా కి దివానీ" చిత్రాన్ని నిర్మించిన ఆబిద్ హుసేన్‌కి ఇటీవల విడుదలైన "మాసూమ్" చిత్రం ఎంతగా నచ్చిందంటే, దాదాపు ఇలాంటి ఇతివృత్తంతోనే, ఇందులో పాల్గొన్న తారలతోనే "ఏక్ ఔర్ మాసూమ్" అనే చిత్రాన్ని తయారు చేయడానికి నిశ్చయించాడట

సినిమా

విచిత్ర సీమలో 'ఏప్రిల్ ఫూల్' తమాషాలు

మహారాష్ట్రలోని లాటూర్ నగర నివాసి ఒకడు — ఫలానా తేదీన, ఫలానా ముహూర్తానికి రాజేష్‌ఖన్నాతో టినా మునీమ్‌కు వివాహం జరగనున్నట్లు కొన్ని శుభలేఖలు అచ్చు వేయించి, బొంబాయి సినిమా పరిశ్రమలోని పలువురికి పంపించాడు.

గుజరాత్‌కు చెందిన శారద్‌కుమార్ మెహ్తా అనే ఒక పవిత్ర పుణ్యయ్య "వర్షా" అనే చిత్రం గురించి "సందేశ్" అనే గుజరాతీ దిన పత్రికలో ఇలా ఒక ప్రకటన వేయించాడు :

"భారతదేశంలోని 251 కేంద్రాలలో ఒకేసారి విడుదల "వర్షా" వర్ణ చిత్రం. తారాగణం: రాజ్‌కుమార్, దిలీప్‌కుమార్, సంజీవ్‌కుమార్, అశోక్‌కుమార్, హేమమాలిని, జితేంద్ర, సులక్షణ పండిట్, స్మితాపాటిల్ మోడి, పద్మిని కొల్హాపురి, నూతన్, పవసటి వర్షా."

పై ప్రకటనను కొందరు నిజమని నమ్మేశారట కూడా! *

గురజాడ కళామందిర్ చిత్రం

"విజయనగరంజిల్లా గరివిడి ప్రాంతాలలో జూన్ 7న షూటింగ్ మొదలై, ఒకే షెడ్యూల్లో ముగుస్తుంది," అన్నారు పై నూతన సంస్థ నిర్మించే చిత్రానికి తొలిసారిగా దర్శకత్వం నెరపే సి. ఉమామహేశ్వరరావు. తారాగణం : శివకృష్ణ, సుధాకర్, నూతన్‌ప్రసాద్, గీత, శ్యామలగౌరి, హరిబాబు. కథ, మాటలను సంజీవి రాశారు. ఆరుద్ర, కె. రాజేశ్వరరావు గీతాలకు జె.వి. రాఘవులు బాణీలు కూర్చారు. మధు అంబట్ ఛాయ, కె. రవీంద్రబాబు కూర్పు, మూర్తి నిర్వహణలో ఎ. అనసూయా రాణి, టి. గోవిందరావు సహ నిర్మాతలు. టి. రామకృష్ణరాజు నిర్మాత.

"మూడు ముళ్ళు"


శ్రీ సారధి స్టూడియోస్, ఎ. వి. ఎం. కంబైన్స్ నిర్మించే చిత్రానికి "మూడుముళ్ళు" అని నామకరణం చేసినట్లు నిర్మాత పి. శశిభూషణ్ ప్రకటించారు. గోదావరి జిల్లాలో జూన్ 15 నుంచి జూలై 25 వరకు ఒకే షెడ్యూల్లో షూటింగ్ పూర్తయ్యే ఈ చిత్రంలో చంద్రమోహన్, రాధిక, గీత, ప్రభాకర రెడ్డి ప్రభృతులు పాల్గొంటారు. రాజన్—నాగేంద్ర సంగీత దర్శకులు. గోపాల్‌రెడ్డి ఛాయాగ్రాహకుడు. ఆగస్ట్ విడుదల.

నటుడు నారాయణరావు నిర్మించే చిత్రంలో చిరంజీవి

"చిరంజీవి, విజయశాంతి హీరో హీరోయిన్‌లు. నాది ఒకవెరైటీ అయిన పాత్ర," అన్నారు నారాయణరావు. ఈయన సెప్టెంబర్‌లో షూటింగ్ ప్రారంభించి, నవంబర్‌లో పూర్తి చేసే చిత్రానికి ఎస్. ఎ. చంద్రశేఖర్ డైరెక్టరు. జనవరిలో విడుదలవుతుంది.

కృష్ణ, శోభన్‌బాబుతో "ఇద్దరు దొంగలు"

"ఇద్దరు హీరోల సబ్జెక్టు తో ఇది ఎంతో వెరైటీ అయింది," అన్నారు కె. రాఘవేంద్రరావు. ఈయన దర్శకత్వంలో కైకాల సత్యనారాయణ సమర్పించే రమా ఫిలిమ్స్ "ఇద్దరు దొంగలు" చిత్రం షూటింగ్ జూన్ 1న మొదలైంది. శోభన్‌బాబు, కృష్ణ, సత్యనారాయణ, జయసుధ, రాధ, శారద, ప్రభాకరరెడ్డి, రావుగోపాలరావు, గిరిబాబు, అల్లు రామలింగయ్య, నూతన్‌ప్రసాద్, నాగేష్, మమత తెరముందు; సత్యానంద్, చక్రవర్తి, వేటూరి, కె. ఎస్. ప్రకాష్, భాస్కరరాజు, నాగేశ్వరరావు, సలీమ్ తెర వెనుక కృషి చేస్తున్నారు కైకాల నాగేశ్వరరావు ఈ చిత్ర నిర్మాత ★




ఆరోగ్యం, మజా, జోరూ తోడు జోడుగా! తాగండిక బోర్న్‌విటా.



మీ కుటుంబంలోని వారికి క్యాడ్‌బరిస్ బోర్న్‌విటా యివ్వండి. దానిలోని రుచి అంటే వాళ్ళందరికీ మహాయిష్టం. బోర్న్‌విటాలో ప్రకృతిలోని మంచి లక్షణాలు గల కోకో, మాల్ట్, పాలు, పంచదార సమృద్ధిగా ఉన్నాయి. బోర్న్‌విటా మీ కుటుంబంలోని వారందరికీ ప్రతిరోజూ యివ్వండి-రోజుకు రెండుసార్లు.

క్యాడ్‌బరిస్
బోర్న్‌విటా దీన్లోని మంచిదనం పెరుగుతుంది మీపైనిక

OBM/8845 F



(గత సంచిక తరువాయి)

ముసలివాడు ఈటెను వదిలిపెట్టి, తీంట్ర పొదలోకి నడిచాడు. ఎనిమిది సలుగులు ముద్దుగా దోగాడుతున్నాయి. అతడు మోకాళ్ళ మీద కూర్చుని రెండు చేతుల్లో రెండు సలుగుల్ని తీసుకున్నాడు. వాటిని ఆప్యాయంగా చూస్తూ అతడు ముఖంమీదున్న ముడతలు రెట్టింపు అయ్యేట్టుగ చిరునవ్వు నవ్వాడు.

'వీటిని పెంచి పెద్దజేయడం ఎలాగ?' అని అతడు ప్రశ్నించుకున్నాడు. నా దొడ్డిలో ఇంకో సుక్కపంది ఉంది. అది మొన్ననే సలుగుల సీనింది. ఈ సలుగులను తీసుకెళ్ళి దానిచెంత వదులుతాను' అనుకున్నాడతడు.

'సుక్కపందులు పరాయి సలుగులను దరి జేరనియ్యవేమో. అవి పరాయి సలుగులకు పాలి వ్వడం ఎవరూ వినలేదు. కనలేదు' అని అతనికి సందేహం కలిగింది.

'అంతా సంభవమే. ఇతరులు కని, విని ఎరుగనివి, ఎన్నో చేశాను. ఇంకా చేస్తాను.' అనుకున్నాడతడు.

తను కూర్చునిఉన్న చోటునుండి అతడు సుక్కపందివైపు చూశాడు. 'నా చేతులతో పెంచి పెద్దజేసిన పందిని నా చేతులలోనే చంపుకున్నాను. దానిని నేనెన్నటికీ మరచిపోను. ఆ మరణానంతరం నాకది ప్రతిరాత్రీ కలలో కనబడుతూ ఉంటుంది.' అనుకున్నాడతడు.

గాలి గప్పున ఆగిపోయింది. గాలిలో ఎగురుతుండిన ఎండుటాకులు గిరగిర తిరుగుతూ భూపతనం కాసాగాయి. తలలు వంచుకుని ఉండిన చెట్లు నిరారుగా నిల్చున్నాయి.

'యుద్ధం ముగిసింది' అనుకుంటూ ముసలివాడు పైకి లేచాడు. నల్లని పిట్టలు కొన్ని ''గీగీ గీగీ'' అని అరుస్తూ ఆకాశంలో ఎగురుతూ పోతున్నాయి. 'కబోది పిట్టలు గూడ గూళ్ళకు ప్రయాణమవుతున్నాయి. త్వరలో వేగుచుక్క పుడుతుంది. పొద్దు పొడిచేలోగా నేను గుడిసెను చేరుకోవాలి.' అనుకున్నాడు ముసలివాడు.

సలుగులు కీచుకీచుమని చప్పుడు చేస్తున్నాయి. ఊతకర్రలను పోగొట్టుకున్న గుడ్డివాళ్ళ వలె తడబడుతూ అటూ ఇటూ ప్రాకుతున్నాయి. మెత్తగ కంపిస్తున్న వాటి డొక్కలకేసి చూస్తూ ముసలివాడు, 'యుద్ధం ముగిసిందని నేనను కోవడం పొరబాటు. పొద్దు పుట్టేలోగా ఈ సలుగుల్ని గుడిసె వద్ద దొడ్డిలో ఉన్న సుక్కపంది వద్ద వదిలి పాలు కుడపాలి. పాలు లేకుండా ఈ పసి ప్రాణాలు ఎంతోసేపు బతకలేవు. పొద్దు పొడిచేలోగ వీటిని గుడిసెకు చేరవేయడం అత్యవసరం నక్కలను, తోటిగువ్వను, చివరకు సుక్కపందిని చంపి సలుగుల్ని కాపాడు కోవడం ఒక యెత్తు. కాపాడుకున్న సలుగుల్ని పొద్దుపొడిచే లోగా గుడిసెకు చేర్చడం మరొక ఎత్తు. కనుక యుద్ధం ముగిసిందని నేననుకోవడం పొరబాటు ఇప్పుడు నా బలహీనతయే నా శత్రువు.' అనుకున్నాడతడు.

అతడు గడ్డిచాటున పడి ఉన్న కత్తిని తీసుకుని లోయకు అవతలి గట్టున ఉన్న వెదురు పొదలవైపు నడిచాడు రెండు వెదురు బొంగులను నరికి భుజాన వేసుకుని సుంకేసు చెట్టుకిందకు ఈడ్చుకొచ్చాడు. వెదురు బద్దలను చీల్చి, ఆ బద్దలతోను, తీంట్ర తీగలతోను గంపను అల్లడం ప్రారంభించాడు.

'గుడిసెలో పిల్లవాడు నా కోసం ఎదురు చూస్తూ ఉంటాడు' అనుకున్నాడు ముసలివాడు. 'వాడీ రాత్రి జాగారం చేసి ఉంటాడు. తిండీ, నీళ్ళు గూడా ముట్టుకోకుండా నా కోసం కళ్ళలో వత్తులు వేసుకుని చూస్తూ ఉంటాడు. నేను అడవిలో సుక్కపంది కోసం వెదుకుతూ తిరుగుతుండినంతసేపు, దానికి కాపలా కాస్తూ సుంకేసు చెట్టుమీద కూర్చుని ఉన్నంతసేపు, దానినీ గంపలో వేసుకుని తిరుగు ప్రయాణంలో ఉన్నంతసేపు వాడు గుడిసె ముందర కూర్చుని నా కోసం ఎదురు చూస్తూనే ఉంటాడు. నా క్షేమం కోసం, పందుల క్షేమం కోసం వేయి దేవుళ్ళకు మొక్కుకుని ఉంటాడు. సుక్కపంది చనిపోయిన వైనాన్ని, నా తొడలు ఛిన్నాభిన్నమైన వైనాన్ని చూసి వాడు ఎలా ప్రవర్తిస్తాడో వేదన తాళలేక నేలమీద పడి దొర్లుతూ ఏడుస్తాడేమో. లేక గుడ్ల నీరు కుక్కుకుంటూ నా వొడిలో దూరి రోదిస్తాడేమో.''

అతడు గంపను అల్లడం పూర్తిచేసి పైకి లేచాడు సుక్కపందిని ఎత్తి గంపలో నేశాడు. దానిమీద జానెడెత్తు కానుగాకులు పరచి ఆ పరుపుమీద సలుగులను ఒక్కొక్కదాన్నే నాజూకుగా తీసుకెళ్ళి ఉంచాడు. గంపను నెత్తిమీద పెట్టుకోవడానికి అతడు ప్రయత్నించాడు. ఎంత ప్రయత్నించినా గంప భూమిమీదనుండి పైకి లేవలేదు. అతడు గోచెను సవరించి కట్టుకుని, అరచేతులను ఒకదాని కొకటి రాచుకుని, గుండెల నిండా గాలి పీల్చుకుని మళ్ళీ ప్రయత్నించాడు నేలమీద గంప కసకలేదు మెసకలేదు. అతడు తన ప్రయత్నాలను విరమించుకుని, గంప పక్కన కూర్చుని పరాజయాన్ని పొందిన తన దండలను చూసుకున్నాడు 'నా వయసు పడమరకు వాలి చాల ఏండ్లయింది' అనుకున్నాడతడు తను కూర్చుని ఉన్నచోటునుండే చుట్టూ చూస్తూ, 'ఎవరయినా చేయి ఆసరా ఇచ్చి ఈ గంపను నా నెత్తిన పెడితే బాగుండును' అనుకున్నాడు శవాలు, చెట్లు, లోయలు, శిలలు తప్ప అతనికి మరేమీ కనిపించలేదు.

తానాసించిన సహాయం కోసం ఎదురు చూస్తూ అతడు కూర్చోదలుచుకోలేదు. కాలయాపన అన్నది ప్రస్తుతం అతడు తలలోనైనా చేయలేని సాహసం.

'ఈ గంప ఇంత బరువుంటుందని నేను అనుకోలేదు. సరి లోకంలో ఉండే వైరుధ్యమంతా ఈ గంపలోనే ఉన్నదాయె చాల ఏండ్లు జీవించి ఇప్పుడే ప్రాణం గొల్పోయిన ప్రాణి ఉన్నది. ఇప్పుడే ప్రాణం పోసుకుని చాల ఏండ్లు జీవించనున్న ప్రాణులూ ఉన్నాయి'' అనుకున్నాడతడు.

జరిగిన కథ — 6: చెట్టుమీద ముసలివాడు సుక్కపందిని, సలుగులను పదే పదే తలచుకుంటూ పారవశ్యం చెందుతూ ఉంటాడు. ఆ రాత్రికి సలుగులు నక్కలపాలు కాకుండా కాపాడాలని నిశ్చయించుకుంటాడు. ఓ గుంటనక్క సలుగులను పొట్ట పెట్టుకోనురాగా సుక్కపంది దానిని చంపేస్తుంది. మరొక నాలుగు గుంట నక్కలు రాగా ఒకటి ముసలివాడిచే, రెండవది చుక్కపందిచే చంపబడ్డాయి కాని మిగిలిన రెండు నక్కలు రెండు సలుగులనీ నోట కరిపించుకొని పారిపోయాయి తోటి గువ్వపై కోపంతో ముసలివాడు దానిని తన కత్తికి బలిచేస్తాడు. నక్కల బారినుండి సలుగుల్ని కాపాడను వేరే దారిలేక సుక్కపందిని తన ఈటెతో చంపి నక్కలను తరిమివేస్తాడు ముసలివాడు. సుక్కపందిని తన చేజేతులా చంపినందుకు బాధపడతాడు.

'ఈ ఎలుగులు నిజంగానే చాలా ఏండ్లు జీవిస్తాయా?' అని అతడు తనను తాను ప్రశ్నించుకున్నాడు. 'అడుగంటిపోతున్న నా దేహ బలంమీద ఎనిమిది ప్రాణాల మనుగడ ఆధారపడి ఉండడం ఎంత దురదృష్టకరం!'' అనుకున్నాడతడు.

'సలుగులను కాపాడుకొనడానికై సుక్క పందిని పోగొట్టుకున్నాను. సలుగుల కోసమే ఇప్పుడు సుక్కపంది శవాన్ని అడవిలో వదిలిపెట్టి వెళతాను'' అనుకుంటూ అతడు పైకిలేచాడు. 'ఏ మానవుడూ పరిపూర్ణంగా అదృష్టవంతుడు కాడు. ఏ మానవుడూ తను వేలుపెట్టిన చోటల్లా విజయుడై రాలేదు. జయాపజయాల సమన్వయ భావమే జీవితం. కన్నీళ్ళు దుఃఖభారాన్ని తగ్గించినట్టుగా ఈ సమన్వయభావం ఓటమిలో ఊరటనిస్తుంది.' అనుకుంటూ అతడు గంపలోని సుక్కపంది శవాన్ని బయటకు ఈడ్చి గడ్డిమీద పడవేశాడు. గంప అడుగున కానుగ ఆకులమీద ఎనిమిది సలుగులను సర్దాడు.

ఈసారి అట్టే శ్రమపడనవసరం లేకుండా గంప పైకి లేచింది. దానినతడు తన మోకాళ్ళ మీదుంచి పట్టుకుని పెద్దగా గాలి పీల్చుకున్నాడు. కణతలమీద రక్తనాళాలు పొంగుతుండగా, అవుడు గరచుకుని అతడు గంపను మోకాళ్లమీదనుండి భుజంమీదకు, అక్కడనుండి నెత్తిమీదకు జరుపుకున్నాడు. చేయిచాచి కత్తిని, ఈటెను తీసుకుని తూర్పువైపుగా నడవడం ప్రారంభించాడు.

20

సలుగులు కలతచెంది ఉన్నట్లు కీచుకీచుమనడం ప్రారంభించాయి. 'ఇంకెతసేపు లెండ్రా. కన్నుమూసి తెరిచేలోగా గుడిసెచేర్చేస్తా' అనుకుంటూ అతడు నడవసాగాడు.

ఆకాశం మీద పడమటి వాలునఉన్న చంద్రుడు కలగజేసిన తననీడను తొక్కుకుంటూ సుదూరంగాకనిపించే కొండల సహాయంతోను, నక్షత్రాల సహాయంతోను దిక్కులు తెలుసుకుంటూ అతడు సాగుతున్నాడు.

నెత్తిమీదున్న గంపలోని కానుగాకులమీదున్న సలుగులు అవిరామంగా కదులుతుండుగా వాన చినుకులు పడుతున్నట్లు చప్పుడవుతున్నది.

తాను అడవిలోకి వచ్చేటప్పటికంటె ఈ తిరుగుప్రయాణం వేగంగా సాగుతున్నట్టు ముసలివానికి అనిపిస్తూంది. ఇప్పుడు గుహలను వెదకనవసరంలేదు. పొదలను ఈటెతో బాదనవసరంలేదు. ''హూచ్– హూచ్''మని అరవ నవసరంలేదు. కాలిబాట వెంబడి నడవడమొక్కటే ఇప్పుడతని పని.

అలా రెండుజాములు నడిచాక తాను అనవసరంగా కాలయాపన జరుపుతున్నట్లు అతనికి అనిపించింది. అతడు కాలిబాటను వదలిపెట్టి పచ్చికమైదానాలకడ్డంగాను, లోయల కడ్డంగాను పడి తూర్పుదిక్కుగా నడవసాగాడు.

కండ్లతో ఆకాశాన్ని గమనిస్తూ, చెవులతో సలుగులఅలికిడిని వింటూ అతడు వడివడిగా సాగుతున్నాడు.

క్రమంగా రాత్రి గడిచి చంద్రుడు



అతడు అడవిని జయించాడు

అస్తమించి పడమటి కొండల వెనక గ్రుంకాడు మరికొంతసేపటికి ఉషోదయమై తూర్పు ఆకాశం ఎర్రనయింది.

నడుస్తున్న ముసలివాడు వీపుమీదెవరో చరిచినట్లు హఠాత్తుగా ఆగిపోయాడు. అతడు గమనించలేదుగాని— చాలసేపటినుండి గంపలో నుండి సలుగుల అలికిడి వినబడడం లేదు. ఆ యెరుక కలగగానే అతని తనువు ఆపాద మస్తకం క్షణకాలం జలదరించింది. జలదరిస్తున్న చేతులతో అతడు గంపను కిందకు దించి పెట్టాడు. ఎనిమిది సలుగులు నిశ్చలంగా పడి ఉన్నాయి. లోతుకు పీక్కుపోయిన వాటి డొక్కలు బలహీనంగా పైకి కిందకు ఆడుతున్నాయి మూసుకుని ఉన్న ఉల్లిపొరలవంటి పల్చని కను రెప్పల కింద కనుగుడ్లు అటు, ఇటు కదులు తున్నాయి.

ఆ గంపమీద ప్రాకుతున్న మృత్యునీడలను చూసి ముసలివాడు భయ విహ్వలుడయ్యాడు 'నేనీ సలుగుల జీవితాలతో చెలగాట మాడు తున్నాను. పాలు లేకుండా ఇక ఇవి అట్టేసేపు బతకవు. వీటిని నా చేతులార నేనే చంపుకో బోతున్నాను' అనుకున్నాడతడు. వణుకుతున్న చేతులతో అతడు గంపను నెత్తిమీద పెట్టుకుని నడవసాగాడు.

నడిచేకొద్దీ జబ్బలమీదను, తొడలమీదను కట్టివున్న పక్కులు ఒక్కటొక్కటే విడిపోయి రక్తస్రావం ప్రారంభమయింది. రక్తం బొట్లు బొట్లుగ నేలమీద పడసాగింది. అంతకింతకు ముసలివానికి బలహీనత ముంచుకు రాసాగింది

'నా సంకల్ప బలానికి పరాజయం లేదు అది అన్ని బలహీనతలను జయిస్తుంది. సలుగులను ప్రాణాలతో గుడిసెకు చేరుస్తాను. అదే నా సంకల్పం.' అనుకున్నాడు ముసలివాడు.

క్రమంగా అతనికి తాను గంపలో సలుగులను కాక మృత్యుదేవతను మోసుకుని పోతున్నట్టు, ఆ మృత్యువు తన ఆత్మస్థైర్యాన్ని, శరీర దారుఢ్యాన్ని హరించి వేస్తున్నట్లు ముసలివానికి అనిపించసాగింది.

అతనికి తల గిర్రున తిరుగుతున్నట్టు, మైకం కమ్ముతున్నట్లు అనిపించింది. అతని ప్రమేయం లేకుండానే అతని నడక ఆగిపోయింది. అతని కళ్లు చీకట్లు కమ్మాయి. ఆ చీకటిలో అతనికి నీలిరంగు వలయాలు కనిపించాయి. ఆ చీకటిలో అతనికి పిల్లవాని కంఠస్వరం వినిపించింది. రాగిమాను కొమ్మల గుండా గాలి వీచినట్లుగాను, ఏటవాలుగా ఉన్న బండ మీద నీళ్లు ప్రవహించినట్టుగా ఆ కంఠం విన్పించింది.

ఇంచుక సేపటికి మైకం వీడిపోయి, చీకటి తొలగింది. ముసలివాడు చుట్టూ చూశాడు. పిల్లవాడు ఎక్కడా కనబడలేదు. 'ఇలాంటి

అనుభవం నాకు ఇదివరకెప్పుడూ కలగలేదు. ఇంతటి అసహాయ స్థితికి నే నెప్పుడూ లోను కాలేదు.' అనుకుంటూ అతడు నడక ప్రారంభించాడు.

తూర్పున కాంతిరేకలు పుంజుకున్నాయి. గాలి అణగారిపోయి ఉండడంవల్ల వృక్షాలన్నీ మౌనంగా నిశ్చలనంగా నిలుచుని ఉన్నాయి. రాత్రి పొడవునా చంద్రుని చల్లదనాన్ని గ్రోలుతూ ఉండిన శిలలు ఇక కొద్దిసేపట్లో ప్రారంభం కానున్న సూర్య తాపానికి ఆయత్త పడుతున్నాయి.

ముసలివాని కాళ్ళు తడబడుతున్నాయి. దేహం కంపిస్తున్నది. నడక వేగం తగ్గుతున్నది. 'కాని నా ప్రయాణాన్ని ఆపరాదు. ఇప్పుడు ప్రతి క్షణం ఒక యుగం వలె విలువైనది. నా జీవితం లోని ఘడియలు ఇంతటి విలువను ఆపాదించుకోవడం ఇంతకు మునుపెప్పుడూ జరగలేదు' అనుకున్నాడతడు.

కాని అతని శరీరంలోని వివశత్వం అధికమవుతూనే ఉంది. అతని సంకల్పబలాన్ని వమ్ము చేస్తూ అతని నడక ఒక మడుగు చెంత ఆగిపోయింది. 'కాసేపు విశ్రాంతి తీసుకుంటాను. సేద దీరాక బలం చేకూరవచ్చు' అనుకుంటూ అతడు గంపను దించి పెట్టాడు. గొంతు, నాలుక ఎండి పోతున్నట్టు అతని కనిపించింది. గంపవద్ద నుండి భారంగా నాలుగడుగులు వేసి మడుగులోని నీటిని సమీపించాడు. రత్నరాసులను కుప్ప తోసుకుంటు న్నంత ఆతురతతో నీటిని దోసిళ్ళతో తీసుకుని తాగాడు. నిర్మలంగా అద్దం వలె ఉండిన నీటి మట్టం అలల మయమై నక్షత్రాలు గజిబిజిగా ఎగరసాగాయి. దాహం తీరాక అతడు నీటి అంచు వద్దనే నత్తగుల్లల మీద మేను వాల్చాడు.

బలహీనత నుండి పుట్టిన పరాజయ భారం తోను, పరాజయం నుండి పుట్టిన బలహీనత తోనూ అతడలా పడుకుని ఉండగా మడుగులోని అలలు క్రమక్రమంగా అణగారిపోయాయి. చుక్కల ప్రతిబింబాలు మళ్ళీ నిశ్చలనంగా వెలగసాగాయి.

అతనికి కోడిపందాలు జ్ఞాపకానికొచ్చాయి. నెత్తురోడుతూ వెనకతొక్కులు తొక్కుతూ ఉండే కోడిపుంజు అతనికి జ్ఞాపకమొచ్చింది. పందెంకాసిన జూదరులు తొడలు చరుచుకుంటూ పెడబొబ్బలుపెట్టడం అతనికి జ్ఞాపకమొచ్చింది. ఎద్దు పందేలలో కోడెకు పౌరుషాన్ని పుట్టించడానికి యానాదులు డప్పువాయించడం అతనికి జ్ఞాపకమొచ్చింది.

'ఇప్పుడు నన్నెవరూ ఉత్సాహపరచలేరు. నా కెవరూ పౌరుషాన్ని గరపలేరు. నేను మానసికంగా, శారీరకంగా విపరీతమైన అలసటకి గురయ్యాను. ఇప్పుడు నన్నెవరూ కార్యోన్ముఖుని చేయలేరు.' అనుకున్నాడతడు.

నీటి అంచువద్ద నత్తగుల్లలమీద వెల్లకిల పడుకునిఉన్న అతనికి చెట్ల చిగురుకొమ్మలు, నక్షత్రాలు, మేఘాలతోనిండిన ఆకాశము కనిపిస్తున్నాయి.

తను 'సుగాలోల్లఅడవి'లో పశులకాపరిగా ఉంటున్న రోజులలో జరిగిన ఒక ఉదంతం అతని తలలో మెదిలింది.

అతనితోబాటు మరి ముగ్గురు పశుల కాపరులు 'సుగాలోల్ల అడవి' లో ఉండేవారు. వాళ్ళపశువులు అడవిజీవితానికి అలవాటు పడడానికి చాల నెలలు పట్టింది. వర్షాకాలానికి అలవాటు పడగానే ఎండాకాలం ప్రారంభమయ్యేది. ఎండాకాలానికి అలవాటు పడగానే చలికాలం మొదలయ్యేది.


ఇలా ఉండగా ఒక గొల్లవాడు తన పశువుల మందతో వాళ్ళను చేరాడు. ఆ మందలో ఎనిమిది ఆవులు, పది ఎద్దులు మరికొన్ని దూడలు మొత్తం ఇరవై జీవాలుండేవి. ఆ గొల్లవానికి ఆ పశువులే జీవనాధారం. అతనికి భూమి పుట్రా ఏమీ లేవు. అతడున్న ప్రాంతంలో కరవు తాండవించగా అతడు తన పశువులను తోలుకుని ఆ అడవికి వచ్చాడు. ఈ అడవిలో పచ్చగడ్డితో నిండిన మైదానాలను, గలగలపారే సెలయేళ్ళను చూసి అతని ఆనందానికి మితిలేకపోయింది.

కాని గ్రామ జీవితానికి అలవాటుపడిన అతని పశువులు అడవిలో ఒక పట్టాన యిమడలేకపోయాయి. వెదురుపొదలలో ఎక్కడైనా జెముడు కాకి ''గూ గూ'' అని కూస్తే ఆ పశువులు చెవులు రిక్కరించుకుని నిలబడిపోయేవి. రెల్లు గడ్డిలో నీటికోళ్ళు రెక్కలు టపటప కొట్టుకుంటే అవి తోకలు పైకెత్తుకుని పరుగు పుచ్చుకునేవి.

ఒకనాడు గొల్లవాడు తన పశువులను కడుపు పిదిలిపోయేలాగ మేపుకుని సందెవేళకు తిరిగి వచ్చాడు. కట్టు గొత్తులకు వాటిని కట్టివేసి మిగిలిన పశుకాపురలతో గుడిసెలో పడుకున్నాడు. సగం రాత్రప్పుడు పశువులు ఇడుగులాడుతున్న ధ్వని వినిపించింది గొల్లవాడు దిగ్గున మేల్కొన్నాడు. పశువులు పగ్గాలను పటపట తెంచుతున్న ధ్వని వినిపించింది. గొల్లవాడు చర చర బయటకు వెళ్ళి చూశాడు. అతని పశువులు ఒక్కటి గూడా కనిపించలేదు. కట్టుగొత్తుల వద్ద సగం సగం తెగిన పగ్గాలు కనిపించాయి. మిగిలిన వాళ్ళ పశువులన్నీ నిశ్చింతగా పడుకుని నెమర్లు వేస్తున్నాయి. గొల్లవాని పశువులకు అడవి జీవితం కొత్తగనుక చీకట్లో ఏదో ఆకారాన్ని చూసి గాని, శబ్దం వినిగాని జడుసుకునిపారిపోయి వుంటాయని అందరూ నిశ్చయించుకున్నారు పారిపోయిన పశువులను వెదకుతూ వాళ్ళు తలొక దిక్కుగా బయలుదేరారు. సూర్యుడు పొడుతుండగా వాళ్ళు రిక్త హస్తాలతో తిరిగి వచ్చారు. కాని గొల్లవాడుమాత్రం తిరిగిరాలేదు. మరి రెండు పగళ్ళు, రెండు రాత్రులు వాళ్ళు గొల్లవాని కోసము, వాని పశువుల కోసము అడవంత గాలించారు. మూడవనాటి ఉదయం వాళ్ళు రెండు క్రోసుల దూరాన రాబందులు గుంపులు గుంపులుగా ఆకాశాన ఎగురుతుండడం గమనించారు. ఎలాటి ఘోరాన్ని కళ్ళజూడవలసి వస్తుందోనని భయపడుతూ వాళ్ళు అటువైపుగా పరుగెత్తారు.

ఒక భీకరమైన లోయమీద రాబందులు ఎగురుతున్నాయి. లోయ అడుగున గొల్లవాని పశువుల కళేబరాలు పడి ఉన్నాయి. లోయ అంచువెంబడి





అతడు అడవిని జయించాడు

పశువుల కొమ్ములు, గిట్టలు గీరుకుపోయిన చారలు కనిపిస్తున్నాయి.

వాళ్ళందరూ లోయలోకి దిగి పశువులను సమీపించారు. దాపున ఉన్న ఒక ముష్టిచెట్టు కొమ్మనుండి గొల్లవాడు తన పైగుడ్డతో ఉరి తీసుకుని వ్రేలాడుతూ ఉండడం చూసి వాళ్ల గుండెలవిసి పోయాయి.

దాదాపు నలభై ఏండ్ల కింద జరిగిన ఆ ఉదంతం ముసలివానికి స్పష్టంగా జ్ఞాపకం రాసాగింది. 'ఆ దారుణ సంఘటన నా కిప్పుడెందుకు జ్ఞాపకం రావాలి ?' అనుకున్నాడు



ముసలివాడు. తానొక విషవలయంలో చిక్కుకున్నట్లు అతనికి అనిపించింది.' 'నా బలం క్షీణించిపోవడంతో నాకు గొల్లవాడు జ్ఞాపకం వస్తున్నాడో లేక గొల్లవాని జ్ఞాపకాలతో నా బలం క్షీణించిపోతున్నదో తెలియకుండా ఉంది.' అనుకున్నాడతడు.

గొల్లవాడు ముష్టిచెట్టు నుండి వ్రేలాడుతున్న దృశ్యాన్ని తన మనోఫలకం మీద నుండి తుడిచి వేయడానికన్నట్లు అతడు కళ్లు మూసుకున్నాడు. మూసుకున్న అతని కళ్లకు పిల్లవాని ఆకృతి కనబడింది. నీటిమట్టం మీద కొచ్చి తుళ్ళిపడి అలక చేసిన చేప వలె వాడు కేరింతలు కొడుతున్నాడు. చెరువులో ఈదులాడి గట్టుకొచ్చి నీరోడుతున్న శరీరం ఎండలో మెరుస్తుండగా చెంగు చెంగున గంతులేస్తున్నాడు.

కొంతసేపటికి ముసలివాడు కళ్లు తెరిచాడు. దాపున ఎక్కడా పిల్లవాని పొలకువ లేదు. అడవి నిశ్చలనంగా, గుంభనంగా నిలుచుని ఉంది.

'నాకు చిత్రమైన అనుభూతులు కలుగుతున్నాయి. శరీరమేగాదు, మనసుగూడా పట్టుతప్పుతూంది.' అనుకున్నాడతడు.

ఎక్కడో కొండల వెనక సూర్యోదయమయింది. సూర్యుని ఎర్రని కిరణాలు ఆకాశంలోని మేఘాలను తాకుతున్నాయి. 'ఎండ సూర్యునినుండి పుడుతుంది. వెన్నెల చంద్రునినుండి పుడుతుంది. మరి చీకటి ఎక్కడ నుండి పుడుతుందో' అనుకున్నాడు ముసలివాడు. 'బహుశ చీకటికి చావు పుట్టుకలులేవేమో. అది నిరంతరాయంగా ఉంటుందిగాబోలు. దైవ సంబంధమైన వెలుగు తాత్కాలికమై ఉండగా పైశాచికమైన చీకటి అజరామరమై ఉండడం ఎంతదారుణం !' అనుకున్నాడతడు.

మెలమెల్లగా అతని కండ్లు మూతలు పడ్డాయి. క్రమంగా అతడు కలో, నిద్రో తెలియనిస్థితిలోకి జారుకున్నాడు.

మేఘాలను తాకుతుండిన సూర్యకిరణాలు కిందకు దిగి పర్వతశిఖరాలను, చెట్ల చితారు కొమ్మలనుతాకుతూ అతివేగంగా కిందకు జారసాగాయి. రాత్రిపొడవునా ఎగురుతూ అలసిపోయిన మిణుగురులు, అప్పుడే నిద్రలేచిన మిడతలు గడ్డిరాశలను, చెట్లకొమ్మలను కరచుకుని నిశ్చలనంగా ఉన్నాయి.

ఉదయపుటెండ అంతకంతకు కిందకుదిగి పొదలను, పచ్చిక మైదానాలను లోయలను స్పృశించింది. మడుగులోని నీటిమీద ఎండ మిలమిలలాడసాగింది. నీటిఅంచున పడుకునిఉన్న ముసలివానికి ఎండతాకిడితో మెలకువ వచ్చింది.

కండ్లు మూసుకునిఉన్న అతనికి తన దాపున ఏదో అలికిడి అవుతున్నట్లు అనిపించి, కండ్లు తెరచి లేచి కూర్చున్నాడు.

మూర్తీభవించిన మృత్యువు వలె నాలుగు రాబందులు గంప అంచుమీద కూర్చుని ఉన్నాయి. వాడియైన వాటి ముక్కులు రక్తసిక్తమై ఉన్నాయి.

ముసలివాని శరీరం ఆపాద మస్తకం భగ్గుమంది. అతడు చేయిచాచి ఈటెను తీసుకుని రాబందుల మీదకు విసిరాడు. ఈటె గురితప్పి భూమిలోకి జానెడులోతు దిగబడింది. రాబందులు ఒక్కటొక్కటే భారంగా లేచి రెక్కలు కొట్టుకుంటూ గాలిలోకి లేచాయి. అవి లేచినపుడు గంప తల్లక్రిందులై బోర్లపడింది. ముసలివాడు గబగబ వచ్చి గంపను పైకెత్తి కానుగ ఆకులను పక్కకు నెట్టాడు. కానుగ ఆకుల కింద నలుగులకు బదులు ఎనిమిది మాంసపు ముద్దలున్నాయి.

అతడు నడుమెత్తి నిలుచున్నాడు. అతని కనుగుడ్లమీద నీళ్ళు నిలిచాయి. కనురెప్పలను అప్పళించగా కన్నీళ్ళు కిందకు జారి చెంపలమీదున్న మడతలలో ఇంకిపోయాయి. కన్నీటి పొరగుండా అడవంతా గజిబిజిగా కనిపించింది. చేతి వెనక భాగంతో అతడు కళ్లు తుడుచుకున్నాడు. దాపున ఉన్న చెట్టుకొమ్మలమీద రాబందులు నాలుగు కూర్చుని ఉన్నాయి. అవి రక్తసిక్తమైయున్న ముక్కులను కొమ్మలకేసి రాచుకుంటున్నాయి. ఈటె తీసుకుని వాటి గుండెలను ఛిన్నాభిన్నం చేయాలని ఉందతనికి.

'కాని నేనిపుడు ఈటెను ప్రయోగించగల స్థితిలోలేను. ఈటెను ఉత కర్రగా ఉపయోగించవలసిన స్థితిలో ఉన్నాను.' అనుకున్నాడతడు.

దీనత్వం ముంచుకురాగా అతడు పిర్రల మీదను, గుదికాళ్ళమీదను కూర్చున్నాడు.

ముంజేతులను మోకాళ్ళమీద పెట్టుకుని, ముంజేతులమీద నుదుటిని ఉంచుకున్నాడు.

'యుద్ధం ముగిసింది. నేను పూర్తిగా ఓడిపోయాను' అనుకున్నాడతను.

21

ఆకాశాన పొద్దు రెండు బారలెక్కింది.

ముసలివాడు ఎడమచేతిలో కత్తినిపట్టుకుని కుడిచేతిలో ఈటెను ఊత కర్రవలె పొడుచు కుంటూ భారంగా అడుగులేస్తూవచ్చి గుడిసెను సమీపించాడు. అతని రాకను గమనించి దొడ్డిలో ఉన్న పందులు కీచుకీచుమన్నాయి.

పిల్లవాడు గుడిసెకు, పందుల దొడ్డికి మధ్యన నేలమీదపడి నిద్రపోతున్నాడు. చుట్టగా చుట్టివున్న ఈతచాప వానిపక్కన పడి ఉన్నది. ముసలివానికోసం రాత్రంతా ఎదురు చూస్తూ వాడు అలాగే వాలిపోయినట్టున్నాడు.

ముసలివాడు గుడిసె వాకిటవద్దనే కత్తిని, ఈటెను జారవిడిచి లోపలకు ప్రవేశించాడు. వెన్నుపాము, మోకాళ్ళు పళపళమని విరుగుతున్నట్లుండగా అతడు నేలమీద సాపుగపడిపోయాడు. ఆకాశాన ఎగురుతున్న గద్ద తాలూకు నీడను చూసిన కోడిపిల్ల తన తల్లి రెక్కల కిందను పరుగెత్తినంత సహజంగా, పొంధుని పాదాల తాకిడికి లేచిన ఇసుక రేణువులు తగిలి నత్త తన దేహాన్ని గుల్లలోనికి లాగుకున్నంత సహజంగా అతని దేహం బోర్ల తిరిగి నేలను కరచుకున్నది.

అతడు మూర్తీభవించిన జడత్వం వలె ఉన్నాడు. 'నేనింతటి యుద్ధం జరిపింది ఈ జడత్వాన్ని పొందడానికేనా ?' అన్న ప్రశ్న అతని లోని ప్రత్యణువును తడివింది. 'చలనము, పరిణామము జీవగ్రరలుగా మనిన సృష్టి చివరకు శూన్యంలో లీనమైనట్లు, అత్యంత ప్రచండమైన అనుభవ పరంపరలతో నడచిన జీవితం గూడా చివరకు జడత్వానికి లోనుగాక తప్పదేమో.' అనుకున్నాడతడు.

తన దేహంలోని వివిధాంగాలు ఒకదాని నుండి ఒకటి విడిపోయి ఎక్కడెక్కడో నిర్జీవంగా పడిఉన్నట్లు అతనికి అనిపిస్తూంది. కాని అతని మనసు మాత్రం చితి వలె రగులుతూనే ఉంది. 'ఎంత విచిత్రం ! రూపురేఖలు కలిగిన దేహం చలనరహితంగా పడి ఉండగా రూపు రేఖలు లేని మనసు పచ్చిక మైదానంలో సీతాకోకచిలుక వలె ఎగురుతూ ఉన్నది !' అనుకున్నాడతడు.

'కాని నేనీ ఆలోచనలకు స్వస్తి చెప్పాలి. అలసిపోయిన నా మనసుకు ఒకింత విశ్రాంతి యివ్వాలి. ఆ తరవాత నేను చేయాల్సిన పనులు చాల ఉన్నాయి. ఎందుకంటే- ఇది నా జీవితంలో చివరి రోజు కాదు గనుక. ఈ రోజు నేను విపరీతమైన దురదృష్టాలకు లోనయ్యాను. లెక్కలేనన్ని ఎదురుదెబ్బలు తిన్నాను. ఐనా 'ఇది నా చివరి రోజు కాదు.' అనుకున్నాడతడు.

క్రమంగా అతని మనసు గూడా జడత్వాన్ని పొందుతూ నిద్రలోకి జారుకున్నది.

22

గుడిసె పక్కన ఉన్న కకోకి రాళ్లబాట వెంబడి రెండెడ్లబండి సాగుతున్నది. చక్రాల గరగర శబ్దానికి పిల్లవాడు మేలుకుని లేచి కూర్చున్నాడు. ఎవరో తట్టి లేపినట్టుగా వాడు వొళ్ళు విరుచుకోకుండా, కళ్ళు నులుముకోకుండా బిత్తర పోతున్నట్లు నలుదిక్కుల చూశాడు.

గుడిసె వాకిలి వద్ద కత్తి, ఈటె కనిపించాయి. వాడు గబ గబ లేచి వాకిలి వద్దకు పరుగెత్తి వచ్చాడు.

ముసలివాడు నేలను కరచుకొని నిద్రిస్తున్నాడు. నోరు ఇంచుక తెరుచుకుని ఉచ్ఛ్వాస నిశ్వాసలు జరుపుతున్నాడు. పక్కలు మెల్లగ లేస్తూ పడుతూ ఉన్నాయి. కాళ్ళు రెండూ నడుం వద్దనుండి పాదాలవరకు రక్తశిక్తమై ఉన్నాయి. అక్కడక్కడ కండరాలు వ్రేలాడుతున్నాయి.

పిల్లవాడు చప్పుడు చేయకుండా గడపదాటి లోపలకు వచ్చాడు. కళ్ళలో నీళ్ళు చిమ్ముతుండగా వాడు ముసలివాని పాదాల చెంత కూర్చున్నాడు.

[అయిపోయింది]

దినానికి యిరువది నాలుగు
గంటలున్నాయి
ప్రతి దినం తిరగలిలా తిరుగు
తోంది
ప్రతి మధ్యాహ్నం సూర్యుడు
నిప్పులు గక్కుతున్నాడు
ప్రతి రాత్రి తమస్సు శపిస్తోంది
ఏ సమస్య తీరక ఏ ప్రవృత్తులకు
రాజులము గాక
చిక్కుబడ్డ దారం చిక్కులు
విడదీయ లేక
రక్తనాళాలు అనుక్షణం ఆకలి
జపిస్తుంటే
తిరగలి బొద్దు చుట్టూ ప్రదక్షిణ
చేస్తున్నవి గింజలు.

— పి. వి. కృష్ణారావు

సోషల్ వెల్ ఫేర్ ఆఫీసర్‌గా, ట్రైబల్ వెల్ ఫేర్ ఆఫీసర్‌గా, వృత్తి నిర్వహిస్తూ, మానవత్వం ఆశయంగా, సర్వజనాభ్యుదయం లక్ష్యంగా, వచన కవిత్వం మార్గంగా, స్నేహం ప్రేమ జీవ లక్షణాలుగా వైతరణి, మాదీ మీ ఊరే మహారాజ అనే రెండు కావ్యసంకలనాలను వెలువరించారు. ఆయన నిర్వహించిన వృత్తి అనేక రకాలైన బడుగు జీవితాల అధ్యయనానికి సహకరించింది. ఏ రచయితకైనా తన రచనకు ముడి పదార్థం తను చూసిన, పరిశీలించిన సంఘ జీవితమే. ఒక్కొక్క రచయిత ఒక్కొక్క విధంగా జీవిత వాస్తవాలకు రియాక్టు అవుతాడు. కృష్ణారావు గారు అభ్యుదయ కవితోద్యమం వల్ల ప్రభావితులైన కవి.

హరిజనుల, గిరిజనుల బాధామయ సంక్షుభిత జీవితం ఆయనపై గాఢమైన ముద్రను వేసింది. వైతరణి కావ్యం అంతా ఆ జీవితానికి, దాని తాలూకూ వేదనకు సంబంధించినదీ. అందులోని జీవులందరూ కుటీరంలో, తుపానులో నివసిస్తూ, ఆరుతూ — వెలుగుతున్న ఆశతో, వికసిస్తూ — హ్రస్వమవుతున్న విశ్వాసంతో, ఘనీభవిస్తూ — ఆవిరౌతున్న ఓర్పుతో, దుఃఖంలో — నిర్వీర్యతలో బ్రతుకుతున్నవాళ్ళు. ఈ బంధన సత్యమని, ఈ బ్రతుకు అనిత్యమని, బాధల మహాభారతంలో, మురికిపేటలో, మసలే మూగజీవాలు. వైతరణి వారికి ప్రక్కగా మురికిపేటలో ప్రవహించే కాలువ. వైతరణి సంప్రదాయకమైన ప్రతీక. ఒక విధంగా సమాజంచేత అస్పృశ్యులుగా పరిగణింపబడి, బహిష్కృతులైన వారి జీవన వ్యవస్థే వైతరణి. దానిని దాటే మార్గం వాళ్ళకు తెలియదు; తెలిసినా దాటనీయని సభ్య సమాజపు అడ్డుగోడలు. మండు వేసవిలో మల్లె పూల అంగడి పెట్టినవాళ్ళు, పాలబుగ్గల పసి పిల్లడికి పనసతొనలు అందించేవాళ్ళు, ప్రతి గడపకు పచ్చని ఆకుకూరలందించేవాళ్ళు, ఓర్పు చీపుర్లతో మానవులు మాలిన్యం చేసేచోట్లను తుడిచేవాళ్ళు, ముళ్ళను గులకరాళ్ళను నెత్తురు కళ్ళు చూచే పాదాలకు చెప్పులుకుట్టేవాళ్ళు — వీళ్ళంతా ఆయన కవితా నాయకులు. వీళ్ళ జీవితమే ఆయన కవితా వస్తువు. వీళ్ళ వేదనే ఆయనకు వసుంధర వేదనగా, వీళ్ళ నికృష్ట జీవితమే మానవ నాగరికతా దేహంమీద మానని రాచపుండుగా, వీళ్ళ కన్నీళ్ళే పోటెక్కిన సప్త సముద్రాల సంగమంగా, వీళ్ళ రోదనే యావత్ మానవజాతి ఘోషగా, వీళ్ళు ఈ సంఘపు గుండెలో పుండ్లుగా, కవి గుండెలో ముండ్లుగా, దీన్ని ఏలుతున్న రాజులకు వ్రణాలుగా, మన శాస్త్ర చర్యలు పుట్టించిన చికిత్సలకు అతీతులుగా కనిపించి కవిత్వంలో ప్రాణరూపాలుగా పరివర్తనచెందారు.

ఈ కష్టజీవులు పడ్డ కష్టాన్ని, వీళ్ళు సృష్టించిన భాగ్యాన్ని, చివరకు వీళ్ళను సైతం

కొత్త గొంతులు

— టి.యల్. కాంతారావు

దోచిన పెద్దమనుషులు ఈ వైతరణికి అవతలగా వీరి భాగ్యాలకు వారసులై మిద్దెలు కడితే — బ్రతుకు భారంగా, సుదూర భవిష్యత్తులో ఆశారేఖ కనిపించక వర్తమానాంధకారంలో వేదనే జీవనాడిగా కొట్టుకుంటూ 'నేనెందుకుపుట్టాను, ఈ బ్రతుకు బాధనుండి విముక్తి ఎప్పుడు ?' అనే నిష్క్రియా పరత్వంలో ప్రశ్నించుకుంటున్న ఈ 'బాధా సర్పదష్ట'లకు సంఘటితంగా, దారిద్ర్యానికి వ్యతిరేకంగా ధర్మ యుద్ధమే శరణ్యమని హితబోధ చేస్తున్నారు కవిగారు. "ఈ చిత్రమైన ప్రపంచంలో అనామకుడు చక్రవర్తి కావాలనుకుంటున్నాడు. ఎవడూ చూడకుండా దర్బారు చౌకీదారు రాజుగారి సింహాసనంమీద కూర్చుని మీసాలు మెలేస్తాడు. ఈ మూఢుణ్ణి చీకటితప్ప ఎవరు చక్రవర్తిగా గుర్తించారు ? అందుకని సింహాసనాన్నే విరగదన్నండి. తర తమ భేదం తెలియకుండాపోతుంది." అంటారు కృష్ణారావు గారు 'మాదీ మీఊరే మహారాజకుమారా' కావ్యంలో. ఈ వ్యవస్థలో ఉన్న మంచిచెడుల్ని, భాగ్య దౌర్భాగ్యాలను మానుషత్వ, అమానుషత్వాలను కావ్యస్తంచేసేటప్పుడు వారి కావ్యరచనా సంవిధానం పెర్సైర్‌ని, ధ్వనిని ఆశ్రయించింది. నిండుగా నిర్మలంగా ప్రవహించే నదికి ఒక్కసారిగా వరదవస్తే ప్రవాహ గమనంలో ఏ మార్పు వస్తుందో అట్లాంటి కవిత్వపు నడక వీరి కవిత్వానికి ప్రత్యేకత. శ్రామిక జన జీవన వైఫల్యాన్ని అతి దయనీయంగా చిత్రించారీయన. ఈ సమాజమే తిరుగుతున్న తిరగలైతే దాన్లో నలిగిపోతున్న బియ్యపుగింజలు ఈ శ్రామికవర్గం. సమాజంలోని మనుషులందరూ కష్టసుఖాల్లో భాగస్వాములైతే అది నిజమైన మానవ సమాజం. అలాకాక కష్టం ఒక వర్గానిది, సుఖం మరొక వర్గానిది అయితే అది సమాజం కాదు; పెనుభూతమవుతుంది.

వచనానికీ— అర్థానికీ, శబ్దానికీ — శ్రోతకీ, బంధుత్వానికీ — బంధువుకీ, శృతికీ — గానానికి సంబంధం లేని సమాజంలో మేధావులు మెదడులు కిరాయికిచ్చి దిన బత్యంతో రోజులు గడుపుతారని చెబుతారు కృష్ణారావుగారు. ఇట్లాంటి సమాజంలో సంపదను ఉత్పత్తి చేసే శ్రమజీవులు సగం అరిగిన చీపురు పుల్లలు, ఉంగటం తెగిన చెప్పులు, మడమల క్రింద నలిగే పూలుగానే మిగిలిపోతారు. మునుపిచ్చిన జాగాలోనే మురిగిన ఈగల్లాగ పెరిగిన/జనాభాలో దారిద్ర్యపు కొసల మీద, మృత్యుచ్ఛాయలతో జీవితాన్ని సాగించటంకంటె — విరిగిపోతున్న రెక్కల్లోంచి, ఎండిపోతున్న నాల్కల్లోంచి, అంటుకుపోతున్న డొక్కల్లోంచి, మూతలు పడుతున్న రెప్పల్లోంచి శక్తినంతా కూడదీసుకుని తిరగబడి చచ్చిపోవడం మంచిది గదా! ఏ మూల చూచినా ఒడిచాచిన శిశువులు; ఎంగిలి మెతుకుల గతుకులు; సంకటాలలో ఆస్తిత్వం; నివృత్తి కోసం వేయి అవస్థలు. అదే సమయంలో ఈ జీవన దీపం తొందరగా కొడిగట్టితేపోను అనే నిరాశావాదం గాని, ఏది మార్గం ? ఏది విలువ ? అనే సంశయాత్మక చిత్త ప్రవృత్తి కాని సమాజ పరిణామానికి సరైన పరిష్కారం కాదు. ఉండటానికి, లేకపోవటానికి మధ్య, లేక ధనమదానికి, దారిద్ర్య హీనత్వానికి మధ్యనున్న ఈ వైతరణిని సంపూర్ణంగా పూడ్చిపెడితే తప్ప మానవాభ్యుదయానికి దారి చూపే మహోన్నతమైన బాట నిర్మాణంకాదు. అట్టి రాచబాట నిర్మాణానికి పునాదిరాళ్ళైన శ్రామికవర్గ పక్షాన నిలబడి "అనామకుణ్ణి, దిగంబరినీ,క్షుధార్తుణ్ణీ అయిననేను నా అనుంగు సోదరులకు రత్నకిరీటాలు చేయాలనీ విరిగిపోయినవాళ్ళ వ్రేళ్ళకు అంగుళీయకాలు చేయాలనీ వారిగాథల ప్రథమాంకం నా రచన అనీ తపనలో, మననలో ఏనాడూ మీ నమ్మకాలు మారుస్తానో, ఏనాడు మీ నవ్వులాటలు కట్టేస్తానో" అన్న కవినమ్మకాలు మారకుండా నవ్వులాటలు ఆగకుండా తన కవిత్వాన్ని కట్టెయ్యటం ఏం మర్యాద ? ★

దారితప్పిన కథ

కె. సునందా భార్గవి



"అమ్మాయి బంగారుబొమ్మ" అన్నాడాయన.

"నిజంగానా !" అన్నాడు సుందరరావు కుతూహలంగా ముందుకు వొంగుతూ.

"అవును. అంతేకాదు. ఒక్కతే కూతురు. దాదాపు మూడు లక్షల ఆస్తికి ఏకైక వారసురాలు. బియస్సీ పాసయ్యింది" అన్నాడాయన మళ్ళీ.

ఆయనపేరు జనార్దనం. సుందరరావుకు దూరపు బంధువు. ఓ సంబంధం గురించి సుందర్రావుకు చెప్పాలని ఒంగోలునించి వచ్చాడు.

అంతా విన్న సుందరరావు "ఇప్పుడేమిటి చెయ్యటం" అన్నాడు తల్లితో.

"నిజమే. మనం తొందరపడ్డాము సుందరం. ఇప్పుడేమిటి చెయ్యటం" అన్నదామె మళ్ళీ.

"ఏమయ్యింది ?" అన్నాడు జనార్దనం.

"నేను చెబుతాను మామయ్యా ! పది రోజుల క్రితమే ఒంగోలు వచ్చి ఓ సంబంధం చూశాము. ఆ అమ్మాయి బాగానే వున్నది. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తోంది. పదిహేనువేలు కట్నం అడిగాము. పన్నెండువేలు ఇస్తామన్నారు. ఇతర ఆస్తులు ఏవీలేవు. ఈ అమ్మాయితోపాటు ఇంకో ఇద్దరు అమ్మాయిలు పెళ్ళికి వున్నారు. ఇంతకీ విషయం ఏమిటంటే ఈ సంబంధాన్ని ఖాయపరచుకున్నాము. ఇదీ సంగతి" అన్నాడు సుందరరావు.

"అవును జనార్దనం. తొందరపడి ఒప్పుకున్నాము. ఇంతకీ నువ్వు చెప్పినవాళ్ళు కట్నం ఎంతవరకు ఇవ్వగలరు" అనడిగింది సుందర్రావు తల్లి.

"ఇరవైవేలకు తక్కువ ఇవ్వరు. కట్నం ఎంత ఇచ్చినా లక్షల ఆస్తికి ఏకైక వారసురాలు. అమ్మాయి అనసూయే కదా !" అన్నాడు జనార్దనం.

"కానీ ఈ అమ్మాయి ఉద్యోగం చేస్తున్నది కదా !" అన్నాడు సుందరరావు.

"ఆ అమ్మాయి కూడా బ్యాంకు ఉద్యోగానికి సెలక్ట్ అయిందిట. ఇంకో నెలరోజుల్లో ఉద్యోగం వస్తోందని అనుకుంటున్నారు" అన్నాడు ఆయన.

"బ్యాంకు ఉద్యోగమా !" అన్నాడతను వెంటనే.

తల వూగించాడు ఆయన.

సుందరరావు కూడా బ్యాంకు ఉద్యోగమే చేస్తున్నాడు. ఆ అమ్మాయిక్కూడా బ్యాంకు ఉద్యోగమే వస్తుందని తెలిసిన తర్వాత అతని మనసంతా అదోలా అయిపోయింది.


"నేనోమాట చెప్పనా ?" అనడిగాడు జనార్దనం.

"ఏమిటి మామయ్యా"

"ఏమీ లేదు. మీరు ఖాయపర్చుకున్న సంబంధానికి నీళ్ళొదిలి నేను చెప్పిన అమ్మాయిని చూడండి."

"ఇదెలాసాధ్యం. అమ్మాయి నచ్చిందనీ, పన్నెండువేలు కట్నానికి ఒప్పుకున్నాం కదా !" అన్నదామె.

"అవును మామయ్యా. ఇప్పుడు యే కారణంగా ఈ సంబంధాన్ని వదులుకుంటున్నట్టు వాళ్ళకు తెలియపరచాలంటావ్ ?" సుందరరావు అడిగాడు. ఆ మాటకు జనార్దనం నవ్వి "చాలా సులభమైన కారణం ఒకటి ఉన్నది. ఆ అమ్మాయి ఉద్యోగం చేస్తున్నది కదా ! ఆ అమ్మాయి గురించి ఎంక్వయిరీ



చేశామనీ, ఆఫీసులో చాలామంది ఆ అమ్మాయి మంచిది కాదని చెప్పారనీ అందువల్ల ఈ సంబంధాన్ని వదులుకుంటున్నామనీ రాయండి. సరిపోతుంది'' అన్నాడు.

సుందరరావు మొఖం సంతోషంతో వెడల్పయింది.

''గుడ్‌ఐడియా'' అన్నాడు చిరునవ్వుతో.

''అయితే ఇంకా ఆలస్యం ఎందుకు ? ఓ

దారి తప్పిన కథ

ఇన్లాండ్ కవరు వుంటే తీసుకరా. ఇప్పుడే ఉత్తరం రాసెయ్యి'' అన్నాడు జనార్దనం.

''వాళ్ళు బాధ పడతారేమో'' అన్నది తల్లి.

''ఎవరో బాధపడతారని లక్షలు తెచ్చే సంబంధాన్ని వదులుకుంటామా'' అన్నాడు జనార్దనం.

టేబిల్ సొరుగులోనించి సుందరరావు ఇన్లాండ్ కవరు — కలమూ తీసి ఉత్తరం రాయటం మొదలు పెట్టాడు. ఆతను చివరగా ఇలా రాశాడు :

''ఇంకానయం. మీ అమ్మాయి గురించి ముందుగానే తెలిసింది. కాబట్టి సరిపోయింది. లేకపోతే నా జీవితం కాలిపోయి వుండేది.''

ఉత్తరాన్ని చదివి వినిపించాడు సుందరరావు.

''భేష్ చాలా బావుంది. ఐతే నేను ఈ రోజునే ఒంగోలు వెళ్ళి మీరు రెండ్రోజుల్లో అమ్మాయిని చూడటానికి వస్తున్నట్టు చెబుతాను'' అన్నాడు జనార్దనం.

అందుకు తల్లీ — కొడుకు సరేనన్నారు.

* * *

జనార్దనం చెప్పినట్టుగా అనసూయ బంగారు బొమ్మలాగే వున్నది. సుందరరావుకు ఆమెను చూడటంతోనే కళ్ళు జిగేలుమన్నాయి.

కట్నం విషయం కూడా అప్పుడే మాట్లాడాడు జనార్దనం. ఇరవై రెండు వేలు. మరో మంచి రోజున తాంబూలాలు తీసుకుందామని తిరిగి వచ్చారు. సుంద్రరావు — అతని తల్లి.

''నిజంగా మనం అదృష్టవంతులం సుందరం'' అన్నది తల్లి.

''అవును. ఆ సావిత్రిని ఈ అనసూయతో పోల్చి చూస్తే చాలా దారుణంగా అనిపిస్తోంది. జనార్దనం మామయ్య ఈ సంబంధాన్ని తీసుకు రాకపోతే మనం చాలా నష్టపోయేవాళ్ళం'' అన్నాడతను.

అవునన్నది తల్లి.

మూడు రోజుల తర్వాత నిశ్చయ తాంబూలాలు తీసుకుందామని ఉత్తరం రాశాడు సుందరరావు.

అతను ఆ ఉత్తరాన్ని పోస్టు చెయ్యటానికి బయటకు వెళ్ళబోతున్నప్పుడు పోస్టుమేన్ వచ్చి అతనికో కవరు అందించాడు.

ఆ కవరు విప్పాడు సుందరరావ్.

అందులో ఇలా వున్నది :

''సుందరరావుగారూ— మీ గురించి మీ బ్యాంకులో ఎంక్వయిరీ చేశాము. మీ కారెక్టర్ మంచిది కాదనీ, మీరు ఓ ఇద్దరు అమ్మాయిలను నమ్మించి మోసం చేశారనీ తెలిసింది ఇంకా నయం. మీ గురించి ముందుగానే తెలిసింది కాబట్టి సరిపోయింది. లేకపోతే నా జీవితం కాలిపోయి వుండేది.''

పెళ్ళికూతురు అనసూయ రాసింది ఆ ఉత్తరాన్ని.

సుంద్రరావుకు షాక్ కొట్టినట్టు అనిపించింది. ఆ ఉత్తరం పూర్తిగా తను పెళ్ళికూతురు సావిత్రికి రాసిన ఉత్తరం లాగే ఉన్నది. అవే వాక్యాలు. తను విసిరిన రాయి తనకే తగిలింది. సావిత్రి తన ఎదురుగా నిల్చుని నవ్వుతున్నట్టు అనిపించింది.

ఇంతకీ అనసూయ—సావిత్రి స్నేహితులని సుందరరావుకు తెలీదు పాపం!! ★

షాలాక్షుని షైరీ

పళ్ళ గట్టితనానికి టీ!

పశ్చిమజర్మనీ విజ్ఞానవేత్తలు టీ త్రాగే వారి పళ్ళు పటిష్టంగా వుంటాయనే ఏకాభిప్రాయానికి వచ్చారట. రోజుకు రెండు మూడు సార్లు టీ త్రాగేవారు పళ్ల డాక్టరు వద్దకు పోవల్సిన పని లేదని వారన్నారట. జావా, కెన్యా వంటి దేశాలు పండించే తేయాకులో ఫ్లోరైడ్ వున్నదనీ, తత్ఫలితంగా పళ్ళు అత్యంత శుభ్రంగా వుంటాయనీ అభిప్రాయపడ్డారట. అన్ని తేయాకులలోనూ యీ ఫ్లోరైడు వుంటుందిట గానీ, కొన్నిచోట్ల పండే తేయాకులో యిదధిక శాతమట!

ఎగదీస్తే బ్రహ్మహత్య! దిగదీస్తే గోహత్య!

బవేరియా (మనదేశం కాదు) లో ట్రాఫిక్ మంత్రి వాహనాలు నడిపే వారు తెగ తాగడంవల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువయి పోతున్నాయని, కనుక లోవర్ బవేరియాలోనూ, అప్పర్ పేలటినేట్‌లోనూ త్రాగి వాహనాలు నడిపేవారిని నిర్దాక్షిణ్యంగా అరెస్టు చేయించ నారంభించారట. దాంతో అత్యద్భుతంగా రోడ్డు ప్రమాదాలు తగ్గిపోయాయట. ఇది తల్చుకు నానందపడేలోగా మరో సమస్య ఎదురయిందట. హైవేస్‌లో మరితర మార్గాలలోనూ లిక్కరు, ఆల్కహోలు షాపులు పెట్టుకున్న చిన్నా పెద్దా వ్యాపారులంతా చేరి మా బిజినెస్ పాడయి పోయింది మొర్రో అని, రాజకీయ వత్తిడి తెచ్చే సరికా మంత్రి కరల్-హిల్లర్‌మీర్ సరి నా కేలీ గొడవ, త్రాగి నడపండి. చంపండి. చావండి అని తన శాసనాన్ని తానే సడలించేశారట.—

ప్రార్థనా మందిరమా! విలాస గృహమా!

యు. యస్. ఎ. ఆరిగాన్‌లో వో చర్చికి ఆదివారం వుదయపు ప్రార్థనలకు ఎవరూ బొత్తిగా రాకపోడంతో చర్చి హాలంతా వెల వెల బోతూండడంతో రివరిన్డ్ డేవిడ్ హారవ్స్ వ్యక్తిగతంగా కొన్ని పనులు, ప్రకటనలు చేశారట. చర్చిలో కుర్చీబల్లలు రాళ్ళలావున్నాయని చర్చికిరానివారికోసం బల్లలమీద కుషన్లు పరిపించారటాయన, అక్కడే చిన్న కునుకు తీసే వారికి కొన్ని వాలుకుర్చీలు కల్పించారట. చర్చిలో బొయ్యోమని అరుస్తూంటే ఆ ప్రార్థన్లు విన డానికెవడొస్తాడు అని అనుకునేవారికి శబ్దం వినబడకుండావుండే చెవి సాధనాలను సరఫరా చేస్తానన్నారట. చెవిటివారికి వినిపించే సాధనాలు సిద్ధంచేశామన్నారట. గోల్ఫ్ కోర్టు ఒకటి, ఈతకొట్టే పూల్ ఒకటీకూడా సిద్ధం చేయించాను కనుకనో భక్తులారా పాపులను రక్షించే ప్రభువైన ఏసునాథుని భక్తితో పూజించుటకు ఆదివారమైననూ చర్చికి రండు'' అన్నారట — అయ్యయ్యో! పాపం!

పతిని కొట్టి చంపించిన పతివ్రత!

బ్రిటను లివర్‌పూల్‌లో ఒహనాటి అందాల రాణి మార్గరేల్ మెక్కులోఫ్ తన భర్త నస పడ లేక కొంతమంది రౌడీలను పిలచి తన భర్తకు దేహశుద్ధి చేయమని వారికి ఎనిమిది వేల పౌనులు పారితోషికమిచ్చేసరికా రౌడీలు పెట్రేగిన వుత్సాహంతో ఆమె భర్తను పట్టుకుని నాలుగుతుకులకు మరో నాలుగుతుకులు చేర్చి అంటించేసరికాయన పుట్టున చనిపోయాడట. తాను తన భర్తను చంపమని చెప్పలేదనీ, దేహశుద్ధి చేయమని మాత్రమే చెప్పానని ఆ సుందరి కోర్టుకు నివేదించిందట.

పాముల రింగులు!


దక్షిణ అమెరికాలోని ఆధునిక ఫ్యాషన్లు ఇష్టపడే మహిళలు కొంతమంది వో వింత ఫ్యాషను ఆరంభించారట. చెవులకు ఆభరణాలుగా వారు బుజ్జి బుజ్జి పాము పిల్లలను చెవి కన్నాలలో దూర్చి బంధిస్తారట. అఫ్‌కోర్స్ ... విషం పాములు కాని ఆ బుజ్జి పాములు చెవిమీంచి బుగ్గమీదకు పాకుతూ, బుగ్గ నాకుతూ వుంటే అందమే గాక, అదోరకం వింత అనుభూతికూడా కలుగుతూంటుందని వారన్నారట — వోయబ్బో!

పుట్టుమచ్చలు మటుమాయం!

పుట్టుమచ్చలనేవి పుట్టుకతోనే వుంటాయి, అవి చచ్చినా పోవు అని అనుకుంటే సగమే రైటు. మిగతా సగం తప్పు. అమెరికాలో ఎలక్ట్రో సర్జరీ అనే వో నూతన విధానం ద్వారా నొప్పిలేకుండా, ఆపరేషను లేకుండా, రక్తం కారడం లేకుండా యీ పుట్టుమచ్చను మటుమాయం చేస్తున్నారట. స్త్రీల ముఖం మీద పురుపుడుకాయల వంటి పుట్టుమచ్చలుండి, వారి అందాన్ని సగానికిసగం పాడుచేసే ఈ పాడు పుట్టుమచ్చలను అక్కడ చకచకా డాక్టర్లు లాగించి పారేస్తున్నారట.


గొర్రెపిల్లకు కృత్రిమ హృదయం!

యు. యస్. ఏ. కు చెందిన అట్టా విశ్వ విద్యాలయంలోని మెడికల్ సెంటరుకు చెందిన డాక్టర్ రాబర్ట్ జార్విక్ ఓ అయిదేళ్ళ గొర్రె పిల్లకు కృత్రిమ హృదయం అమర్చిపెట్టే ఆపరేషను ఎంచక్కా చేశారట. ఈయన ఇంతకు ముందు వో ఆవు దూడకు కృత్రిమ హృదయం అమరిస్తే 268 రోజులు ఎంచక్కా జీవించి, ఆనక హరీమన్నదట. ఇపుడీ గొర్రెపిల్ల వెంగు వెంగున కృత్రిమ హృదయంతో గంతులు వేస్తూందట. ★



సీరియల్

జీవన్మృతులు



ఇంగ్లీషు మూలం: బ్రామ్ స్టోకర్

స్వేచ్ఛానువాదం: కొలను వేంకట దుర్గాప్రసాద్

(గత సంచిక తరువాయి)

ప్రొఫెసర్ వాన్ హెల్సింగ్ చెప్పగా డాక్టర్ సెవార్డు రాసిన ఉత్తరం :

డియర్ జోనాథన్,

మీరు మేడమ్ మినాతో వుండిపోవాలి. మేము డ్రాకులాను వెతకడానికి బయలుదేరుతాము. మీరు మాత్రం ఎక్కడికీ కదలకుండా ఆమెను జాగ్రత్తగా కనిపెట్టి వుండాలి.

మన శత్రువు డ్రాకులా వెళ్ళిపోయాడు. మళ్ళీ ట్రాన్సిల్వేనియాలో వున్న తన కోటకు చేరుకుని వుంటాడు. నాకు బాగా నమ్మకం. ముందే అట్లా అతను ఏర్పాట్లు చేసుకుని వెళ్ళి వుంటాడు. మిగిలిన ఒక్క పెట్టె ఓడ ఎక్కించి వుంటాడు.

డ్రాకులా చాలా తెలివైనవాడు. అతను ఆటలు ఇక సాగవని తెలిసిపోయింది. అందుకనే, అతను తిరిగివెళ్ళిపోవటానికి నిశ్చయించుకున్నాడు. అతనికి కావలసిన ఓడ దొరికి వుంటుంది. అందులో వెళ్ళిపోయి వుంటాడు. ఆ ఓడ ఎక్కడుందో మేం కనిపెట్టి, తిరిగి వచ్చి మీకు చెపుతాం. అప్పుడు మీకు, మేడమ్ మినాకు కొంత వూరటగా వుంటుంది.

లండన్ రావటానికి డ్రాకులాకు వందల సంవత్సరాలు పట్టింది, కానీ మనం ఒక్కరోజులో లండన్నుంచి తరిమేయగలిగాం. అతని పని అయినట్టే గానీ, అతను ఎంతటి అపకారానికైనా వెనుదీయడు. అందువల్ల జాగ్రత్తగా వుండాలి. మనమంతా కలిసి వున్నాం గాబట్టి, మనకి బలం ఎక్కువ, ఇప్పుడే అసలు యుద్ధం ప్రారంభమయింది. చివరకు మనమే గెలుస్తాం. దేవుడు మనకి ఎంతో సహాయపడతాడు. అందువల్ల మీరు ఎటువంటి విచారాన్ని పెట్టుకోకుండా వుండండి.

— వాన్ హెల్సింగ్

జోనాథన్ డైరీ

అక్టోబర్, 4 : వాన్ హెల్సింగ్ ఉత్తరం మినాకు చదివి వినిపించాను. ఆమెకు చాలా సంతోషమేసింది. డ్రాకులా వూళ్ళోంచి పారిపొయ్యాడన్న సంగతి ఆమెకెంతో వూరట కలిగించింది. ఆ వూరటే ఆమెకు ఎంతో బలం. డ్రాకులా విషయం కొద్దికొద్దిగా మర్చిపోవటానికి ప్రయత్నిస్తున్నాను. కానీ ఎట్లా మర్చిపోవటం ? నా ప్రియమైన మినా నుదుట ఆ ఎర్రటి గాయం, డ్రాకులాను గుర్తుచేస్తోంది.

మినా నేను డ్రాకులా విషయమై, మళ్ళీ అన్ని కాగితాలు చదివాం. చదివినకొద్దీ, మాలో భయం తగ్గసాగింది.

వాన్ హెల్సింగ్, మిగతావాళ్ళు తిరిగి వచ్చేవరకు భవిష్యత్ కార్యక్రమం తెలియదు.

రోజు తెలియకుండా వేగంగా గడిచిపోతోంది ఇప్పుడు మూడు గంటలయింది.

మినా డైరీ :

అక్టోబర్, 5 (సాయంత్రం 5 గంటలు) మా సమావేశం ఏర్పాటయింది.

సమావేశంలో వున్నవాళ్ళు : ప్రొఫెసర్ వాన్ హెల్సింగ్, మిస్టర్ ఆర్థర్, డాక్టర్ సెవార్డు, మిస్టర్ క్విన్సీమోరిస్, జోనాథన్, నేను.


ఆ రోజున డ్రాకులాను వెదకటానికి ఏంచేసిందీ, డ్రాకులా ఏ బోటుమీద ఎట్లా తప్పించుకుని వెళ్ళిందీ, వివరంగా ప్రొఫెసర్ వాన్ హెల్సింగ్ చెప్పారు.

"నాకు తెలిసినంతవరకు డ్రాకులా ట్రాన్సిల్వేనియా వెళ్ళాలనుకున్నాడు. అతను తప్పకుండా 'దనుబే' మీదుగా వెళ్ళివుంటాడు లేకపోతే నల్లసముద్రంమీద ఎట్లా వచ్చాడో అట్లా వెళ్ళివుంటాడు. అతన్ని వెదకటానికి అదొక్కటే మార్గం అనిపించింది. గత రాత్రి నల్లసముద్రం మీదుగా ఏ యే ఓడలు బయలుదేరి వెళ్ళాయో విచారించాం. మేడమ్ మినా హిప్నటైజ్లో వుండి చెప్పినదాన్నిబట్టి చూస్తే, ప్రయాణం చేస్తున్న ఓడలో డ్రాకులా వుండి వుంటాడు. ఆర్థర్ సహాయంతో డ్రాకులా ప్రయాణం చేసిన ఓడ కనుక్కున్నాం. దాని పేరు 'జరీనా కేథరిన్' అది 'డూలిటిల్ వార్ఫు' నుండి 'వర్నా' వెళుతోంది అక్కడ్నుంచి మరికొన్ని ప్రాంతాలమీదుగా 'దనుబే' వెళుతుంది ఇందులోనే డ్రాకులా వుంటాడని నిర్ణయించాం. అక్కడ్నించి 'డూలిటిల్ వార్ఫు' ఆఫీసుకు

జరిగిన కథ—33 : డాక్టర్ సెవార్డ్, డాక్టర్ వాన్ హెల్సింగ్, ఆర్థర్, క్విన్సీమోరిస్ మినా గదిలో జోనాథన్ క్రిందపడి ఉండటం చూస్తారు. మినా చేత తన రక్తాన్ని త్రాగిస్తున్న డ్రాకులాను చూసి వీరందరు భయభ్రాంతులవుతారు. వాన్ హెల్సింగ్ మినాను అసలు ఏం జరిగిందో అడుగుతాడు. ఆమె తనకు జరిగిన భయంకరమైన అనుభవాన్ని చెపుతుంది. రెన్ఫీల్డ్ నేలమీద కుప్పలావడి ఉంటాడు. అతడు మంచమీద నుంచి క్రిందపడి చనిపోయినట్లు సర్టిఫికేట్ ఇవ్వటానికి నిశ్చయించుకుంటాడు డాక్టరు సెవార్డు. అందరు కలసి పికడిల్లీలోని డ్రాకులా ఇంటిని వెదకాలని నిర్ణయించుకుంటారు అందరూ కలసి డ్రాకులా ఇంటిలో ప్రవేశిస్తారు. వాన్ హెల్సింగ్ జోనాథన్కు డ్రాకులా శక్తి, అతను చేసే ప్రమాదాల గురించి చెప్పసాగాడు. డ్రాకులా వీరి కోసం వెతుకుతున్నట్లు మినా టెలిగ్రాం పంపిస్తుంది. డ్రాకులా ఇంటిలోకి డ్రాకులా ప్రవేశించి వీరందరి బారినుండి నేర్పుగా తప్పించుకుంటాడు. మేడమ్ మినా తనను హిప్నటైజ్ చేయమని ప్రొఫెసర్ వాన్ హెల్సింగ్ను కోరుతుంది. డ్రాకులా మిగిలిన పెట్టె, బంగారం, డబ్బుతో ఓడలో పారిపోతున్నట్లు కనుక్కుంటాడు వాన్ హెల్సింగ్.

వెళ్లాం. అక్కడ మనిషిని కలిశాం. 'జరీనా కేథరిన్' ఓడ ప్రయాణం సంగతి అడిగాం. అతను మంచివాడే. క్విన్సీమోరిస్ తన జేబులోంచి ఒక నాణెం తీసి అతనికివ్వగానే, మరింత మంచివాడయ్యాడు. అతనే కాకుండా అక్కడి మనుషుల్ని కొందర్ని మంచి చేసుకున్నాం. వాళ్ళు చెప్పినదాన్నిబట్టి జరిగిందేమిటంటే —

సుమారు అయిదు గంటల ప్రాంతంలో



ఓ మనిషి వాళ్ల దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చాడట. బాగా పొడుగ్గా, సన్నగా, పాలిపోయిన మొహం, పొడుగాటి ముక్కు, తెల్లటి పళ్ళు, ఎర్రటి కళ్ళు. ఇదీ అతని అవతారం. నల్లటి దుస్తులు వేసుకుని వున్నాడట. ఇక ఆ నెత్తిమీద టోపీ, ఎప్పుడో పురాతనకాలంనాటిదట. గబగబా తన దగ్గరున్న డబ్బు వెదజల్లి, నల్ల సముద్రం మీదుగా వెళ్లే ఓడ ఏమయినా వెంటనే వుందా? అని అడిగాడట. కొంతమంది అతన్ని ఆఫీసులోకి తీసుకెళ్ళి, అక్కడ్నుంచి ఓడ దగ్గరికి వెళ్లారట. ఓడ కెప్టెన్ కావాలని అడిగాడట. అతను వచ్చాడు. డ్రాకులా అతనికి బాగా డబ్బు ఇస్తానని చెప్పాడట. తర్వాత డ్రాకులా అక్కడ వున్నవాడ్ని ఒకడ్ని, అద్దెకు దొరికే గుర్రబ్బండి దొరుకుతుందా అని అడిగాడట. తర్వాత ఒక పెద్ద పెట్టెతో తనే స్వయంగా గుర్రబ్బండిని తోలుకుంటూ వచ్చాడట. తను ఒక్కడే ఆ పెట్టెను దించాడట. కానీ ఆ పెట్టెను ఓడలో వుంచడానికి చాలామంది కావలసి వచ్చిందట. ఆ పెట్టె ఎక్కడ ఎట్లా వుంచాలి అన్న విషయంమీద కెప్టెన్‌తో చాలాసేపు మాట్లాడాడట. కెప్టెన్ విసుక్కున్నాడట. ఆ పెట్టె జాగ్రత్తగానే వుంటుంది. కావాలంటే మీరు దగ్గరే వుండి చూసుకోవచ్చు అన్నాడట కెప్టెన్. దానికి డ్రాకులా అక్కర్లేదు అన్నాడట. ఓడ నడుపుకోవాలి ఇక వెళ్లమన్నాడట కెప్టెన్. డ్రాకులా నవ్వాడట. కానీ వెంటనే కెప్టెన్ దగ్గర్నుంచి వెళ్ళిపోయాడట.

అక్కడ్నుంచి 'జరీనా కేథరిన్' ఓడ ప్రయాణం చెయ్యటం సాగించింది. కొంతదూరం పోయాక ప్రయాణం సవ్యంగా సాగేట్టు కనిపించ లేదు. ఓడ చుట్టూ మంచుతెర కమ్మెయటం మొదలుపెట్టింది. పెరిగి పెరిగి పెద్దదవ సాగింది. కెప్టెన్ ఆందోళనపడ్డాడు. అలా నీళ్ళు పైకెగసి పడుతున్నాయి. పెద్ద అల వచ్చి ఓడ మొత్తాన్ని ఎగరేసుకుపోయేట్టు చేస్తుందేమో

జీవన్మృతులు

నపించింది. కెప్టెన్ ఈ ఓడ నడపటంలో తికమక పడుతుండగా, డ్రాకులా అతని దగ్గరి కెళ్ళి, నా పెట్టె సరిగ్గానే వుందికదా అని అడిగాడట. నువ్వు, నీ పెట్టె నరకానికి తగలడండి అని అరిచాడట. అందుకు డ్రాకులా ఏ మాత్రం నొచ్చుకోలేదట. మౌనంగా మరొకడ్ని తీసుకుని పెట్టె వుంచిన చోటు చూసుకుని తృప్తి పడ్డాడట. తర్వాత మళ్ళీ డెక్‌మీదకు వచ్చి మంచుతెర వంక చూడసాగాడట కాసేపటికి మంచుతెర తొలగిపోసాగింది. వాతావరణం ప్రశాంతంగా మారింది. ఓడ ప్రయాణం ఆటంకం లేకుండా సాగింది..

కాబట్టి మేడమ్ మినా, మనం ఇప్పుడు విశ్రాంతి తీసుకోవచ్చు. ఎందుకంటే మన శత్రువు డ్రాకులా 'దనుబే' వైపు సముద్ర ప్రయాణం చేస్తున్నాడు. ఓడ ఎంత వేగంగా వెళ్ళినా సముద్ర ప్రయాణం ఆలస్యం అవుతుంది. ఇప్పుడు మనం బయలుదేరి రోడ్డు ప్రయాణం చేసి అతనికంటే తొందరగా చేరుకోవచ్చు. అతన్ని అక్కడ పట్టుకోవచ్చు. ఆ పెట్టెలో అతను వుండి, అది పగలు తీరం చేరితే బాగుంటుంది. ఆ సమయంలో అతను కదలకుండా పడుకుని వుంటాడు. మన పని సులువవుతుంది. మంచి ప్లాను తయారు చెయ్యటానికి మనకి కావలసినంత సమయం వుంది. ఓడను కనిపెట్టాం కాబట్టి, అతను ఎక్కడకు చేరతాడో ఖచ్చితంగా తెలుసు ఆ పెట్టె 'వర్నా' చేరుతుంది. ఒక ఏజంటు దాన్ని డెలివరీ తీసుకుంటాడు ఆ పెట్టెను మన చేత జిక్కించుకోవాలి.''

వాన్‌హెల్సింగ్ మాట్లాడిన తర్వాత నేను అడిగాను ''డ్రాకులా ఓడలో ఇంకా వుండి వుంటాడంటారా ?''

''మిమ్మల్ని హిప్నటైజ్ చేయగా తెలిసింది అదే'' అన్నారు డ్రాకులాను వెంబడించడం ఇంకా అవసరమా అని అడిగాను. ఎందుకంటే, జోనాథన్ నన్ను వదిలివెళ్లటం నాకిష్టంలేదు. అందరితోపాటు అతను కూడా వెళతాడని నాకు తెలుసు.

''అవసరమా ? చాలా అవసరం! అది మీకోసం, మిగిలిన ప్రజల క్షేమం కోసం. ఆ రాక్షసుడు ఇప్పటికే ఎంతో అపకారం తల పెట్టాడు. ఎన్నో శతాబ్దాలుగా సంచరిస్తున్న పీడ అతగాడు. అతన్ని మట్టుపెట్టకపోతే దేవునికెంతో అపచారం చేసినవాళ్ల మవుతాము'' అన్నారు. ఆయన మాటలు మొదట నెమ్మదిగా వున్నా, క్రమక్రమంగా గంభీరత ధ్వనించింది. కొంత కోపం కూడా ప్రదర్శించారు.

''కానీ మళ్లీ అతను ఇంగ్లాండు తిరిగి వస్తాడా ? ఎందుకంటే, ఏదైనా గ్రామం నుండి పులిని తరిమేస్తే, ఇక పులి ఆ గ్రామం వెళ్లదు'' అన్నాను.

''హా ! మీరు చెప్పే పులి, రక్తాన్ని రుచి మరిగింది. కాబట్టి ఎక్కడ మనుషులు దొరికితే అక్కడ వాళ్లను వదిలిపెట్టదు. మనం అతను దొరికేదాక వెంటబడుతూనే వుండాలి. మనల్ని అతను చూసి ఎక్కడో దూరంగా పారిపోయి ఖాళీగా కూర్చుండేవాడుకాదు. అతను మనిషిగా బ్రతికున్న రోజుల్లో టర్కీ శత్రువుతో తన దేశంలోనే పోరు సల్పాడు. ఓడిపోయాడు. దేశం విడిచి పారిపోయాడు. అయినా మళ్లీ తిరిగి ఎన్నోసార్లు తన దేశం వెళ్లాడు.'' అన్నాడు వాన్‌హెల్సింగ్.

కాసేపు డ్రాకులా గురించి చర్చించాం. ఆ రోజు రాత్రి ఏం చెయ్యాలన్నది సరిగ్గా నిర్ణయం కాలేదు కాస్తంత నిద్ర తీసాక, మళ్ళీ ఆలోచన మొదలెడితే మంచిదనుకున్నాం. మరునాడు ఉదయం ఆహారం తీసుకునే సమయంలో ఒకరి ఆలోచనలు ఒకరు చెప్పుకుని ఏం చెయ్యాలన్నది నిర్ణయించదల్చుకున్నాం.

ఈ రోజు రాత్రి బాగా నిద్ర పట్టేట్టుగా వుంది. పీడ వదిలినట్టుగా వుంది.

డాక్టరు సెవార్డు డైరీ :

అక్టోబర్ 5 : అందరం తొందరగానే లేచాం. నిద్ర పోవటంవల్ల అందరికీ కొత్తబలం వచ్చినట్టయింది. ఉదయపు ఫలహారం తీసుకునే సమయంలో అందరి మొహాలు కళకళలాడుతూ కనిపించాయి. గతమంతా పీడకల అనిపించింది. కానీ మినా నుదుటిమీద చెరగని గాయం కనిపించే సరికి మళ్లా డ్రాకులా గుర్తుకువచ్చాడు.

చెయ్యవలసిన పనుల గురించి చర్చించాల్సి వుంది అందరూ మనసులోని ఆలోచనలన్నీ బయట పెడితేగానీ, కార్యక్రమం నిర్ణయించ టానికి వీలుపడదు. మినా మనసులో ఎన్నో ఆలోచనలు వున్నట్టున్నాయి. కానీ ఆమె పెదవి విప్పటంలేదు. అదే విషయం వాన్ హెల్సింగ్‌కి చెప్పాను. ఇద్దరం ఏకాంతంగా వున్నప్పుడు ఆమె గురించి మాట్లాడుకుందామని వూరుకున్నాం. డ్రాకులా కోరల్లోని విషం ఆమె శరీరంలో ఎప్పుడో ఎక్కిందికదా, అది బహుశా పనిచేస్తున్నట్టుంది. అదే నిజమయితే ప్రమాదం ముంచుకు వచ్చేటట్టు వుంది.

నేను నా గదిలో వుండగా, మిగతావాళ్ళకన్న కాస్త ముందుగా వాన్‌హెల్సింగ్ వచ్చాడు. ఈమె గురించి ఇప్పుడు ఇద్దరం మాట్లాడుకోవాలి.

తర్వాత : ప్రొఫెసర్ వాన్‌హెల్సింగ్ నా గదిలోకి వచ్చింతర్వాత ఇద్దరం చర్చించుకున్నాం. అతని మనసులో ఏదో వుంచుకుని అది బయట పెట్టటానికి సందేహిస్తున్నట్టుగా కనిపించాడు మొదట. గుచ్చిగుచ్చి అడిగాక అతను చెప్పాడు—

''మిత్రమా జాన్, మనమిద్దరం ఏకాంతంగా

వుండి మాట్లాడుకోవల్సింది వుంది. తర్వాత మిగతావాళ్ళ అభిప్రాయాలు తీసుకుందాం.'' అతను ఒక్క క్షణం ఆగాడు. నేను కూడా ఏమీ అడక్కుండా వూరుకున్నాను.

''మేడమ్ మినాలో పాపం ఏదో మార్పు వస్తూవుంది'' అన్నాడు. అట్లా అనగానే నాలో వణుకు బయలు దేరింది.

''లూసీ గురించి మనకు బాగా అనుభవ ముంది. మరీ ప్రమాదం ముంచుకు రాకముందే మనం జాగ్రత్త పడాలి. ఇప్పుడు మనకు మిగిలిన సమయం చాలా విలువయినది. ఆమె మొహంలో దయ్యం కళలు వస్తున్నాయి. చాలా కొద్దిగానే అనుకో. మన వూహ ఎంతవరకు నిజమవుతుందో చూడాలి. ఆమె పళ్ళు సూదిగా మారుతున్నాయి. కళ్ళు అప్పుడప్పుడు తీక్షణంగా చూస్తున్నాయి. ఆమె మౌనంగా వుంటోంది చూసావా ! లూసీ కూడా అంతే. ఆమె కూడా మాట్లాడలేదు. కాగితం మీద రాసిపెట్టి వుంచింది. నా భయం ఒకటుంది. ఆమెను హిప్నటైజ్ చేసి డ్రాకులా ఏం చేస్తున్నాడు, ఏం చూస్తున్నాడు అని మనం తెలుసుకున్నట్టుగా అనుకుంటున్నాం. అసలు డ్రాకులానే ఆమెను మనకంటే ముందుగా హిప్నటైజ్ చేసి మన గురించి తెలుసుకుంటు న్నాడేమో ?'' అన్నాడు. నేను ఒప్పుకుంటూ తలూపాను.

''అయితే మనం వెంటనే దాన్ని ఆపాలి. మనం ఏం చేస్తున్నామో, ఏం చూస్తున్నామో ఆమెకు ఏ మాత్రం తెలియనీయ కూడదు. దాని వల్ల, ఆమె అతనికి ఏమీ చెప్పలేదు. కానీ దాన్ని ఆపటం చాలా బాధతో కూడుకున్న పని. అది తలుచుకుంటేనే గుండె బ్రద్దలవుతుంది. ఆమెను కలిసి మన చర్చల్లో పాల్గొన కూడదని చెప్పాలి'' అన్నాడు. అతని మొహం అంతా చెమట పట్టే సింది. అట్లా చెప్పటం కష్టమని నాకు తెలుసు. అయినా అతని ఆలోచన నేను అంగీకరించినట్టు తెలిపితే, కాస్త సంతోషిస్తాడనిపించింది. అతని ఆలోచన సరైనదే అన్నాను. దానికి అతను కొద్దిగా తేరుకున్నాడు.

తర్వాత : అందరం చర్చకు కూర్చున్నప్పుడు మేడమ్ మినా దగ్గర్నించి జోనాథన్ కబురు తీసుకు వచ్చాడు. చర్చలో ఆమె పాల్గొనదట. అట్లా చేస్తే మా చర్చ ఎటువంటి ఆటంకం లేకుండా సాగుతుందట. అది వినగానే ఎక్కువగా సంతోషించిన వాళ్లం నేనూ, వాన్‌హెల్సింగ్. నాకు ఒక సందేహం వచ్చింది గానీ, అప్పటికి మౌనంగా వుండటం మంచిదనిపించిది. వెంటనే మా చర్చ ప్రారంభించాం. వాన్‌హెల్సింగ్ ఒక ప్లాను తయారు చేసి దాన్ని వివరించాడు ఇలా—

''జరీనా కాథరిన్ ఓడ నిన్న ఉదయం థేమ్స్‌తీరం దాటింది. అది 'వర్నా' చేరటానికి కనీసం మూడు వారాలు పడుతుంది, ఎంత వేగంగా వెళ్లినా కూడా. కానీ రోడ్డు ప్రయాణం చేసి మూడు రోజుల్లో మనం అక్కడికి చేరుకో వచ్చు. డ్రాకులా శక్తియుక్తుల వల్ల ఓడ ఎంత వేగంగా నడిచినా కనీసం రెండు వారాలు పడు తుంది కాబట్టి మనం ఎంత లేదన్నా 17 వ తేదీన బయలుదేరాలి. అట్లాఅయితే ఓడ 'వర్నా' చేరుకోవడానికి ఒకరోజు ముందే మనం అక్కడ వుంటాం. తర్వాత కార్యక్రమాలు నిర్ణయిస్తాం. మనం ఎప్పటిలాగే సర్వసన్నద్ధులమై వెళ్లాలి.''

''డ్రాకులా తోడేళ్లుండే దేశం నుంచి వచ్చాడు. కాబట్టి తెలివిగా మనకంటే ముందే చేరుకుంటాడు'' అన్నాడు క్విన్సీమోరిస్.

'' 'వర్నా'మనం ఎవరూ చూడని ప్రదేశం. కాబట్టి మనం ముందే ఎందుకు బయలుదేరి వెళ్లకూడదు ? ఇక్కడ వుండే బదులు అక్కడ వుంటాం. ఈ రాత్రి, రేపు రాత్రి అన్నీ సర్దుకుని మనం నలుగురం బయలుదేరవచ్చు.'' అన్నాడు వాన్‌హెల్సింగ్.

'' నలుగురా ? అంటే ఎవరెవరు ? '' జోనాథన్ సందేహంగా అడిగాడు.

''మీరు వుండిపోవాలి జోనాథన్. మీ భార్యకు తోడుగా వుండాలి'' వెంటనే అన్నాడు వాన్‌హెల్సింగ్, జోనాథన్ క్షణం కాలంపాటు మౌనంగా వుండి తర్వాత సన్నటి గొంతుతో అన్నాడు ''ఆ విషయం రేపు నిర్ణయిద్దాం. నేను నా భార్యను సంప్రదిస్తాను.''

మా ప్లానులు ఏవీ మినాకు తెలియనీయ కూడదు కదా. ఆ విషయంగురించి వాన్‌హెల్సింగ్ జోనాథన్ని హెచ్చరిస్తాడనుకున్నాను. కానీ వాన్‌హెల్సింగ్ ఆ విషయం గమనించినట్లు లేదు అందుకని కొద్దిగా దగ్గి అతనివంక చూసాను జవాబుగా పెదాలమీద వేలుంచుకుని అటువేపు తిరిగిపోయారు వాన్‌హెల్సింగ్.

జోనాథన్ డైరీ :


అక్టోబర్ 5 (మధ్యాహ్నం) : ఇవాళ ఉదయం మా చర్చ అయిన తర్వాత బుర్ర పని చేయలేదు. కొత్త సంఘటనలు నా బుర్ర వేడెక్కించి నన్ను ఏమి ఆలోచించకుండా చేసాయి మినా మా చర్చల్లో ఎందుకు పాల్గొనని చెప్పిందో అన్నదానిగురించి ఆలోచించడం మొదలు పెట్టాను. ఆ విషయంతో ఆమెతో వాదించలేక పోయాను కూడా. ఆమె మనసును వూహించాలి అదీ సాధ్యపడలేదు. మిగతావాళ్లుగూడా మినా గురించి పట్టించుకోపోవటం ఆశ్చర్యంగా వుంది మినా ఇప్పుడు నిద్రపోతోంది, పసిపిల్లలా, ఆమె మొహంలో ఎంతో సంతృప్తి గోచరిస్తోంది. దేవుడి దయవల్ల ఆమె ఎప్పుడూ అలాగే వుంటే బాగుండును.


తర్వాత : ఎంత ఆశ్చర్యం ! మినా ప్రక్కనే కూర్చుని ఆమెను గమనించాను. పగలు గడిచి పోయి చీకటి అలుముకోసాగింది. గదిలో నిశ్శబ్దం అంతకంతకూ ఎక్కువయింది. వున్నట్టుండి మినా కళ్ళు తెరిచి నన్ను చూసి ఎంతో ఆప్యాయంగా అంది :

''జోనాథన్ నువ్వు నాకొక మాట ఇవ్వాలి. ఎటువంటి పరిస్థితుల్లోనూ మాట తప్పకూడదు. చెప్పు. వెంటనే వాగ్దానం చెయ్యి.''

''మినా, అంత తొందరగా మాట ఇచ్చే హక్కు నాకు లేదు.'' అన్నాను.

''కానీ డియర్...'' ఆమె అంది. కళ్ళు వింతగా మెరిసాయి.





జీవన్మృతులు

''నేను అడుగుతున్నాను. అదీ నాకోసం కాదు. నువు డాక్టర్ వాన్‌హెల్సింగ్‌ని కూడా అడగొచ్చు, నేను అడిగినది ఎంత సమంజసమో. ఒకవేళ ఆయన ఒప్పుకోకపోయినట్టయితే, నీకు తోచినట్టు చెయ్యవచ్చు'' అంది.

''అయితే మాట ఇస్తున్నాను'' అన్నాను. అది విని ఆమె ఎంతో సంతోషించింది.

''నాకు మాట ఇవ్వు. డ్రాకులాను చంపటానికి మీరు వేసే ప్లానులు ఒక్కటికూడా నాకు తెలియనివ్వకూడదు. ఒక్క మాటగానీ, ఒక్క సైగగానీ, ఒక్క విషయంగానీ నాకు తెలియకూడదు. నేను ఎటువంటి పరిస్థితిలో వున్నాసరే'' ఎంతో ప్రాధేయపూర్వకంగా అంది.

''అలా అని మాట ఇస్తున్నాము'' ఆ మాటతో మా ఇద్దరిమధ్య ఒక తెర పెట్టినట్టయింది.

అర్ధరాత్రి : సాయంత్రం అంతా మినా ఎంతో వుల్లాసంగా కనిపించింది. ఆమె విశ్రాంతి ఆమెకు మంచి శక్తినిచ్చింది. మినా త్వరగా నిద్రపోయింది. పసిపాపలా కనిపించింది నిద్రలో. ఆమె డ్రాకులా వలలోపడ్డ బాధలోవున్నా, నిద్ర ఆమెకు విశ్రాంతి నిస్తోంది. ఆ విధంగా దేవుడు ఆమెను రక్షిస్తున్నాడు.

అక్టోబర్ 6 (ఉదయం) : మరొక ఆశ్చర్యకరమైన విషయం! నిన్నటిలాగే ఇవాళ తెల్లవారుజామున మినా నన్ను నిద్రలేపింది. వాన్‌హెల్సింగ్‌ను తీసుకుని రమ్మంది. మళ్ళీ హిప్నటైజ్ చేయమని కోరుతుందేమో అనుకుంటూ ఆయనకోసం వెళ్ళాను. అటువంటి పిలుపు వస్తుందని వూహిస్తూవున్నాడేమో, ఆయన బట్టలు వేసుకుని బయలుదేరటానికి సిద్ధంగా వున్నాడు. ఆయన వెంటనే నాతో వచ్చారు. గదిలోకి వస్తూనే మినాను అడిగారు ''ఇంకెవరైనా లోపలికి రావచ్చా'' అని.

''వద్దు! వాళ్ళ అవసరం లేదు. సంగతి మీరే వాళ్ళకి చెప్పవచ్చు. నేను కూడా మీతో బయలుదేరతాను!'' అంది మెల్లగా.

డాక్టర్ వాన్‌హెల్సింగ్ ఒక్కసారి ఆశ్చర్యపోయారు. ఒక్క క్షణంలో తేరుకుని ''ఎందుకు?'' అడిగారు.

''మీరు నన్ను వెంట తీసుకెళ్ళాలి. అప్పుడే నేను క్షేమంగా వుంటాను. మీరు కూడా క్షేమంగా వుంటారు.''

''ఎందుకని అలా? మేడమ్ మినా, మీ క్షేమమే మాకు ముఖ్యం అని మీకు తెలుసు. మేము ఒక ప్రమాదమైన చోటుకు వెళ్ళదల్చుకున్నాం. మీరు వస్తే, ఆ ప్రమాదంలో ముఖ్యంగా మీరు చిక్కుకుంటారు'' అన్నారు.

''నాకు తెలుసు. అందుకనే బయలుదేరదల్చుకున్నాను. సూర్యోదయం జరుగుతున్న సమయంలో మీకు వివరిస్తాను. తర్వాత నేను చెప్పలేను. డ్రాకులా పిలిస్తే నేను వెళతానని నాకు తెలుసు. డ్రాకులా నన్ను రహస్యంగా రమ్మని చెపితే, జోనాథన్ కళ్ళు గప్పి కూడా వెళ్ళగలనని తెలుసు'' మినా అంది. వెంటనే నేను ఆమె చేతులు పుచ్చుకున్నాను. నా కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

''మీరంతా ధైర్యం గలవారు. మీ శక్తి ముందు అతని శక్తి పనికిరాదు. నేను కూడా మీకు తోడుగా వుంటే, నా సహాయం వుంటుంది. మీరు నన్ను హిప్నటైజ్ చేసి, నాకు తెలియని విషయాలు కూడా మీరు తెలుసుకోగలరు'' అంది.

దానికి డాక్టర్ వాన్‌హెల్సింగ్ గంభీరంగా బదులు చెప్పాడు —

''మేడమ్ మినా, మీరు ఎప్పుడూ గొప్పగా ఆలోచించి మాట్లాడతారు. మీరు కూడా మాతోపాటు వస్తారు. అందరం కలిసి మనం కార్యాన్ని సాధిద్దాం'' అట్లా అనగానే ఆమె చాలాసేపు మౌనంగా వుండిపోయింది. వెంటనే వెనక్కి వాలిపోయింది. దిండుమీద నిద్రపోయింది. గబగబా కిటికీ తెరలు తీసాను. ఉదయపు వెలుగు గదిలోకి వచ్చింది. ఆ వెలుగు ఆమెను నిద్ర లేపలేకపోయింది. వాన్‌హెల్సింగ్ తనతోపాటు రమ్మని సైగచేసాడు. మేం ఆయన గదిలోకి వెళ్ళాం. మరు నిముషంలో ఆర్థర్, డాక్టర్ సెవార్డు, మిస్టర్ మోరిస్ కూడా వెంట వచ్చారు.

వాన్‌హెల్సింగ్ వాళ్ళకు మినా చెప్పిన మాటలు చెప్పారు. తర్వాత ఇలా అన్నారు.

''ఉదయం మనం 'వర్నా' బయలుదేరాలి. మనకి ఇప్పుడో కొత్త సమస్య వచ్చింది. అది మేడం మినా సంగతి. ఆమె చెప్పింది నిజమే. ఓడ 'వర్నా' చేరుకోకముందే అక్కడ మనం వుండాలి. కాలం వృధా పుచ్చడానికి వీలులేదు.''

''అసలు మనం ఖచ్చితంగా చెయ్యాల్సిన పనేమిటో చెప్పండి'' అడిగాడు మోరిస్.

క్షణం ఆగి వాన్‌హెల్సింగ్ చెప్పారు ''మనం ఆ ఓడ ఎక్కాలి. ఆ చెక్కపెట్టె ఉనికి కనిపెట్టాలి. తర్వాత అడవి గులాబీ పువ్వును దానిమీద వుంచాలి, ఎవరూ తీయటానికి వీలు లేనట్టుగా. అదేవిటి అని ఆలోచించకూడదు. ముందు మనం మూఢనమ్మకాలతో పనులు చెయ్యాలి, ఆ నమ్మకంవల్ల పనులు జరగవచ్చు. ఎవరూలేని మంచి సమయం చూసి ఆ పెట్టెను తెరవాలి. ఇక తర్వాత అంతా మనదే.''

''మంచి సమయం కోసం ఎదురుచూడడం ఎందుకు. నాకు కనక పెట్టె కనపడిందంటే చాలు, వెంటనే తెరిచి ఆ రాక్షసుడ్ని చంపేస్తాను, వేలమంది చూస్తూ వున్నాసరే, ఒకవేళ నా ప్రాణాలకు ముప్పు వాటిల్లినా సరే'' అన్నాడు క్విన్సీ మోరిస్.

నేను అతని చెయ్యి అందుకున్నాను. అది ఉక్కులా గట్టిగా వుంది.

''మంచిదబ్బాయి. మీరు చాలా ధైర్యసాహసాలు గలవారు. అతన్ని చంపటానికి మనలో వెనకాడేది ఎవరూ లేరు. కానీ మనం ఏం చెయ్యదలచుకున్నామో, దాన్ని బయటకు చెప్పకూడదు. అప్పటి పరిస్థితి ఎలా వుంటుందో మనకు తెలీదు. పనులు ఎట్లా ముగుస్తాయో తెలీదు. మనం అనుకున్నది చెయ్యలేకపోవచ్చు. మనం అన్నిటికీ సిద్ధపడి వెళ్ళాలి. ముందు మన ప్రయాణానికి సంబంధించిన పనులు చూడాలి. నేను అన్నీ సర్దుకున్నాను. టిక్కెట్లు కొనుక్కొస్తాను. మీరు సిద్ధంకండి'' అన్నాడు వాన్‌హెల్సింగ్.

అందరం విడిపోయాం, ఎవరి సామాను వారు సర్దుకునేందుకు.

తర్వాత : అన్ని పనులు అయిపోయాయి. నా 'విల్లు' కూడా తయారు చేసాను. నా తర్వాత నా ఆస్తికి మినా వారసురాలు. ఒకవేళ ఆమె కూడా లేనట్టయితే, మాకు ఎవరైతే ఆప్తులు వున్నారో వాళ్ళకు చెందేలా రాసాను.

ప్రొద్దుగుంక సాగింది. మినా నలతగా కనిపిస్తోంది. ఆమె బుర్రలో ఏదో ఆలోచన వున్నట్టుంది. అది సూర్యాస్తమయ సమయంలో తెలియవచ్చు. ఈ సమయాలు మాకు ఎంతో ఆందోళన కలిగిస్తున్నాయి. సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాలు ఎప్పుడూ ఏదో ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. ఇప్పుడు డైరీ రాస్తున్నాను.

అదిగో, మినా పిలుస్తోంది.

(ఇంకా వుంది)

వృద్ధులకు రాయితీలు!

వృద్ధ దంపతులకు జపానులో ప్రయాణ ఛార్జీలలో రాయితీలను ఇస్తున్నారు. ఈ పథకానికి ఎక్కువగా ప్రజాదరణ లభిస్తున్నట్లు తెలుస్తున్నది. జపాను జాతీయ రైల్వేలు కొత్తగా ''గ్రీన్ సీట్ పాస్ ఫర్ ఫుల్ మూన్ కపుల్స్'' అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. హనీమూన్ను గుర్తుకు తెచ్చే విధంగా ''ఫుల్ మూన్'' అనే కొత్త పదాన్ని రూపొందించారు. గ్రీన్ సీట్ అంటే మొదటి తరగతి ప్రయాణం. ఈ పాసులు ఏడు రోజులు చెల్లుతాయి. ఈ కాలంలో వీరు ఎంత దూరమైన ప్రయాణం చేయవచ్చు. అయితే ఈ దంపతుల మొత్తం వయసు కనీసం 88 సంవత్సరాలుండాలి!

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

ఎమ్ సిహెచ్. - అహమ్మదాబాద్

హరిజనవాడలో రామాలయాలు ముఖ్యమా? గృహాలు పాఠశాలలు ముఖ్యమా ?

★ అసలలా విడిగా హరిజనవాడలు శాశ్వతంగా వుండాలా అని ఆలోచించరేం ? విసిరేసినట్లు వూరికి దూరంగా హరిజనవాడల నిర్మాణం ఆగాలి ముందు. సాంఘిక జీవన ప్రవంతితోపాటు నారూ నలుగురి మధ్య వుండి సాగాలి. అదీ ముఖ్యం. కాని రాజకీయవేత్తలకిలాంటివి నష్టం కల్గిస్తాయి. వారి నాయకులే వారిని అదుపులో పెట్టుకుని అలాగే బడుగు ప్రాణులుగా వుండేలా కట్టుదిట్టాలు కళ్లకి కనబడకుండా చేస్తారు. వాగ్దానాలు చేస్తారే గాని కార్యాచరణకి దిగరు. ఈ వీరి సమస్య పరిష్కారం అయిపోతే నాయకులకి బువ్వ వుండదు — ఓట్ల సంగతి సరేసరి ! అందుకే — దేవాలయాలు కట్టిస్తాం. కుళాయిలు వేయిస్తాం అంటూ గప్పాలు కొడుతూ ఎన్నికల నుంచి ఎన్నికల దాకా — కాలక్షేపం చేస్తూ వుంటారు.

ఎమ్ వి ఆర్ — టేకిపెట్టిపాలెం

మన ముఖ్యమంత్రి ఆడవారికి ఆస్తిహక్కు అని గోలపెడతున్నారు. కట్నం రూపేణా వేలకి వేలు పోస్తున్నారు కదా ?

★ మీలాంటి వాళ్లుండి యిలాగే ఆలోచిస్తున్నంతకాలం— యీ దేశంలో ఆడది మనిషిగా గుర్తింపుపొందదు స్వామీ !! ఆస్తి వున్న వాళ్లేనా పంచుతారని— ఆస్తిహక్కు. కట్నాలకీ దానికీ సంబంధం ఏమిటి ? కట్నం నిషేధించబడింది. మీకు తెలియదా ? ఎవరేనా యిచ్చి పుచ్చుకుంటున్నారంటే— అది దొంగతనంగానే?

కె. వి. ఆర్. — వైజాగ్

ప్రశ్నావళి వయిస్సెంత? అన్నగారి రాజ్యంలో ప్రశ్నావళి రిటైర్మెంటు ఎప్పుడు ?

★ మీరు మరిచిపోయినట్టుంది — నేను గవర్నమెంటు ఉద్యోగినికాను. స్వేచ్ఛాస్వతంత్రాలకి కట్టుడిలేని జర్నలిస్టుని.

టి. జె. - అనకాపల్లి

మేనరికాలవల్ల ప్రమాదం వుందని డాక్టర్లు చెప్తున్నారు. నాకు మేనరికం వుంది ...

★ మీరు డాక్టర్ని సంప్రదించండి. రెండు మూడు తరాలు వరుసగా మేనరికాలు చేసుకున్న చోట ప్రమాదం ఎక్కువ అంటారు; మనస్సులో అనుమానం నివృత్తి చేసుకోవడం చాలా ముఖ్యం. లేకపోతే సంసారం నరకం అవుతుంది.

పెమ్మత్స - హైదరాబాదు

మిమ్మల్ని మెచ్చుకుంటూ పొగిడినా యిబ్బందే. నొచ్చుకుంటూ తిట్టినా ఇబ్బందిలానే వుంది. మరి మీ సేవానిరతిని ఏ విధంగా ప్రశంసించమంటారు ?

★ మీలా నోటితో ప్రశంస నొసటితో వెక్కిరింతా చేసేవారిని గ్రహించలేని చిన్నదాన్ని కాదుస్వామీ, నా సేవానిరతిని (ఏమిటో మరి?) పొగడనూవద్దు తెగడనూవద్దు. గుర్తిస్తేచాలు.

కె. ఆర్ - వేలపోగుల

కొందరు ఎంత మంచివారైనా చెడ్డగా అపార్థం చేసుకుంటారు కొంతమంది ఎందుకని ? దురదృష్టమంటారా ?

★ మంచితనం బోర్డు కట్టుకుని కనిపించదు కదా ? అందుకని.

ఎస్.ఎస్.ఎన్.ఎమ్. - మునిపల్లి

మేడమ్ చుట్టరికం విలువైనదా ? స్నేహం విలువైనదా ?

★ స్నేహమే. స్నేహితులు కష్టం సుఖం పంచుకుంటారు. చుట్టాలు సుఖాన్నే పంచుకుంటారు.

పి హెచ్. ఆర్. — సిర్పూర్ కాగజ్ నగరు

మనకు దగ్గరయ్యేమనుషులు చెప్పుడు మాటలువిని ప్రాణానికి ప్రాణమైన వారినే పోగొట్టుకొంటారు ?

★ చెప్పుడు మాటలు చాలా రుచిగావుంటాయి— పొరుగింటి పుల్లకూరలాగ, అవి వినేవాళ్లు కాస్త నిలకడమీద తెలుసుకుంటారు — నిజానిజాలు.

డి వి.ఎల్ ఎన్.ఎస్. — కొండపల్లి

మీరు యిచ్చే సమాధానాలవల్ల పాఠకులకు ఏమైనా ఉపయోగం వుంటుందని మీరనుకుంటున్నారా ?

★ లేదు ! నాకు ఉపయోగంగానే వుటుందని అనుకుంటున్నాను.

ఎమ్. ఆర్. ఆర్. — యిల్లందు

వరకట్నాలు ఏనాటికైనా రూపుమాసిపోతాయా ?

★ ఆడపిల్లలూ — మగపిల్లలూ తేడా లేకుండా పెంచబడిననాడు- పోవచ్చు. మనకి సిగ్గుతక్కువ. అందుకే— పిల్లలని +/− గా లెక్కకడతారు.

ప్రసాద్ — కారవార్


కథ రాయడం పూర్తి అయ్యాక పేరు పెట్టడం మంచిదా ? పేరు వూహించి తరవాత కథ రాయడం మంచిదా ?


★ నా కంతగా తెలియదు! కాని కథకులు— కథ రాసి పేరు ఆలోచిస్తారనీ, సినిమావాళ్లు పేరుకి కథ రాయించుకుంటారనీ అనిపిస్తూంది!

జి వి. ఆర్. — సికింద్రాబాదు

అదృష్టం కలిసిరావాలేగాని అందరూ మీలాగా రచయిత కాలేరంటారా ?

★ అదృష్టం కలిసి రాగానే సరికాదయ్యా! దాన్నెలా సద్వినయోగం చేసుకోవాలో కూడా తెలియాలి !! ★





నాగేశ్వరరావు ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్

రిజిష్టర్డు ఆఫీసు : 14 : 14 : 21, మల్లిఖార్జునరావు వీధి, విజయవాడ. 3.

ప్రజలనుంచి, వాటాదార్లనుంచి ఫిక్సెడ్ డిపాజిట్లు/ఋణములు అంగీకరించుట/పునరుద్ధరించుట జరుగును

షరతులు, నిబంధనలు

I. కనీస మొత్తం రు. 2000 లు లేదా ఆపై రు.1000 తో హెచ్చింపబడు మొత్తమునకు డిపాజిట్లు అంగీకరించడం/—పునరుద్ధరించడం జరుగుతుంది.

II. డిపాజిట్లు / ఋణములు కనీస కాలపరిమితి 1 సంవత్సరమునకు, గరిష్ట పరిమితి 2 సంవత్సరముల కాలమునకు అంగీకరించ బడును.

III. దరఖాస్తు ఫారములో పేర్కొన్నటువంటి షరతులు, నిబంధనలకు లోబడి డిపాజిట్లు/ఋణములు అంగీకరించడం జరుగుతుంది. దరఖాస్తు ఫారములు విజయవాడలో గల రిజిష్టర్డు కార్యాలయంలోనూ, హైదరాబాదు నెం. 5—9—49, బషీర్‌బాగ్ లోని బ్రాంచి కార్యాలయమునందును లభ్యము కాగలవు.

IV. డిపాజిట్లు / ఋణములు తిరిగి చెల్లింపులు గాని, వడ్డీ చెల్లింపులు గాని,డిపాజిటు చేయబడిన ఆయా ప్రదేశముల లోని కంపెనీ బ్యాంకర్ల క్రాస్‌చేసిన చెక్కుల ద్వారా చెల్లించబడుతుంది.

V. కొత్తగా దరఖాస్తు పెట్టుకొని డిపాజిట్లు పునరుద్ధరించుకోవచ్చును.

VI. తిరిగి చెల్లించేగడువు ముగియక మునుపే, డిపాజిటు మొత్తాన్ని తిరిగి చెల్లించే హక్కు కంపెనీ కలిగియుంటుంది.

VII. వడ్డీని ప్రతి ఆరునెలలకు అంటే ఏప్రిల్30వ మరియు అక్టోబరు 31 వ తేదీ క్రింది రేట్లపై చెల్లించబడుతుంది.

ఒక సంవత్సరానికి	సాలుకు	13%
రెండు సంవత్సరాలకు	సాలుకు	14%
(డైరెక్టర్లనుండి)	సాలుకు	12%

1956 కంపెనీల చట్టంలోని సెక్షన్ 58ఏ క్రింద సవరించిన 1975 కంపెనీల నిబంధనల ప్రకారం (డిపాజిట్లు అంగీకరించు విషయంలో) కంపెనీ యొక్క వివరాలు.

I. కంపెనీ పేరు : నాగేశ్వరరావు ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, 14—14—21, మల్లిఖార్జునరావు వీధి, విజయవాడ=3

II. స్థాపించిన తేది : 4 మే 1955

III. వ్యాపారము : వార్తాపత్రికలు, తదితర పత్రికలను అనగా ఆంధ్రపత్రిక, (దినపత్రిక), ఆంధ్రపత్రిక వారపత్రిక (వారపత్రిక) భారతి (మాసపత్రిక)లను విజయవాడ, హైదరాబాద్‌లలోని కంపెనీ స్వంత రోటరీ, మరియు ఆఫ్ సెట్ ముద్రణ యంత్రములపై ప్రింటు చేసి ప్రచురిస్తున్నది.

IV. మేనేజిమెంటు బోర్డు ఆఫ్ డైరెక్టర్ల కంట్రోలు మరియు సూచనల మేరకు మేనేజింగ్ డైరెక్టరుచే కంపెనీ నిర్వహించబడుచున్నది.

V. బోర్డు ఆఫ్ డైరెక్టర్ల పేర్లు, చిరునామా, వృత్తి :

	పేరు	చిరునామా	వృత్తి.
1.	శ్రీ ఎస్. రాధాకృష్ణ (మేనేజింగ్ డైరెక్టర్)	నెం. 1, లజా ఎవెన్యూ, మైలాపూరు, మద్రాసు—4.	డైరెక్టర్.
2.	శ్రీమతి ఎస్. కామాక్షమ్మ	నెం. 1, లజాఎవెన్యూ, మైలాపూరు, మద్రాసు—4.	డైరెక్టర్
3.	శ్రీ ఎస్.నాగేశ్వరరావు	నెం. 1, లజా ఎవెన్యూ, మైలాపూరు, మద్రాసు—4.	డైరెక్టర్.
4.	శ్రీ సి.హెచ్. పూర్ణచంద్రరావు	కేరాఫ్ విజయ పిక్చర్స్, గాంధీనగరం, విజయవాడ—3.	డైరెక్టర్.

VI గడచిన మూడు ఆర్థిక సంవత్సరములలోని పన్నులు, డివిడెండ్లు కేటాయింపులకు ముందు / తర్వాత కంపెనీ లాభాలు (ఆడిట్ కాబడిన బ్యాలెన్స్ షీట్సు నుండి అంకెలు)

30 ఏప్రిల్ సం. అంతమునకు	పన్నుకు ముందు లాభము	పన్నుతర్వాత లాభము	ప్రకటించిన డివిడెండు
1980 (నష్టము)	రు. 3865 (నష్టం)	రు. 3865	లేదు.
1981 (నష్టము)	రు. 152005 (నష్టం)	రు. 152005	లేదు.
1982	రు. 39721	రు. 39721	లేదు.

VII ఆడిట్ కాబడిన గడచిన రెండు బ్యాలెన్సుషీట్‌లలో సూచించిన కంపెనీ ఆర్థికస్థితిగతుల సంగ్రహ స్వరూపము.

అప్పులు	30—4—1982 నాటికి ఆడిట్ కాబడిన బ్యాలెన్సుషీట్లో లభించిన గత ఆర్థిక సంవత్సరానికి అంకెలు.	రెండవకాలంలో సూచించిన ఆర్థిక సంవత్సరానికి ముందటి సంవత్సరానికి 30.4.1981 నాటికి లభించిన అంకెలు	ఆస్తులు	30.4.1982 నాటికి ఆడిట్ కాబడిన బ్యాలెన్సుషీట్లో లభించిన గత ఆర్థిక సంవత్సరానికి అంకెలు	రెండవకాలంలో సూచించిన ఆర్థిక సంవత్సరానికి ముందటి సంవత్సరానికి 30.4.1981 నాటికి లభించిన అంకెలు
1 2	3	4	5	6	7
షేర్ కాపిటల్	2,55,000	2,20,000	ఫిక్స్‌డ్ అస్సెట్స్	12,53,786	13,67,727
రిజర్వులు & సర్‌ప్లస్	5,91,356	5,55,234	పెట్టుబడులు	11,545	11,545
సెక్యూర్‌డ్‌లోన్స్	13,99,931	15,17,165	కరెంటు అస్సెట్స్	48,22,867	41,58,947
అన్‌సెక్యూరిడ్‌లోన్స్ అండ్ డిపాజిట్లు	2,77,000	5,01,000	లోన్స్‌అండ్ అడ్వాన్సెస్	1,94,541	1,30,248.
వర్తమానఅప్పులు కేటాయింపులు	37,59,452	28,75,068	మిసలేనియస్ ఖర్చులు, లాభాలు. నష్టం అకవుంటు		
మొత్తం	62,82,739	56,68,467	మొత్తం	62,82,739	56,68,467.

VIII కరెంట్ లయబిలిటీస్	30—4—1982. నాటికి	30—4—1981 నాటికి
కేటాయించ బడలేదు.		
లెటర్‌ఆఫ్ క్రెడిట్‌ద్వారా కొనుగోలుచేసినముడిసరుకులు	రు. 5,29,000	రు. 31,79,750

IX డిపాజిట్ల ద్వారా కంపెనీ సేకరించ గల మొత్తం రు. 2,96,000.

X ఆర్థిక సంవత్సరమునకు ముందు రోజున (30—4—1982) ఉన్నటువంటి సగటు డిపాజిట్లు. రు. 1,19,000.

XI ఈప్రకటన తేదీనాటికి, అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు మరియు ఓవర్‌డ్యూ డిపాజిట్లు కంపెనీ కలిగియుండుట లేదని యిందు మూలంగా కంపెనీ తెలియ జేస్తున్నది.

XII కంపెనీ యిందు మూలంగా ప్రకటించు చున్నది.

1. 1975 సవరించిన కంపెనీ నిబంధనల మేరకు డిపాజిట్లు (అంగీకరించుటకు) కంపెనీ గౌరవిస్తున్నదని 31,మార్చి 1983వ ఆలోగా డిపాజిట్లు గడువు పూర్తయ్యేలోగా తిరిగి చెల్లించుటకు ఒక జాతీయ బ్యాంకులో అవసరమైన మొత్తం జమ చేయబడినది.
2. డిపాజిట్ల మొత్తాలు తిరిగి చెల్లించే విషయంలో కేంద్రప్రభుత్వం పూచీ ఉంటుందనే నిబంధన ఇందులో లేదు.
3. కంపెనీ అంగీకరించిన డిపాజిట్లు అన్‌సెక్యూర్‌డ్ లోన్స్ ఇవి ఇతర అన్‌సెక్యూరుడ్ లయబిలిటీస్‌తో పాటు పరిగణించ బడతాయి.
4. డిపాజిట్లద్వారా, పునరుద్ధరణ ద్వారా వచ్చిన మొత్తాన్ని కంపెనీ వర్కింగ్ కాపిటల్ క్రింద ఉపయోగించు కొన వచ్చును.

XIII 1. ఈప్రకటన, కంపెనీ బోర్డుఆఫ్ డైరెక్టర్ల ఆమోదము మేరకు యివ్వబడు చున్నది.

2. ప్రకటన అంశము,కంపెనీయొక్క బోర్డుఆఫ్‌డైరెక్టర్లచే 25.11.1982వ జరిగిన సమావేశంలోఆమోదించబడినది.
3. బోర్డుఆఫ్ డైరెక్టర్లచే ప్రకటన అంగీకరించు నపుడు మెజారిటీ సంఖ్యలో డైరెక్టర్ల సంతకంగల ఈ ప్రకటన కాపీని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్‌వారికి రిజిస్ట్రేషన్ కోసం దాఖలు చేయబడినది.

ఫర్ నాగేశ్వరరావు ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్,

మద్రాసు,

(సం.) ఎస్. రాధాకృష్ణ

తేది : 25—11—1982.

మేనేజింగ్ డైరెక్టర్.

అవీ... ఇవీ... అన్నీ...

నెహ్రూ సంగీత నృత్య కళాపరిషత్

నెహ్రూ ఆధ్వర్యములో జూలై 9, 10 తేదీలలో అఖిలభారత స్థాయిలో లలిత సంగీతం, సినీ సంగీతం, హిందీ సినిమా పాటలలోను, కూచిపూడి, భరతనాట్య రికార్డు డాన్సులలోను పోటీలు నిర్వహించబడును. ఈ పోటీలకు సినీ సంగీత దర్శకులు, సినీ నృత్య దర్శకులు, న్యాయనిర్ణేతలుగా వ్యవహరింతురు. పోటీలలో గెలుపొందినవారికి ప్రతి విభాగములోను ప్రథమ బహుమతి పొందిన వారికి రూ. 116/– లు, ద్వితీయ బహుమతి పొందినవారికి రూ. 58/–లు నగదు బహుమతులు కలవు. కూచిపూడి విజేతలకు నాట్యరాణి స్వర్గీయ తుర్లపాటి కృష్ణకుమారి షీల్డు, భరతనాట్య విజేతలకు స్వర్గీయ మాగుంట రాఘవరెడ్డి షీల్డు, సంగీతములో విజేతలకు ఎస్. పి. బాలసుబ్రమణ్యం షీల్డు బహుకరించబడును. ఇవిగాక 40 బహుమతులు కలవు. వివరాలకు సెక్రటరీ, నెహ్రూ నాటక కళాపరిషత్, నియర్ అనితా హాల్, నెల్లూరు–524003.

'స్పందన' కి నూతలపాటి సత్కారం

గంగాధరం సాహితీ కుటుంబం (చిత్తూరు) వారు ఈ సంవత్సరం నిర్వహించిన నవలల పోటీలో శ్రీ మంథా వెంకట రమణరావు రచించిన 'స్పందన' నవల నూతలపాటి సాహితీ సత్కారానికి యోగ్యమైనదిగా నిర్ణయించపడింది. పోటీకి వచ్చిన నవలలను పరిశీలించిన న్యాయ నిర్ణేతలు డా॥ ఎమ్. సుబ్బారెడ్డి, శ్రీ కలువకొలను సదానంద, డా॥ యు. శ్రీరామమూర్తి.

చిత్తూరులో జరిగే శ్రీగంగాధరం ఎనిమిదవ వర్ధంతి సభలో రచయితకు రు. 1,116/–లు, యోగ్యతాపత్రం బహూకరిస్తారని కార్యదర్శి ఎస్. మునిసుందరం తెలియచేశారు.

జ్ఞాపకాల శిలలు

(వచన కావ్యం) రచన : శ్రీ చంద్రమౌళి సెలువోజు, వెల: రు. 2/– 28 పేజీలు. ప్రతులకు రచయిత పేర, క్వార్టర్స్ నెం. ఎఫ్/224, ఎస్. ఎస్. పి. కాలనీ, పేకులపల్లి, ఖమ్మం– 507 004 అన్న చిరునామాకు వ్రాయాలి.

జలకన్య

సీరియల్ నవల. రచన : స్నేహానంద్ అడుగడుగునా ఉత్కంఠత కలిగిస్తూ పాఠకులను సుదూర సుందర తీరాలలో విహరింప చేసే 144 పేజీలు గల ఈ నవల వెల తొమ్మిది రూపాయలు. ప్రతులు : శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్, మ్యూజియమ్ రోడ్, ఏలూరు రోడ్ కార్నర్, గవర్నరుపేట, విజయవాడ–2.

వేకువ రేకులు

కథలు. రచన : శ్రీమతి సుజాతాదేవి. ఒక కథకు ఇంకొక కథతో పోలికలేకుండా ఇతివృత్తంలో వైవిధ్యం, పాత్రలచేత సంభాషణలు నడిపిన తీరు చక్కగాఉన్న ఈ పుస్తకం వెల: రు.8/–లు (120 పేజీలు). ప్రతులకు : స్పందన సాహితీ సమాఖ్య, 26 – 162, బుట్టాయిపేట, మచిలీపట్నం.

1982లో ఉత్పాదన, ఉత్తమ పారిశ్రామిక సంబంధాల విషయంలో ఘనవిజయాన్ని సాధించిన ఆం. ప్ర. హెవీ మెషినరీ అండ్ ఇంజనీరింగ్ సంస్థకి లభించిన అవార్డుని ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావునుంచి అందుకుంటున్న ఉద్యోగులసంఘం అధ్యక్షుడు శ్రీ ఎం.రామమూర్తి రెడ్డిని చిత్రంలో చూడవచ్చు.



తెలుగు వెలుగు చలం
అరుణాచలంలో చలం
ఆంధ్రలో చలం

రచన : శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ, ఇది మూడు పుస్తకాల సంపుటి. 'తెలుగు వెలుగు చలం'లో చలం అస్తమయం, ఆయన పోయాక పత్రికలలో వచ్చిన అపూర్వ సంచలనం, ఆయన వ్యక్తిత్వం, రచనల గురించి తర్జన భర్జనలు ఉన్నాయి (260 పేజీలు). 'అరుణాచలంలో చలం'లో ఆయన అరుణాచలం ఎందుకు వెళ్లాడు? అక్కడ ఆయన జీవనం, ఆయనలో వచ్చిన మార్పు గురించి ఉన్నాయి (231 పేజీలు). 'ఆంధ్రలో చలం'లో చలం బాల్యం, వివాహం, చదువు, తిరుగుబాట్లు, రచనలు, సంఘంతో పేచీలు, విరోధాలు మొదలయినవి ఉన్నాయి (254 పేజీలు). ఒక్కొక్క పుస్తకం వెల. రు. 25/–లు. ప్రతులకు : న్యూ స్టూడెంట్స్ బుక్ సెంటర్, విజయవాడ–2.

వార్షిక సంచిక

సాయి పబ్లిక్ స్కూలు వార్షిక సంచిక మా కార్యాలయం చేరింది. ఇందులో ప్రచురించిన కవితలు, వ్యాసాలు చదువుతుంటే విద్యార్థులకు గల సాహిత్యాభిలాష, రచనలో వారికి గల సామర్థ్యం స్పష్టంగా వ్యక్తమవుతోంది ప్రతులకు, వివరాలకు : సాయి పబ్లిక్ స్కూల్స్, విజయవాడ–10.

చైతన్య దీప్తి

కవితా సంపుటి రచన : శ్రీ చక్కా సత్యన్నారాయణమూర్తి. వెల : 6 రూపాయలు. 64 పేజీలు. ప్రతులకు : రచయిత పేర, చిన్నమసీదు ఎదుట, మెయిన్‌రోడ్, అమలాపురం–533201, తూ. గో. జిల్లా అన్న చిరునామాకు వ్రాయాలి.

అరుణ కిరణాలు

సంపాదకులు : శ్రీ ఎన్. వేణుగోపాల్, శ్రీ ఎస్. ఎమ్. ముస్తఫా, శ్రీ జి. వెంకటరెడ్డి అరుణ భారతి 6వ వార్షికోత్సవ సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక సంచిక ఈ పుస్తకం. ప్రతులకు : అరుణభారతి, సాహితీ సాంస్కృతిక సంస్థ, జనగాపల్లి (కర్నూలుజిల్లా).

సామాన్యుల కోసం వైద్యం

రచయిత : డాక్టర్ పి. వి. సుబ్బారావు. ఈ పుస్తకం వైద్య విజ్ఞానాన్ని సామాన్యునికి అవసరమైనంతవరకు అందిస్తుంది. ప్రతి వ్యాసం కథా రూపంలో ప్రారంభమయి ఆద్యంతం ఉత్కంఠతో కూడి ఉంటుంది. ప్రతి ఇంట ఉండదగిన 116 పేజీలు గల ఈ పుస్తకం వెల ఏడు రూపాయలు ప్రతులను రచయిత పేర, "సౌజన్య", తాడేపల్లివారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ–2, అన్న చిరునామాకు వ్రాసి పొందవచ్చు.

The stove that not only glows but glitters



chetak
Gas Stove

IS : 4246

ISI

Highlights :

- Perfectly Engineered.
- Swiss Technology Control Valve for Prevention of Gas leakage.
- Plated Burner Tops · Rust free.
- Better fuel efficiency
- Economically Priced.

DISTRIBUTORS FOR ANDHRA PRADESH
MADICON INDO-INTERNATIONAL
1-10-197/4, First Floor, Ashok Nagar X Roads
Hyderabad - 500 020. A.P INDIA
Phone. 61286, 64757 Grams MADICON

PRODUCT OF
JAINCO INDUSTRY
NEW DELHI

MAYURA

ప్రసిద్ధి చెందిన హిందుస్థాన్ పెట్రోలియం, భారత పెట్రోలియం మరియు ఇండియన్ గ్యాస్ డీలర్లవద్ద కూడ లభించును.

వంటలు



దించి డైమండ్సును ముంచి పళ్లెంలోకి తియ్యాలి. తరువాత పాకాన్ని ముదురుగాపట్టి డైమండ్సు కలిపే ముందు కొబ్బరికోరు కూడా వేసి డైమండ్సును పాకంలో బాగా కలిపి పళ్లెంలో ఆరనివ్వాలి. కొన్ని రోజులు నిల్వఉంటాయి.

– పి. భానుమతి, కొత్త

డైమండ్స్

కావలసిన వస్తువులు :— మైదాపిండి పావుకేజి, పంచదార అరకేజి, ఏలకుపొడి 2 స్పూన్లు, పుల్లటి పెరుగు అరకప్పు, నెయ్యి పావుకప్పు, డాల్డా అరకేజి, ఎండుకొబ్బరికోరు 1 కప్పు.

తయారుచేయు విధానం :— ముందుగా మైదాపిండిని బాగాజల్లించి పళ్లెంలోకి తీసుకోవాలి. తరువాత పిండిలో పెరుగు, ఒక అరకప్పు వేడిచేసిన డాల్డా వేసి కలపాలి. నీరు పోయకుండా కలపాలి. పిండిని పూరీల పిండి మాదిరిగా కలిపి మూతపెట్టి ఉంచాలి. ఎండుకొబ్బరి డాల్డాతో వేయించి పెట్టుకోవాలి. తరువాత ఒక అరగ్లాసు పంచదార రోటిలో పోసి మెత్తగా పొడికొట్టి పళ్లెంలోకి తీసుకోవాలి. పంచదార పొడిలో ఏలకుపొడి, కాగిన నెయ్యి పోసి ముద్దలా కలిపి పెట్టుకోవాలి. పిండిని బాగా మర్దించి చిన్న, చిన్న ఉండలు చేసి కొంచెం మందంతో చపాతీల మాదిరిగా ఒత్తుకోవాలి. తరువాత చాకులో డైనుండ్సు మాదిరి ముక్కలు కోయాలి. డైమండ్సు ముక్కలు మధ్యలో పంచదార మిశ్రమం రాస్తూ నాలుగయిదు ముక్కల్ని కలిపి ఒక డైమండుగా చేసి పెట్టుకోవాలి. ఇలా అన్ని చేసుకున్నతారువాత డాల్డాలో ఎర్రగా వేయించి తీసుకోవాలి. పంచదారలో తగినంత నీరుపోసి స్టౌమీద పెట్టాలి. పంచదార లేతపాకం వచ్చినపుడు

ఛాట్

కావలసిన వస్తువులు :— 500 గ్రా. బంగాళాదుంపలు, 100 గ్రా. చింతపండు, 100 గ్రా. బెల్లంపొడి, 2 కప్పుల పెరుగు, 3 ఉల్లిపాయలు, 4 చెంచాలు జీలకర్ర, 1 కప్పు నూనె లేక డాల్డా, ½ చెంచా గరమ్ మసాలా, ½ చెంచా కారం, పసుపు చిటికెడు, ఉప్పు సరిపడినంత.

తయారుచేయు విధానం :— జీలకర్రను పొడిగా వేయించి రోట్లో దంచి పొడి చేయాలి. పెరుగు పలచని బట్టలో వేసి మేకుకి వేలాడతీయాలి. నీరు అంతా పోయిన తరువాత ఆ చిక్కని ముద్దను గిలకొట్టి వుంచుకోవాలి. చింతపండు నానవేసి చిక్కని పులుసుతీసి అందులో బెల్లంపొడి, ఉప్పు, కారం, పసుపు, గరమ్ మసాలాపొడి వేయాలి. బాణలిలో ఒక చెంచా నూనెవేసి ఆవాలు, జీలకర్ర వేసి అవి చిటపటలాడుతుండగా చింతపండు రసం పోసి చిక్కగా దగ్గర పడేదాకా ఉడక నివ్వదించుకోవాలి. స్టౌమీద దళసరిపాటి (మందమైన) పెనం కాలేసి 4,5 చెంచాల నూనెవేసి బాగా కాగనివ్వాలి. బంగాళాదుంప ముద్దని, నిమ్మకాయ సైజులో ఉండలు చేసి అరచేతిలో వత్తి పెనంమీద 4,5వేసి అటూ ఇటూ బాగా నూనె వేస్తూ ఎర్రగా కాలనివ్వాలి. ప్లేటులో ఈ వేడి వేడి టిక్కీలు 2లేక 3 వేసి తయారుగా వుంచుకున్న చింతపండు పచ్చడి రెండు చెంచాలు, ఆ పైన ఒక చెంచా పెరుగు, ఆ పైన జీలకర్ర పొడుం, కొద్దిగా, ఉప్పు, కారం చల్లి సర్వ్‌చేయాలి. ఇవి వేడి వేడిగా తింటే చాల రుచిగా వుంటాయి.

– జి సూర్యకుమారి*

హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర


మతకలహాలు

మత సామరస్యానికి పునికి పట్టయిన మన రాజధానిలో ఇటీవల మతకలహాలు మితిమీరి పోతున్నాయి మే 28న పాతబస్తీలోని మంగల్ హాట్, చిస్తీచెమన్ ప్రాంతాలలో ఒక పెళ్ళి ఊరేగింపు ఒక వర్గం ప్రార్థనాస్థలం ముందు బ్యాండు వాయించడంతో ఈ కలహాలు చెలరేగి పది మంది మరణించారు ఈ వార్త జాలీ హనుమాన్ ప్రాంతానికి ప్రాకి అక్కడ ఒకవర్గం వారు మరొక వర్గం వారి ఇళ్లను తగుల బెట్టారు ఒక పాఠశాలను గూడా కాల్చారు మరణించిన వారిలో ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్, ఒక రిటయిరయిన ఇన్‌స్పెక్టరు ఉన్నారు ఈ కలహాలకు కారణమైన 20 మందిని అరెస్టు చేశామని పోలీసు కమిషనర్ శ్రీ విజయరామారావు తెలిపారు కలహాలు జరుగవచ్చుననే అనుమానం గల ప్రాంతాలలో పోలీసు బందోబస్తు గట్టిగా చేశామని ఆయన అన్నారు ఈ కలహాలకు కారణం మత మూల సూత్రాలు ప్రజాసామాన్యానికి అవగాహన కాకపోవడమే ఈ అవగాహన కోసం ప్రభుత్వం ప్రయత్నించాలి ఏ మతమూ పరాయి మతాన్ని అవమానించమని చెప్పదు ప్రతి మతానికి మానవత్వం మూల బంధం దేశ కాల పాత్రలనుబట్టి ఆయా మతాలు ప్రాదుర్భవించిన ప్రాంతాల ప్రభావం, ఆచార వ్యవహారాలు ఆ మతాలు వ్యాపించిన ప్రాంతాలకు ప్రాకడం సహజం అయినా మత సామరస్యానికి అవి ఆటంకం కలిగించరాదు ఈ విషయంలో మనం ఇండోనేషియాను ఉదాహృతిగా తీసుకో వచ్చు అక్కడ అతి ప్రాచీనమైన స్థానిక మతంపై భారతీయ మత ప్రభావం పడింది. మధ్య యుగాలలో వచ్చిన ఇస్లాం ఆగ్నేయాసియా అంతటా వ్యాపించింది అయినా అంతకు ముందున్న భారతీయ సంస్కృతి పోలేదు ఆ ప్రాంతాల ప్రజల రక్తంలో అది జీర్ణించింది కనుకనే నేటికీ వారి సంస్కృతినుంచి భారతీయత పోలేదు మతం మారినా, అక్కడి రామాయణ భారతాలు తమవేననే విశ్వాసంతో వున్నారు మనదేశంలో అలాకాదు మనదేశం ముస్లింలకు తాము సవూదీ అరేబియానుంచి దిగివచ్చినట్టే భావిస్తారు ఇలాటి మనస్తత్వం పోవాలి మన దేశం ద్విజాతి సిద్ధాంతంమీదే రెండు ముక్కలయి స్వతంత్ర్యమైంది, అలాంటప్పుడు అధిక సంఖ్యాకులయిన హిందువులపై చీటికి మాటికి ఆగ్రహం వెళ్ళగక్కడం ఉచితంకాదు ముఖ్యంగా దక్షిణ భారతంలోని వారికి ఈ వైఖరి చాల అవసరం నిజానికి భారతదేశంలో మైనారిటీల కున్నంత రక్షణ ప్రపంచంలో మరే మైనారిటీకీ లేదు వారి ప్రార్థనాస్థలాలకు, వారి వివాహాది సంప్రదాయాలకు సంపూర్ణమైన రక్షణవుంది జవాహర్‌లాల్ నెహ్రూ పుణ్యాన వారు ప్రధాన భారతీయ జీవన ప్రవాహంలో చేరక సమానాంతరంగా వుండే అవకాశం వదిలమయింది స్వాతంత్ర్యం సిద్ధించిన కొత్తలో కామన్ కోడ్‌కు ఉభయ మతానుయాయులలోని ప్రముఖులు ప్రయత్నించగా, తమకు మైనారటీలనబడే వారి వోట్లు రావని ఆ ప్రయత్నాలపై చన్నీళ్ళు చల్లారు మధ్యప్రాచ్య దేశాలలో ఉద్యోగాలకు వెళ్ళివచ్చిన వారినిబట్టి అక్కడ ఇతర మతానుయాయులు పరోక్షంగా ఎంతటి నిర్బంధాలకు గురిఅవుతున్నారో తెలుస్తుంది అక్కడ హిందూ ఉద్యోగులు బొట్టుపెట్టుకోడాన్ని అక్కడి వారు నిరసిస్తూ, బొట్టు తుడిచేసేవరకు వూరుకోలేదట ఇలాటి నిర్బంధాలతో వుండలేమని ఒకాయన వచ్చేశాడు భారతదేశముస్లింలను కూడా వారు సమానంగా చూడరని, భారత ముస్లింలను వారు ఇండ్లలోకి రానివ్వరని కూడ ఆయన అన్నారు భారతీయ ముస్లింలు కొత్తగా మతం పుచ్చుకొన్నవారని తాము మతంతోనే పుట్టామని వారి అభిప్రాయం అధిక సంఖ్యాకులు ఓర్పుతో వున్నారుగదా అని అల్పసంఖ్యాకులు మరీ బరి తెగించడం ఉచితం కాదు కదా! శ్రీ విజయ రామారావు వంటి సమర్థుడయిన కమిషనర్ పాలనలో మతకలహాలు సమసిపోతాయని భావిస్తున్నాను ఇలాటి మతకలహాలుసృష్టిస్తున్న వారికి ముఖ్యమంత్రి శ్రీ రామారావు మే 29న చేసిన హెచ్చరికను అందరూ గుర్తించాలి

వేద పార పరిరక్షణ నిధి :

కంచికామకోటి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి 90వ జయంతి సందర్భంగా గడచిన మార్చి నెలలో నెలకొన్న వేద పార పరిరక్షణ నిధి దేశంలోని వేద పండితులకు ఆర్థిక సహాయం చేస్తుంది హర్యానా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్రలలో వున్న ప్రముఖ వేద పండితులకు ఈ నిధి ఏటా 1200 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తుంది దేశంలోని ప్రముఖ వేద పండితుల సమగ్రమైన వివరాలను ఈ నిధి సేకరిస్తుంది వేదాన్ని లక్షణాంతం అధ్యయనం చేయడానికి 21 సంవత్సరాలు పడుతుంది ఈ విధంగా లక్షణాంత స్వాధ్యాయులు దేశంలో వంద మంది మాత్రమే వున్నారట ఈ నిధికి ధర్మకర్తలుగా సుప్రసిద్ధ న్యాయశాస్త్రజ్ఞులు శ్రీ ఎస్ ఎ పాల్కీవాలా, శ్రీ హరీష్‌మహేంద్ర, శ్రీ టి ఏ సంతానం, శ్రీ ఎస్ బి మోహతా వ్యవహరిస్తారు

ఇందూరు (నిజామాబాద్) నగర నట సమాఖ్యవారు ఇటీవల నిర్వహించిన నాలుగవ వార్షిక నాటక పోటీలని శ్రీ జె వి సోమయాజులు జ్యోతిని వెలిగించి ప్రారంభిస్తున్న దృశ్యం సమాఖ్య అధ్యక్షుడు శ్రీ ఎస్ ఎస్ కుమార శర్మ, కార్యదర్శి శ్రీ వై సాయన్న, సంయుక్త కార్యదర్శి శ్రీ బి లక్ష్మీనరసయ్య, తదితరులని చిత్రంలో చూడవచ్చు



హైదరాబాద్ నోట్ బుక్

నీటి కోసం నానా పాట్లు :

పూర్వం ఒకాయన "పరమేసా గంగ విడువు పార్వతి చాలున్" అని నీటికోసం పరమేశ్వరుణ్ణి ప్రార్థించాడట. జంటనగరాలవు ప్రజలు నీటికోసం ఏ దేవుణ్ని ప్రార్థించినా ఫలితం కలగడం లేదు. మే చివరివారంలోను, జూన్ మొదటి వారంలోను నీటికోసం జంటనగరాల ప్రజలు పడినపాట్లు ఎవ్వరికీ వద్దనిపించింది. వాస్తవానికి మే చివరికి రాష్ట్రంలో వానలు పడాల్సింది. కాని, అలా జరుగలేదు. ఋతుపవనాలు కనికరించలేదు. జంటనగరాలలో నీటికోసం ఆడా మగా భేదం లేకుండా బిందెలు, బొక్కెనలు పట్టుకొని వెళ్లడం, ఎక్కడో వస్తున్న ఏదో కొళాయి వద్ద బారులు తీరి నిలబడడం నిత్య దృశ్యాలయ్యాయి. ఇలాటి దృశ్యాలు ఇటీవలి సంవత్సరాలుగా లేవు. ఈ సందర్భంలో ఆటోలక్కూడా గిరాకీ ఎక్కువయింది. శ్రీమంతుల ఇండ్ల మహిళలు స్టెయిన్‌లెస్ స్టీల్ బిందెలతో ఆటోలలో మంచినీళ్లు తేవడం సామాన్యులకు కుతూహలం కలిగించే వినోదం. బావి నీళ్లంటే మొగం చిట్లించే బడే సాబులు ఆప్యాయంగా వాటినే తాగుతున్నారు. జంటనగరాలకు మంచినీరు సరఫరా చేసే మంజీరా డాంకు మహారాష్ట్ర నుంచి నీరు తీసుకువచ్చే అవకాశం గురించి రాష్ట్ర ప్రభుత్వం సంప్రతింపులు జరుపుతున్నట్లు జూన్ 2వ తేదీన మునిసిపల్ వ్యవహారాల మంత్రి శ్రీ ఎనమల రామకృష్ణుడు తెలిపారు. మంజీరా నీటిమట్టం పడిపోయిన సంగతి అధికారులు ముందుగా తెలుపలేదని వారి నిర్లక్ష్యాన్ని విచారించడానికి ఒక కమిటీని వేశామని ఆయన అన్నారు. ముందుగానే ఈ విషయాలు వూహించి తగు సూచనలు చేయడం వారి బాధ్యత అని ఆయన అన్నారు.

ఆటో చార్జీల పెంపు :

అదృష్టమంటే ఆటో వాళ్లదే. ఈ పది సంవత్సరాలలో కనీసపు చార్జి 30 పైసలనుంచి 170 పైసలకు పెరుగుతూ వచ్చింది చకచకా, ఈ విధంగా పెంచినట్టు రవాణాశాఖా మంత్రి శ్రీ సత్యనారాయణరావ్ తెలిపారు. ఏం పెరిగితే ఏం సార్, మాకు గిట్టుబాటయేది దినకూలేగదా! యజమానులకే లాభం. ఎంతమంది ఆటో డ్రైవర్లకు స్వంత ఆటోలున్నాయి చెప్పండి?— అని ఒక ఆటో డ్రైవరు నన్ను ప్రశ్నించాడు.

కెనడా ఓపెన్ యూనివర్శిటీ :-

కెనడాలోని ఓపెన్ యూనివర్శిటీ అలూబెస్కాలో సాంఘిక విజ్ఞాన శాఖాధ్యక్షుడు డాక్టర్ టెయిలర్ మే 23న పత్రికా ప్రతినిధుల గోష్ఠిలో ముచ్చటిస్తూ, ఓపెన్ యూనివర్శిటీ విద్యా విధానం తమ దేశంలో చాలా ప్రజాదరం పొందుతున్నదని, తమ అలూబెస్కా ఓపెన్ యూనివర్శిటీ కెనడాలోని పెద్ద విశ్వవిద్యాలయాలలో మూడవదని అన్నారు. దీనిని బట్టే ఓపెన్ యూనివర్శిటీల ప్రజా రంజకతను అంచనా వేయవచ్చునని ఆయన అన్నారు. పెక్కు కారణాలవల్ల పై చదువులు చదవలేక పోయినవారు ఇంకా పై చదువులు చదువాలను కొన్నవారు ఈ విశ్వవిద్యాలయంలో చేరుతారనీ ఆయన అన్నారు. విద్యార్థులలో ఎక్కువ మంది మహిళలు, ఉద్యోగులు. విద్యార్థులలో 80 శాతం వయస్సు 21 మొదలు 40 ఏళ్లు. ఈ విశ్వవిద్యాలయం ఎనిమిది సంవత్సరాల క్రితం స్థాపించారు. ఈ స్వల్ప వ్యవధిలోనే ఇది దేశంలోని విశ్వవిద్యాలయాలలో తృతీయ స్థానం ఆక్రమించుకొంది. దీనికి ఏటా దాదాపు కోటి రూపాయలు ఖర్చవుతుంది. దీనిలో 90 శాతం ప్రభుత్వం గ్రాంటు, తక్కినది విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీజు మూలంగా చేకూరుతుంది. ఈ విశ్వవిద్యాలయంలో రసాయనాది శాస్త్రాలు మొదలు బిజినెస్ మేనేజ్‌మెంట్ వరకు 90 విషయాలు బోధిస్తారు. 120 మంది పూర్తి కాలం ఆచార్యులు, 300 మంది స్వల్పకాలం ఆచార్యులు ఉన్నారు. ఈ విశ్వవిద్యాలయానికి పెక్కు ప్రాంతాలలో కేంద్రాలున్నాయి. వాటి ద్వారా విద్యార్థులకు నోట్సు అందజేస్తారు. రేడియో, దూరదర్శిని ద్వారా కూడ పాఠాలు చెబుతారు — అని ఆయన అన్నారు. భారత దేశంలోని నిరక్షరాస్యతా నిర్మూలనకు ఉపగ్రహలను, రేడియో దూరదర్శనులను విరివిగా వాడుకోవచ్చునని ఆయన అన్నారు. మన రాష్ట్రంలో ఏర్పడిన ఓపన్ యూనివర్శిటీ కెనడా అలూబెస్కా విశ్వవిద్యాలయం అనుభవాలనుంచి లాభం పొందవచ్చు.


శోభానాయుడుకు మారిషస్ ఘన స్వాగతం :

సాంస్కృతిక సంబంధాల భారతీయ మండలి ఆధ్వర్యాన సాంస్కృతిక వినిమయ కార్యక్రమం కింద మారిషస్‌లో 12 రోజులపాటు పర్యటించివచ్చిన సుప్రసిద్ధ నర్తకి కుమారి శోభానాయుడు పత్రికా ప్రతినిధులతో ముచ్చటిస్తూ, మారిషస్‌పర్యటన తనకు, తన బృందానికి గొప్ప ప్రోత్సాహానందాలను ఇచ్చిందని, మారిషస్‌లోని అరవై వేల పైచిలుకు తెలుగువారు తమకు అఖండస్వాగత మిచ్చారని అన్నారు. తమ బృందం మారిషస్‌దీవిలోని వివిధ ప్రాంతాలలో ఏడు నృత్యకార్యక్రమాలు నిర్వహించిందని ఆమె అన్నది. శోభానాయుడు బృందం తొలిప్రదర్శనం మోకాలోని గొప్ప మహాత్మాగాంధి సంస్థలో ఏప్రిల్ 12న జరిగింది. మారిషస్ ప్రధాని శ్రీ అనిరూద్ జగన్నాథ్ ముఖ్యఅతిథిగా వున్నారు ఇది కృష్ణపారిజాతం నృత్యనాటిక. దీనిని ప్రజలు విశేషంగా ఆదరించడంవల్ల మరి రెండు మూడు చోట్ల ప్రదర్శించవలసి వచ్చింది. శోభానాయుడు ప్రదర్శనాలలో పాల్గొనడమేకాక, మారిషస్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పోరేషన్, టెలివిజన్ ఏర్పాటుచేసిన పెక్కు హిందీ, ఇంగ్లీషు, తెలుగు ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు; భారత సంగీత నృత్య మండలిలో సోదాహరణ ప్రసంగం చేశారు. మా ప్రదర్శనాలకు ప్రధానమంత్రి, ఉప ప్రధాన మంత్రి, ఉన్నత ప్రభుత్వాధికారులు వచ్చారు. మా బృందానికి విందులు, తేనీటి విందులు చేశారు— అని శోభానాయుడు అన్నారు. మారిషస్‌లోని తెలుగువారు, తమకొక కూచిపూడి నృత్యోపాధ్యాయుడు కావాలని కోరుతున్నారని, ఈ విషయం కోసమూ, ఇతర విషయాలలోను భారత ప్రభుత్వ సహకారం కోసం వచ్చే సెప్టెంబరులో మారిషస్ మంత్రి నాయకత్వంలో ఒక ప్రతినిధివర్గం భారత దేశానికి రానున్నదని ఆమె తెలిపారు. ఈ బృందంలో శోభానాయుడు కాక నర్తకులు పద్మజా రెడ్డి, అనూరాధారావ్, ఈశ్వరప్రసాద్, నట్టువాంగానికి మహాకాళి మోహన్, గాత్ర సంగీతానికి కనకదుర్గ, మార్దంగికులు ఆంజనేయులు, వేణుగానానికి దత్తాత్రేయ, వాయులీనానికి అశోక్, బృంద నిర్వాహకులుగా గిడుగు రామమూర్తి వున్నారు.

ఉపశ్రుతి :

ఏదన్నా వ్యాపారం చేద్దామనుకున్నాను. జర్నలిస్టుగా మీ సలహా ఏమిటి ? — అనడిగారొక మిత్రులు. అడక్కడక్క ఆయన్నే అడిగారూ! పెట్టుబడిలేని వ్యాపారం బడి నడపడం. ముంగిట్లో పాకవేసి చక్కగా చాపలు పరచండి. సకల భాషల మీడియంలోను చదువు చెబుతామని బోర్డు వేయండి. బల్లలు, కుర్చీలు లేవే అంటే గురుకుల పద్ధతి అనండి. నిరుద్యోగులయిన పట్టభద్రులు కరువులో పోయేంతమంది ఉన్నారు. తమకేదో అనుభవం కలుగుతుందనే ఆశతో వస్తారు. వారికి కొంత ఇవ్వండి, మీరు అంతా తీసుకోండి— అన్నారు మా మాటలు వింటున్న మరొక మిత్రులు. ★

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, MallikarjunaRao Street Gandhinagar, Vijayawada-3 Editor : S Radhakrishna.



అమృతాంజన్‌కే తెలుసు తలనొప్పి బాధ

అసలు తల నొప్పి అంటేనే భరించలేని బాధ. దాన్ని పోగొట్టుకోడానికి సుళువైన మార్గమే, కొంచెం అమృతాంజన్ తీసుకొని కణతల మీద బాగా గట్టిగా నిమిరి పట్టించండి. వెంటనే తల నొప్పి తగ్గిపోయి హాయిగా వుంటుంది.

అమృతాంజన్ ఇతర మందులవలెగాదు. అమృతాంజన్‌లో చేరివున్న శక్తివంతమైన 10 ఔషధాలు అమోఘంగా పని చేసి రాసిన చోట పై చర్యవల్ల అతి త్వరగా ఇట్టే నొప్పిని నివారిస్తుంది ఏ అపాయం వుండదు.

85 సంవత్సరాలకు పై బడిన ప్రసిద్ధి కల అమృతాంజన్ వొంటి నొప్పులకు, బెణుకులకు, జలుబులకు గొంతు నొప్పులకు కూడా చాలా అమోఘంగా పనిచేసి నివారిస్తుంది.

ఎప్పుడూ అమృతాంజన్ చేతికి అందుబాటుగా వుంచుకోటం మంచిది. ఎందుకంటే ఎప్పుడు అవసర మొస్తుందో చెప్పలేము.



అమృతాంజన్

శీఘ్ర నివారిణి. నమ్మకమైనది. ఏ ఇతర బాధనూ కలుగచేయదు.

OBM 7652 TG-R